

# ఈ మట్టి చైతన్యమే నాకు స్ఫూర్తి

హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ పాలనకు ఏడాది పూర్తయిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి 'ఎక్స్'లో ఆసక్తికర పోస్టు చేశారు. పోరాటాలు, ఉద్యమాలు, త్యాగాలు, ఆత్మబలిదానాలు, ఆకాంక్షలు, ఆశయాలను అన్నింటినీ కలిపి వీలునామాగా రాసి డిసెంబర్ 7, 2023 నాడు తెలంగాణ తన చేతుల్లో పెట్టిందన్నారు. వారసత్వాన్ని సగర్వంగా, సమున్నతంగా ముందుకు తీసుకువెళ్లే బాధ్యతను రాష్ట్రం అప్పగించిందని చెప్పారు. "ఆ క్షణం నుంచి జన సేవకుడిగా, ప్రజా సంక్షేమ శ్రామికుడిగా.. మదిలో, విధిలో, నిర్ణయాల జడిలో.. సకల జనహితమే పరమావధిగా.. జాతి ఆత్మగౌరవమే ప్రాధాన్యతగా.. సహచరుల సహకారంతో.. జనహితుల ప్రోత్సాహంతో.. విమర్శలను సహిస్తూ.. విద్వేషాలను ఎదిరిస్తూ.. స్వేచ్ఛకు రెక్కలు తొడిగి.. ప్రజాస్వామ్యానికి రెడ్ కార్పెట్ పరిచి.. అవనిపై అగ్ర భాగాన తెలంగాణను నిలిపేందుకు..గొప్ప లక్ష్యాల వైపు నడుస్తూ.. నాలుగు కోట్ల ఆశయాలను నడిపిస్తూ.. నిరంతరం జ్వలించే ఈ మట్టి చైతన్యమే స్ఫూర్తిగా...విరామం ఎరగక విశ్రాంతి కోరక ముందుకు సాగిపోతున్నాను. ఏడాది ప్రజాపాలనలో ఎంతో సంతృప్తి... సమస్త ప్రజల ఆకాంక్షలు సంపూర్ణంగా నెరవేర్చడమే నా సంప్రాప్తి" అని రేవంత్‌రెడ్డి పోస్టు చేశారు.



# ప్రజాపాలన విజయోత్సవాలు.. గవర్నర్, కేసీఆర్, కిషన్‌రెడ్డికి ఆహ్వానం



హైదరాబాద్: ప్రజాపాలన విజయోత్సవాలు, తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, భారాస అధినేత కేసీఆర్‌ను ప్రభుత్వం ఆహ్వానించింది. హైదరాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్.. రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను, దిల్‌కుషా అతిథిగృహంలో కిషన్‌రెడ్డిని కలిసి ఉత్సవాలకు రావాల్సిందిగా ఆహ్వానపత్రాలు అందజేశారు. అనంతరం ఎర్రవెల్లికి వెళ్లి మాజీ సీఎం, భారాస అధినేత కేసీఆర్‌ను ఆహ్వానించారు. మంత్రి వెంట రాష్ట్ర ప్రభుత్వ ప్రొటోకాల్ సలహాదారుడు హర్కర వేణుగోపాల్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ ఉన్నారు.

కేసీఆర్‌ను కలిసిన అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణ తల్లి విగ్రహం రూపంపై కేసీఆర్‌తో ఎలాంటి చర్చ జరగలేదన్నారు.

ప్రభుత్వం తరఫున మర్యాదపూర్వకంగా ఆహ్వానించామని, వస్తారో లేదో ఆయన ఇష్టమని మంత్రి వ్యాఖ్యానించారు.



## యాదాద్రి జిల్లాలో ఘోర ప్రమాదం
# చెరువులోకి దూసుకెళ్లిన కారు

## యాదాద్రి జిల్లాలో ఘోర ప్రమాదం.. కారు చెరువులోకి దూసుకెళ్లి ఐదుగురి మృతి

భువనగిరి : యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం జలాల్‌పూర్ వద్ద కారు అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లింది. శనివారం తెల్లవారుజామున 4.30 గంటలకు ఈ ఘటన చోటు చేసుకుంది. కారు చెరువులో మునగడంతో ఐదుగురు యువకులు మృతి చెందారు. పోలీసులు వారి మృతదేహాలను వెలికితీశారు. మృతులను హైదరాబాద్ ఎల్బీనగర్‌లోని ఆర్టీసీ కాలనీకి చెందిన హర్ష, దినేశ్, వంశీ, బాలు, వినయ్‌గా గుర్తించారు. మృతదేహాలను భువనగిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాద సమయంలో కారులో ఆరుగురు యువకులున్నారు. మణికంఠ యాదవ్ అనే వ్యక్తి కారు అద్దాలు పగులగొట్టి సురక్షితంగా ప్రాణాలతో బయటపడ్డారు. హైదరాబాద్ నుంచి భూదాన్ పోచంపల్లికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మృతులంతా 20 నుంచి 21 ఏళ్ల వయసు లోపు వారే.

శుక్రవారం రాత్రి ఇంట్లో నుంచి వీరు బయలుదేరినట్లు సమాచారం. మద్యం మత్తులోనే ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై భూదాన్ పోచంపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. **గ్రామస్థుల నిరసన..** సంఘటనా స్థలి వద్ద జలాల్‌పూర్ గ్రామస్థులు నిరసనకు దిగారు. ప్రమాదకరంగా ఉన్న మలుపు వద్ద సూచికలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా రాకపోకలు స్తంభించాయి.

# నిజాంసాగర్‌ను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతాం: మంత్రి జూపల్లి

కామారెడ్డి: వందేండ్ల చరిత్ర కలిగిన నిజాంసాగర్ పర్యాటకానికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పర్యాటక ప్రమోషన్‌లో భాగంగా ప్రాజెక్టు ను సందర్శించారు. నిజాంసాగర్‌లో ప్రాచీన కట్టడాలైన గోల్‌బంగ్లా, గుల్‌గస్త్ బంగ్లా, వీఐపీ గార్డెన్, స్విమ్మింగ్ పూల్, తదితర కట్టడాలను జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావుతో కలిసి పరిశీలించారు. పర్యాటక అభివృద్ధికి ఉన్న అవకాశాలను సంబంధిత అధికారులతో చర్చించారు. నిజాంసాగర్ జాలాశాయంతో పాటు పరిసరాల ప్రాంతాల అభివృద్ధికి 12 ఎకరాల స్థలాన్ని పర్యాటక అభివృద్ధి సంస్థకు రెవెన్యూ శాఖ అప్పగించినట్లు అధికారులు మంత్రికి వివరించారు. ప్రాజెక్టు సందర్శనకు వచ్చే పర్యాటకులకు జలాశయంలో ఆహ్లాదం కోసం బోటింగ్, డ్యాం దిగువన కాటేజీలు, ఉద్యానవనం, చిన్న పిల్లల పార్కు తదితర సౌకర్యాలు అందుబాటులో తీసుకువచ్చేందుకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. అనంతరం నిజాజంసాగర్ హైడ్రో పవర్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాల వర ప్రదాయిని నిజాంసాగర్ ప్రాజెక్టు పర్యాటక ప్రదేశాలు అద్భుతంగా ఉందని, వందేండ్లు గడిచినా చెక్కుచెదరలేదని అన్నారు. మూడు కాలాలు



ఎప్పుడూ నిండుకుండలా ఉన్న నిజాంసాగర్ జలాశయం పర్యాటక అభివృద్ధికి అపారమైన అవకాశాలు ఉన్నాయని తెలిపారు ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యంతో (పీపీపీ) ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. తెలంగాణలో ఉన్న పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేసేందుకు త్వరలోనే నూతన పర్యాటక పాలసీ అమల్లోకి తెస్తామని వెల్లడించారు. నిజాంసాగర్ హైడ్రో పవర్ స్టేషన్‌లో 10 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామని, త్వరలోనే డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కతో చర్చించి, దీన్ని పూర్తిగా ఆధునీకరిస్తామని పేర్కొన్నారు.

# ఐదేళ్లలో మహిళలకు రూ.లక్ష కోట్ల రుణాలు: డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్: మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని... ఇందులో భాగంగానే ఏటా రూ. 20వేల కోట్ల వడ్డీలేని రుణాలను అందిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల మేర రుణాలు మహిళలకు ఇవ్వాలని నిర్దేశించుకున్నామన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనేదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. పర్యాటక భవన్‌లో తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కతో కలిసి భట్టి విక్రమార్క ప్రారంభించారు. సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలకు చెందిన ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలు ఏర్పాటు చేసిన స్టాళ్లు పరిశీలించిన భట్టి.. అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. భవిష్యత్తులో అవి మధ్య, భారీ పరిశ్రమలుగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందన్నారు. గ్రామీణ మహిళల్లోనూ వ్యాపారదక్షత ఉంటుందని.. పర్యావరణానికి హాని కలగకుండా చేసే ఉత్పత్తులను ఆదరించాలని భట్టి కోరారు.

# నిర్మాత దిల్‌రాజుకు తెలంగాణ ప్రభుత్వం కీలక పదవి



టాలీవుడ్ నిర్మాత దిల్ రాజుకు తెలంగాణ ప్రభుత్వం కీలక పదవి ఇచ్చింది. తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎఫ్‌డీసీ) ఛైర్మన్‌గా ఆయన్ని నియమించింది. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పదవిలో దిల్‌రాజు రెండేళ్ల పాటు కొనసాగనున్నారు. దిల్ రాజు అసలు పేరు వెంకటరమణారెడ్డి. 1990లో 'పెళ్లి పందిరి' సినిమాతో పంపిణీదారుడిగా కెరీర్ ప్రారంభించిన ఆయన ప్రస్తుతం ఇండస్ట్రీలో అగ్ర నిర్మాతగా కొనసాగుతున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై సినిమాలను నిర్మిస్తున్నారు. 2003లో దిల్ సినిమాకు తొలిసారి నిర్మాతగా వ్యవహరించారు. ఆ చిత్రం విజయం సాధించడంతో ఆయన పేరు దిల్‌రాజుగా మారింది. ప్రస్తుతం ఆయన మూడు సినిమాలకు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. రామ్‌చరణ్-శంకర్‌ల కాంబోలో రానున్న భారీ బడ్జెట్ చిత్రం 'గేమ్ ఛేంజర్'ను నిర్మిస్తున్నారు. ఇది వచ్చే ఏడాది జనవరి 10న ప్రేక్షకుల ముందుకురానుంది. అలాగే అగ్ర కథానాయకుడు వెంకటేశ్‌తో 'సంక్రాంతికి వస్తున్నాం' చేస్తున్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఇది తెరకెక్కుతోంది. ఈ చిత్రం కూడా వచ్చే ఏడాది జనవరి 14న విడుదల కానుంది. దీంతోపాటు వేణు శ్రీరామ్ దర్శకత్వంలో రానున్న 'తమ్ముడు'కు నిర్మాతగా వ్యవహరించనున్నారు.

# రైతులు ఎప్పుడూ.. ఆశపడతారే తప్ప అడుక్కోరు: కేటీఆర్




హైదరాబాద్: డబ్బులు వచ్చే వ్యవసాయం చేయాలే తప్ప.. అడుక్కుతినే బతుకు వద్దంటూ రైతులను ఉద్దేశించి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నదాతల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసి, రైతును రహదారులపైకి లాగిన మీరా రైతుల గురించి మాట్లాడేదని మండిపడ్డారు. రైతుభరోసాకు ఎగనామం పెట్టి, రుణమాఫీ పేరుతో కనికట్టు చేసిన మీరా రైతుల గురించి మాట్లాడేదంటూ ధ్వజమెత్తారు. రైతులు ఎప్పుడూ ఆశపడతారు తప్ప అడుక్కోరని చెప్పారు. వారికి సమయం రాకపోదని, మీకు తగిన గుణపాఠం చెప్పకపోరంటూ ఎక్స్ వేదికగా విమర్శించారు. 'రైతే రాజు నినాదం కాదు కేసీఆర్ ప్రభుత్వ విధానం. అడగకుండానే రైతుబంధు.. అడగకుండానే రైతుబీమా.. అడగకుండానే సాగునీళ్లు.. అడగకుండానే ఉచితంగా 24 గంటల కరంటు.. అడగకుండానే 100 శాతం పంటల కొనుగోళ్లు. దశాబ్దాల కాంగ్రెస్ పాలనతో వ్యవసాయ రంగం వెన్నువిరిగి, బతుకుదెరువు కోసం వలసబాట పట్టిన అన్నదాతలలో ఆత్మవిశ్వాసం నింపి వ్యవసాయం దండగ కాదు పండగ అని చాటిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిది. కరోనా విపత్తులోనూ కర్షకులకు బాసటగా నిలిచిన చరిత్ర కేసీఆర్ గారిది. ప్రతి ఊరికీ వెళ్లి పంటలు కొనుగోలు చేసిన ఘనత కేసీఆర్ గారిది. రైతుబంధును రాజకీయం చేసి, రైతుభరోసా అంటూ భ్రమలు కల్పించి, రైతుభీమాను మాయం చేసి, 24 గంటల ఉచిత విద్యుత్తును ప్రశ్నార్థకం చేసి.. పంటల కొనుగోళ్లకు పాతరవేసి సాగునీళ్లను సాగనంపి.. అన్నదాతల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసి రైతును రహదారుల పైకి లాగిన మీరా.. రైతుల గురించి మాట్లాడేది! రైతుభరోసాకు ఎగనామం పెట్టి, రుణమాఫీ పేరుతో కనికట్టు చేసిన మీరా.. రైతుల గురించి మాట్లాడేది! ఇల్లిల్లూ తిరిగి అబద్దపు హామీలు ఇచ్చి నాడు ఓట్లు అడుక్కున్న చరిత్ర మీది. అధికారం దక్కాక ఇల్లిల్లూ తిరిగి ఎమ్మెల్యేలను అడుక్కుని, కొనుక్కున్న చరిత్ర మీది.

రైతులు ఎప్పుడూ.. ఆశపడతారు తప్ప అడుక్కోరు. సమయం రాక పోదు, మీకు గుణపాఠం చెప్పక పోరు. జాగో తెలంగాణ జాగో' అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

# రేవంత్ రెడ్డి.. మాట మార్చడమే మీ విధానమా?: హరీశ్‌రావు

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే ఏమార్చడం, మోసం చేయడమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. నాడు ఫార్మా సిటీ అన్నారు, నేడు మాట మార్చి పచ్చటి పొలాల్లో చిచ్చు బెడుతున్నారని విమర్శించారు. గిరిజనుల బిడ్డలను జైళ్ల పాలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వస్తే ట్రిపుల్ ఆర్ రోడ్డు అలైన్‌మెంటును మారుస్తామన్నారని.. ఇప్పుడేమో మాట మార్చి, నిర్బంధాల మధ్య భూసేకరణ కొనసాగిస్తున్నారని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి.. మాట మార్చడమే మీ విధానమా? ప్రజలను మభ్య పెట్టడమే కాంగ్రెస్ పద్ధతా అని నిలదీశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ట్రిపుల్ ఆర్ బాధితులు, రైతులు హరీశ్‌రావును కలిశారు. ఈ సందర్భంగా RRR విషయంలో ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీని, ఎన్నికల తర్వాత మాట తప్పిన వైఖరిని ఆయనకు వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యేలు ఎవరూ తమ బాధను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన మాట తప్పి, నిబంధనలకు విరుద్ధంగా సర్వేలు నిర్వహిస్తున్నారని, భూసేకరణ పత్రాలపై బలవంతంగా సంతకాలు పెట్టిస్తున్నారని బాధను వెలిబుచ్చారు. భూసేకరణ చట్టం అమలు చేయకుండా, తక్కువ ధరకే భూములు లాక్కునే కుట్ర చేస్తున్నారని వివరించారు. తమ సమస్య పట్ల ప్రభుత్వాన్ని అసెంబ్లీలో నిలదీయాలని కోరారు. ఈ సందర్భంగా హరీశ్ రావు బాధితులకు ధైర్యం చెప్పారు. ఎన్నికల హామీలో చెప్పిన విధంగా కాంగ్రెస్ మాట నిలుపుకునే వరకు బాధితులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ.. 'ఉత్తర దిక్కు ట్రిపుల్ ఆర్ బాధితులకు న్యాయం చేస్తామని, ఎన్నికల్లో ఇచ్చిన హామిని నిలబెట్టుకోవాలని ప్రియాంకా గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎమ్మెల్యేలు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలను బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం. భువనగిరిలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో బాధితులకు కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ చేత హామీ ఇప్పించి ఇప్పుడు మాట మార్చడం దుర్మార్గం. ఆర్ఆర్ఆర్ ఏర్పాటు విషయంలో ఉత్తర భాగంలో 40 కిలోమీటర్లకు బదులుగా 28 కిలో మీటర్లను పరిగణనలోకి తీసుకోవడం వల్ల చౌటుప్పల్ మున్సిపాలిటీ, మండల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పట్టణం మధ్య నుంచి రోడ్డు వెళ్లడంతో మున్సిపాలిటీ రెండు భాగాలుగా విడిపోతున్నది. బాధితులు రెండు పంటలు పండించే పచ్చని పొలాలను, ఇండ్లు, ప్లాట్లను కోల్పోతున్నా ప్రభుత్వం కనికరించడం లేదు. చౌటుప్పల్ వద్ద జంక్షన్ రింగు గతంలో 78 ఎకరాల్లో ఉంటే ఇప్పుడు 184 కు పెంచడం వల్ల పేదల భూములు, ప్లాట్లు కోల్పోతున్నారు. దీనికిగాను నష్టపరిహారం కూడా తక్కువ చెల్లిస్తున్నారు. ఎంపీగా ఉన్నపుడు కోమటి రెడ్డి.. బాధితులతో కలిసి ఆర్ఆర్ఆర్‌ను మార్చాలని, రాయగిరి, చౌటుప్పల్ రైతులతో కలిసి ధర్నాలు చేశారు. పార్లమెంటు ఎన్నికల సందర్భంలోనూ అలైన్‌మెంట్ మార్చుతామని హామీలు ఇచ్చారు. కానీ, ఇప్పుడేమో అదే పోలీసు బలగాలతో, నిర్బంధంగా రోడ్డుకు 28 కిలోమీటర్ల పరిధిలోనే సర్వే చేయించి, ఒప్పంద పత్రాల మీద సంతకాలు పెట్టాలని బలవంత పెట్టడం దుర్మార్గం. రైతులను కాదని సర్వేలు నిర్వహించడం, వారిని భయభ్రాంతులకు గురిచేయడం సిగ్గుచేటు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే ఏమార్చడం, మోసం చేయడం. నాడు ఫార్మా సిటీ అన్నారు, నేడు మాట మార్చి పచ్చటి పొలాల్లో చిచ్చు బెడుతున్నారు. గిరిజనుల బిడ్డలను జైళ్ల పాలు చేశారు. నాడు ట్రిపుల్ ఆర్ రోడ్డు అలైన్మెంట్ మార్పు అన్నారు నేడు మాట మార్చి, నిర్బంధాల మధ్య భూసేకరణ కొనసాగిస్తున్నారు. రేవంత్ రెడ్డి.. మాట మార్చడమే మీ విధానమా? ప్రజలను మభ్య పెట్టడమే కాంగ్రెస్ పద్ధతా?. భువనగిరిలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ప్రియాంక గాంధీతో.. ఆర్ఆర్ఆర్ భూములు కోల్పోయిన రైతులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని చెప్పించారు. కానీ, అధికారంలోకి రాగానే బాధితుల పట్ల కర్కశంగా వ్యవహరిస్తూ తీవ్ర మానసిక క్షోభకు గురిచేస్తున్నారు.

వేధిస్తూ దాడులకు దిగుతున్నారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి హామీ అమలు చేయండి. లేదంటే బాధితుల ఆగ్రహానికి గురికాక తప్పదు. దక్షిణ దిక్కున 40 కిలోమీటర్లు పరిగణలోకి తీసుకున్నట్లుగానే, ఉత్తర భాగాన పరిగణలోకి తీసుకోవాలని రైతుల పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. లేదంటే భూములు కోల్పోతున్న రైతులకు సంతృప్తి కలిగేలా పరిహారం అందించి, వారి పూర్తి అంగీకారంతో భూ సేకరణ జరపాలని ఈ విషయంలో ప్రభుత్వం దిగిరాకుంటే బాధితుల పక్షాన బి ఆర్ ఎస్ పోరాటం చేస్తుందని హెచ్చరిస్తున్నాం. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో బాధితుల గొంతును వినిపిస్తాం. ప్రభుత్వాన్ని నిలదీస్తాం. సమస్య పరిష్కరించే వరకు బిఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుంది.

# మహబూబ్‌నగర్ జిల్లాలో స్వల్ప స్థాయి భూప్రకంపనలు

మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ జిల్లాల్లో స్వల్పస్థాయిలో భూప్రకంపనలు వచ్చాయి. రిక్టర్ స్కేల్‌పై వీటి తీవ్రత 3గా నమోదైనట్లు అధికారులు తెలిపారు. కౌకుంట్ల మండలం దాసరపల్లె కేంద్రంగా మధ్యాహ్నం 12.15 గంటలకు భూ ప్రకంపనలు వచ్చాయి. ఇటీవల తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో భూప్రకంపనలు చోటుచేసుకున్న విషయం తెలిసిందే.



thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 19 సంచిక - 271 | కరీంనగర్ ఆదివారం, 8 డిసెంబర్, 2024 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## భూకంపం.. బయటకు పరుగులు తీసిన జనం..

హిమాచల్ ప్రదేశ్‌లోని మండి జిల్లాలో ఈరోజు తెల్లవారుజామున భారీ భూకంపం సంభవించింది. ఈ కారణంగా ప్రజలు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 3.3గా నమోదైంది. దీని కేంద్రం భూమికి 5 కిలోమీటర్ల దిగువన ఉంది. తెల్లవారు జామున 2:30 గంటల ప్రాంతంలో చాలా మంది గాఢ నిద్రలో ఉన్న సమయంలో ఈ ఘటన జరిగింది. మండి నగరాన్ని భూకంపం తాకింది. ఆ క్రమంలో ఒకదాని తర్వాత ఒకటిగా 3 బలమైన ప్రకంపనలు వచ్చాయి. ప్రకంపనల తర్వాత, ప్రజలు పిల్లలు, కుటుంబాలతో సహా వీధుల్లోకి వచ్చారు.

# ఓడినా... గెలిచినా...
# జనాల్లోనే ఉంటున్నాం!

## మీ నాయకుని మాదిరి ఫాంహౌస్‌కే పరిమితం కాలె!!

### మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రేవంత్‌రెడ్డి చురకలు





నల్గొండ: ఏడాదిలో ఏనాడైనా కేసీర్ ప్రతిపక్ష నేత పాత్ర పోషించారా? అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. నల్గొండ జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాల ప్రారంభోత్సవం, నర్సింగ్ కళాశాలకు శంకుస్థాపన చేసిన తర్వాత గంధంవారి గూడెంలో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు. "తెలంగాణ ఉద్యమంలో నల్గొండ పాత్ర మరువలేనిది. ఉద్యమంలో ఆత్మబలిదానం చేసుకున్న శ్రీకాంతాచారి నల్గొండ వ్యక్తే. నల్గొండలో అడుగుపెట్టినప్పుడల్లా సాయుధ రైతాంగ పోరాటం గుర్తొస్తుంది. నల్గొండలో కృష్ణా జలాలు ప్రవహిస్తే ఫ్లోరైడ్ సమస్య తీరుతుందని ప్రజలు భావించారు. కేసీఆర్ పాలనలో నల్గొండ జిల్లా నిర్లక్ష్యానికి గురైంది. ఉమ్మడి పాలనలో కంటే కేసీఆర్ పాలనలోనే నల్గొండకు ఎక్కువ నష్టం జరిగింది. గతంలో ప్రారంభించిన ప్రాజెక్టులు కేసీఆర్ హయాంలో నిలిచిపోయాయి. ఈ జిల్లాలో కృష్ణా జలాలను ప్రవహింపజేయడం ద్వారా ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసి దేశానికే తలమానికంగా తీర్చిదిద్దుతాం. వరి పండిస్తే ఉరేసుకున్నట్టే నని ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. మేం అధికారంలోకి వచ్చిన తర్వాత 8,500 ఐకేపీల ద్వారా రూ.500 బోనస్ ఇచ్చి ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. 2.70లక్షల ఎకరాల్లో సన్న వడ్లను నల్గొండ జిల్లా రైతులు పండించారు. మూడ్రోజుల్లో రైతులకు ధాన్యం అమ్మిన డబ్బులు చెల్లిస్తున్నాం. వ్యవసాయం అంటే దండగ కాదు.. పండుగ అని నిరూపించాం. కేసీఆర్‌కు ఒక్కటే చెబుతున్నా.. గెలిస్తే అధికారం చలాయిస్తాం.. ఓడిపోతే ఫామ్‌హౌస్‌కే పరిమితమవుతామనే విధానం సరికాదు. మే మంతా ఎన్నికల్లో ఓడినా గెలిచినా.. ప్రజల్లోనే ఉన్నాం. మా ఎమ్మెల్యేలను లాక్కున్నా ఎక్కడా వెనకడుగు వేయలేదు. ఏడాది గడుస్తున్నా.. ఎప్పుడైనా ప్రతిపక్షనేత పాత్ర పోషించారా?గెలిస్తే ఉప్పొంగిపోవడం.. ఓడితే కుంగిపోవడం కేసీఆర్ స్థాయికి తగదు. సంక్రాంతి తర్వాత రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు వేస్తాం. సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తాం. సన్నాలనే రేషన్, మధ్యాహ్న భోజనానికి వినియోగిస్తాం. మూసీ వద్దని అడ్డంపడే వాళ్లకు ఘోరీ కట్టే శక్తి మీకుంది. మూసీ ప్రక్షాళన చేయాలా? వద్దా? నల్గొండ జిల్లా ప్రజలు ఆలోచించాలి. ఎవరు అడ్డొచ్చిన మూసీ ప్రాజెక్టు పూర్తి చేసి తీరుతాం" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

## అది నిరూపిస్తే.. ఢిల్లీ నడిబజార్‌లో క్షమాపణ చెబుతా.. సీఎం సంచలన వ్యాఖ్యలు..

నల్గొండ కాంగ్రెస్ విజయోత్సవ సభలో సీఎం రేవంత్ రెడ్డి ప్రధాని మోడీకి సవాల్ విసిరారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో తాము ఇచ్చిన ఉద్యోగాలు ఎక్కడైనా ఇస్తే.. ఢిల్లీ నడిబజార్ లో వచ్చి క్షమాపణ చెబుతానంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశంలోనే మొదటి ఏడాదిలో 55వేల 143 ఉద్యోగాలు ఇచ్చింది ఒక్క తెలంగాణలోనేనని అన్నారు. ఈ క్రమంలోనే మా అడ్డాకు వచ్చి అడ్డగోలుగా మాట్లాడొద్దని కేంద్ర మంత్రి నడ్డాను హెచ్చరించారు. ఏడాదిలో 21కోట్లతో రెండు లక్షల రుణమాఫీ చేసిన చరిత్ర మా కాంగ్రెస్ పార్టీదని అన్నారు. ఒక్క నల్గొండ జిల్లాలోనే 2004 కోట్ల రుణమాఫీ జరిగిందని.. ఉచిత కరెంట్ పేటెంట్ కాంగ్రెస్ పార్టీదేనని చెప్పుకొచ్చారు. 24గంటల కరెంట్ ఇచ్చి 50లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నట్లు తెలిపారు. రోజు 18గంటలు పనిచేస్తున్నామని.. అయితే, సోషల్ మీడియాలో అడ్డగోలుగా ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.



**6500కోట్లు వడ్డీ..** 16వేల మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణలో కేసీఆర్ 7లక్షల కోట్ల అప్పు చేశారని సంచలన వ్యాఖ్యలు చేశారు. తాము నెలకు 6500కోట్లు వడ్డీ కడుతున్నామని అన్నారు. సంక్రాంతి తర్వాత ఖచ్చితంగా రైతు భరోసా ఇస్తామని హామీ ఇచ్చారు. సన్నాలే పండించండి.. 500 బోనస్ ఇస్తాం.. చివరి గింజ వరకు కొంటాం అని వ్యాఖ్యానించారు. రేషన్ దుకాణాల్లో, హాస్టల్ విద్యార్థులకు మీరు పండించిన సన్నాలతోనే అన్నం పెడతామని అన్నారు. నల్గొండకు 400కోట్లతో రింగ్ రోడ్డు, 35వేల కోట్లతో రీజనల్ రింగ్ రోడ్డు, 50వేల ఎకరాల్లో కొత్త నగరాన్ని నిర్మిస్తామని వెల్లడించారు.


**మూసీ ప్రక్షాళన చేసి తీరుతాం..** మూసీ కాలుష్యాన్ని ప్రక్షాళన చేసి తీరుతామంటే బీ ఆర్ ఎస్ అడ్డుపడుతోందని వివరించారు.

మూసీ అడ్డుకునే ఏక లింగాన్ని మూసీలో ముంచండి అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోరాటల నల్గొండ జిల్లా ప్రజలే మూసీ ప్రక్షాళనకు అడ్డువచ్చే వారిని చూసుకోవాలి అంటూ హాట్ కామెంట్స్ చేశారు. ఎన్ని కష్టాలు వచ్చినా మూసీ ప్రక్షాళన చేసి




తీరుతామంటూ.. పునరుజ్జీవనం చేసి గోదావరి జలాలు ఇస్తామని అన్నారు. కేసీఆర్ మూసీ ప్రక్షాళన వద్దంటే బీ ఆర్ ఎస్ పార్టీ ఉండదని సెన్సేషనల్ కామెంట్స్ చేశారు.

**ప్రతిపక్ష హెూదా పోషించాడా?..** కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా కేసీఆర్ ఏనాడైనా ప్రతిపక్ష హెూదా పోషించాడా? నలభై ఏళ్ల ప్రజా పాలనలో ఉన్న కేసీఆర్ ప్రతిపక్ష హెూదా సీటు ఖాళీగా ఉంచుతారా? మా నాయకులు... మేము ఓడినా ప్రజల్లో ఉన్నామన్నారు. కేసీఆర్ ఆత్మ పరిశీలన చేసుకోవాలి.. ఎందుకు బయటికి రావడం లేదు? అభివృద్ధి పనులు అడ్డుకునేలా గాలి బ్యాచ్‌ను వదిలి ఏం మాట్లాడుతున్నారు అని మండిపడ్డారు.



## తెలంగాణతల్లి రూపం మార్చడంపై హైకోర్టులో పిటిషన్

హైదరాబాద్: సచివాలయంలో ఏర్పాటు చేయనున్న తెలంగాణ తల్లి విగ్రహం రూపం మార్చడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ హైకోర్టులో పిల్ దాఖలైంది. విగ్రహ ప్రతిష్ఠ నిలిపివేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ జూలూరు గౌరీశంకర్ పిటిషన్ దాఖలు చేశారు. విగ్రహం రూపం మార్చడం వల్ల ప్రజల మనోభావాలు దెబ్బతింటాయని పిటిషన్‌లో పేర్కొన్నారు.

గౌరీ శంకర్ దాఖలు చేసిన పిల్ ప్రస్తుతం హైకోర్టు రిజిస్ట్రీ పరిశీలనలో ఉన్నట్టు సమాచారం. సచివాలయం ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఈనెల 9న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించనున్న విషయం తెలిసిందే.




# కూల్... కూల్... వింటర్‌లో
# హాట్‌హాట్ అసెంబ్లీ!

## 9 నుంచి తెలంగాణ అసెంబ్లీ వింటర్ సెషన్స్!!

## అస్త్ర శస్త్రాలను సిద్ధం చేసుకుంటున్న అధికార - ప్రతిపక్షాలు

### రైతు భరోసా, కులగణన సర్వే, ఏడాది పాలనపై చర్చించే చాన్స్?
### ఆర్వోఆర్, హైడ్రా తదితర బిల్లులకు ఆమోదం తెలిపే చాన్స్?
### విద్యుత్ కమిషన్ రిపోర్టునూ ప్రవేశపెట్టే అవకాశం

హైదరాబాద్ : అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ఈ నెల 9 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ గెజిట్ నోటిఫికేషన్ కూడా జారీ చేశారు. 9న ఉదయం 10:30 గంటలకు సమావేశాలు ప్రారంభం కానున్నాయి. తొలిరోజు అసెంబ్లీ సమావేశమైన అరగంట లోపే వాయిదా వేస్తారు. అనంతరం బీఏసీ సమావేశం జరగనుంది. ఆ తరువాత ఎన్ని రోజులు అసెంబ్లీ జరుగుతుందనేది స్పష్టత రానుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయిన నేపథ్యంలో ఏడాది పాలన, ప్రోగ్రెస్ రిపోర్టుపై ఈ సమావేశాల్లో చర్చించనున్నారు. ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సభ ముందుకు తీసుకురానున్నారు. కేబినెట్ సబ్ కమిటీ రిపోర్టుపై అసెంబ్లీలో చర్చించి రైతుభరోసా విధివిధానాలను ఫైనల్ చేయనున్నారు. సంక్రాంతి తర్వాత రైతు భరోసా ఇస్తామని ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. అలాగే కులగణన సర్వే వివరాలను ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించనున్నట్టు తెలుస్తున్నది. అప్పటి వరకు కులగణన సర్వే పూర్తయి నివేదిక రావడంతో పాటు బీసీ డెడికేటెడ్? కమిషన్ రిపోర్ట్?కూడా ఇచ్చే అవకాశం ఉండడంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల పెంపును కూడా అసెంబ్లీలోనే వెల్లడించేలా ప్రభుత్వం ఆలోచన చేస్తున్నది.

**మూసీపై మరోసారి చర్చ..** రికార్డ్స్ ఆఫ్ రైట్స్ (ఆర్వోఆర్–2024) బిల్లును ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదించనున్నది. హైడ్రా, ఓఆర్ఆర్ దగ్గరలోని గ్రామాలు ఆయా మున్సిపాలిటీల్లో విలీనం తదితర బిల్లులపైనా చర్చించి ఆమోదించనుంది. ఇప్పటికే వీటికి ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసింది. మూసీ పునరుజ్జీవంపైనా మారోసారి అసెంబ్లీలో చర్చ పెట్టాలని సర్కార్ భావిస్తున్నది.

ఫోర్త్ సిటీ ఏర్పాటు పైనా చర్చించనున్నట్టు తెలిసింది. కాగా, బీఆర్ఎస్ హయాంలో జరిగిన విద్యుత్ కొనుగోళ్లు, యాదాద్రి, భద్రాద్రి పవర్‌ప్లాంట్ల నిర్మాణాల్లో అక్రమాలపై జ్యుడీషియల్ కమిషన్‌తో ప్రభుత్వం విచారణ చేయించింది. దీనికి సంబంధించిన రిపోర్ట్ ను కమిషన్ ఇప్పటికే ప్రభుత్వానికి సమర్పించినట్టు తెలిసింది. దీంతో అసెంబ్లీ కంటే ముందు జరిగే కేబినెట్ సమావేశంలో దీనిపై చర్చించే సూచనలు కనిపిస్తున్నాయి. అవసరమైతే అసెంబ్లీలోనూ కమిషన్ రిపోర్ట్‌ను పెట్టే యోచనలో సర్కార్ ఉన్నట్టు తెలిసింది.

# చురకలు

## సంపాదకీయం

### కౌశిక్ రెడ్డి అరెస్టు ఎపిసోడ్ లో మైలేజీ ఎవరికి? డ్యామేజ్ మరెవరికి?

బీఆర్ఎస్ ఫైర్ బ్రాండ్ కం ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అరెస్టు వ్యవహారం హాట్ టాపిక్ గా మారింది. గురువారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు నాన్ స్టాప్ గా సాగిన హైడ్రామా న్యాయమూర్తి బెయిల్ మంజూరు చేయటంతో ఈ ఎపిసోడ్ ఒక కొలిక్కి వచ్చినట్లైంది. ఇంతకూ కౌశిక్ రెడ్డి అరెస్టులో అర్థముందా? పోలీసులు సరైన రీతిలోనే వ్యవహరించారా? అరెస్టు చేయాల్సిన అవసరం ఉందా? కౌశిక్ రెడ్డి అరెస్టులో అర్థముందా? బీఆర్ఎస్ నేతల ఆగ్రహంలో పాయింట్ ఉందా? అసలు అరెస్టు చేసేంతగా కౌశిక్ రెడ్డి ఏం చేశారు? ఈ మొత్తం ఎపిసోడ్ లో మైలేజ్ ఎవరికి? డ్యామేజ్ ఎవరికి? అన్న లోతుల్లోకి వెళితే.. తన ఫోన్ ను ట్యాపింగ్ చేశారంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్ రెడ్డిలపై కంప్లైంట్ చేయటానికి బుధవారం బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ కు వెళ్లారు బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి. అయితే.. ఆయన కంప్లైంట్ ను అక్కడి వారికి ఇవ్వాల్సిందిగా పేర్కొన్నారు. అదే సమయంలో సీఐ బయటకు వెళుతున్నారు. తన కంప్లైంట్ ను సీఐ మాత్రమే తీసుకోవాలంటూ హడావుడి చేశారు కౌశిక్ రెడ్డి. ఇక్కడ కంప్లైంట్ ఇవ్వటమే ముఖ్యమైతే.. పోలీస్ స్టేషన్ కు వెళ్లి.. కంప్లైంట్ ఇచ్చేసి వచ్చేయొచ్చు. అందుకు భిన్నంగా తాను ఎమ్మెల్యేను కాబట్టి.. ఫలానా అధికారి మాత్రమే తన ఫిర్యాదును తీసుకోవాలని డిమాండ్ చేయటం.. తన విధి నిర్వహణలో భాగంగా బయటకు వెళుతున్న సీఐ రాఘవేంద్రను అడ్డుకోవటమే కాదు.. తనను చూసి సీఐ పారిపోతున్నట్లుగా తన అనుకూల సోషల్ మీడియా ఖాతాల్లో పోస్టులు పోస్టు చేసి వైరల్ చేయించారు. ఒక ఫిర్యాదు చేయటానికి పోలీసు స్టేషన్ కు వెళ్లినప్పుడు.. తాను ఇవ్వాలనుకున్న కంప్లైంట్ ఇస్తే సరిపోతుంది. అందుకు భిన్నంగా అధికారులతో వాదనలకు దిగటం.. వారి విధులను అడ్డుకోవటం.. వారిని బెదిరింపులకు గురి చేయటంలో అర్థం లేదు. ఈ మొత్తం ఎపిసోడ్ ను చూసినప్పుడు చిన్న విషయానికి అంత పెద్ద రచ్చ చేయటం వెనుక కౌశిక్ రెడ్డి వ్యూహాత్మకంగా వ్యవహరించారన్న విమర్శ ఉంది. అంతేకాదు.. స్టేషన్ కు వచ్చిన కౌశిక్ రెడ్డి.. తన కారును పోలీసు వాహనానికి అడ్డుగా పెట్టటమే కాదు.. స్టేషన్ లో ఒక రేంజ్ హడావుడి చేశారు. తనకు తానుగా రచ్చ చేసుకున్న కౌశిక్ రెడ్డి.. పోలీసు అధికారుల తీరుపైనా తప్పుడు ప్రచారానికి కారణమయ్యారన్న మాట వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఇన్ స్పెక్టర్ కంప్లైంట్ మేరకు కౌశిక్ రెడ్డిని అరెస్టు చేశారు. విపక్షంలో ఉన్నప్పుడు తమను అరెస్టు చేయటం ద్వారా విపక్ష నేతలు మైలేజీ మూట కట్టుకుంటారు. కౌశిక్ రెడ్డి వ్యవహారారం చూస్తే.. మైలేజీ కాదు డ్యామేజ్ చేసుకుంటున్నారన్న భావన కలుగక మానదు. కారణం.. తన మీద సానుభూతికి భిన్నంగా పోలీస్ స్టేషన్ కు వెళ్లి ఇంత రచ్చ చేసుకోవటం అవసరమా? అన్న భావన కలుగక మానదు. అదే పనిగా తమను చిరాకు పెట్టిస్తున్న కౌశిక్ రెడ్డికి పోలీసులు అనూహ్యంగా అరెస్టు షాకిచ్చారన్న మాట వినిపిస్తోంది. మొత్తంగా చూస్తే.. చిన్న విషయాలకు రచ్చ చేయటం మానేసి.. ప్రజా సమస్యలపై ఫోకస్ చేస్తే కౌశిక్ రెడ్డి ఇమేజ్ పెరిగే వీలుందని చెప్పక తప్పదు.

# జలాంతర్గాముల నిర్మాణంలో భారత్ ప్రగతి - డిసెంబర్ 8...జలాంతర్గామి దినం




భారత దేశములో జలాంతర్గామి దినోత్సవం ప్రతి సంవత్సరం డిసెంబరు 8 వ తేదీన జరుపు తారు. డిసెంబర్ 1967 లో భారత నౌకాదళంలో ప్రవేశపెట్ట బడిన తొలి జలాంతర్గామి - ఐ ఎన్ ఏస్ కల్వరి. కల్వరిని భారత నౌకాదళంలో ప్రవేశ పెట్టబడిన రోజైన డిసెంబర్ 8న జలాంతర్గామి దినంగా భారత నావికాదళం జరుపు కుంటుంది. జలాంతర్గామి నీటిలో మునిగి ప్రయాణం చెయ్యగల వాహనం. వివిధ దేశాల నావికా రక్షణ దళాల్లో జలాంతర్గామి ఒక ముఖ్య భాగం. జలాంతర్గామిని మొదటగా మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో విస్తృతంగా ఉపయోగించారు. ప్రత్యర్థులు జలగర్భ మార్గాల ద్వారా దొంగదెబ్బ తీసే అవకాశం ఉందని క్రీ.పూ. 332లోనే గుర్తించాడు అలెగ్జాండర్. అందుకే జలాల కింద కూడా పహారా కాయాలని అనుచరులను ఆదేశించాడు. ఓ అమోఘమైన ఘంటజాడీ (డైవింగ్ బెల్) ని రూపొందించి దాన్లో ఆయనే స్వయంగా జలాల్లోకి దిగినట్టు ప్రచారంలో ఉంది. పదిహేనో శతాబ్దం చివర్లో.. విఖ్యాత దార్శనికుడైన లియోనార్డో డావిన్సీ.. జల మధ్యంలోకి దూసుకుపోయే సైనిక పాటవం గురించి ప్రస్తావించాడు. ఇంగ్లండ్‌లో ఉంటున్న డచ్ వైద్యుడు కార్నీలియస్ డ్రెబ్బెల్ 1620లో ఎక్కువ సమయం నీటిలోపల ఉండి గొర్రె తోలుతో కప్పిన చెక్క పెట్టెలాంటి దీనిలో- తెడ్డువేసే వారితో సహా మొత్తం 20 మంది ప్రయాణించేందుకు వీలైన తొలి జలాంతర గమన వాహనం సిద్ధం చేశాడు. 1776 సెప్టెంబరులో న్యూయార్క్ ఓడరేవులో మోహరించిన బ్రిటన్ యుద్ధనౌకలపై 'దొంగదాడి'కి అమెరికా సిద్ధం కాగా, ప్రత్యర్థుల కళ్లు గప్పి, వాళ్ల ఓడలకు రంధ్రాలు చేసి, వాటిని ముంచెయ్యటం లక్ష్యంగా, యేల్ విశ్వవిద్యాలయం విద్యార్థి డేవిడ్ బుష్‌నెల్ పైకి కనబడకుండా తాబేలులా నీటిలోనే ప్రయాణించే 'టర్టిల్'ను సిద్ధం చేశాడు. అమెరికాకు చెందిన రాబర్ట్ ఫల్టన్ 1798లో జలాంతర్గామి లోపలి గోడ చుట్టూ మరో పై గోడ నిర్మించి.. మధ్య ఖాళీలో నీరు నింపేలా బలాస్ట్ ట్యాంకులు అమర్చాడు. అమెరికా, రష్యాలు జలాంతర్గాములతోనే ప్రచ్ఛన్న యుద్ధం సాగించిన క్రమంలో... జలాంతర్గాములు డీజిల్ నింపుకోవటం కోసం పైకి రావడం వల్ల శత్రువుల కంటబడటం జరుగగా, ఆ ఇబ్బందిని అధిగమించ డానికి 1954లో అమెరికా మొట్టమొదటి సారిగా అణుఇంధనంతో నెలల తరబడి నీటిలోనే నడిచే 'యుఎస్ఎస్ నాటిలస్'ను, ఆ తర్వాత బాలిస్టిక్ క్షిపణి ప్రయోగ జలాంతర్గాములను రూపొందించింది. భారత నావికాదళం దేశం యొక్క సముద్ర సరిహద్దులను భద్ర పరచుటలో, అంతర్జాతీయ సంబంధాలను విస్తరించుటంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఆధునిక భారతీయ నౌకాదళం హిందూ మహాసముద్ర ప్రాంతంలో తన స్థానాన్ని మెరుగు పరిచేందుకు వేగవంతమైన పునర్నిర్మాణంలో భాగంగా ఉంది. భారత నావికా దళంలో తూర్పు కమాండ్ - విశాఖపట్నం, పశ్చిమ కమాండ్ - ముంబాయి దక్షిణ కమాండ్ - కోచి, అండమాన్ నికోబార్ నావల్ - పోర్ట్ బ్లెయిర్ అనే 4 కమాండ్ లు ఉన్నాయి. 1985 నుండి అణు జలాంత ర్గాములను నిర్మించడానికి కల్పాక్కం వద్ద ఉన్న అణు కేంద్రంతో కలసి నేవి కృషి చేస్తోంది. 1987లో భారత నౌకా దళంలో జలాంతర్గాముల విభాగాన్ని ఏర్పాటు చేశారు. జలాంతర్గాముల నుండి టార్పిడో అను క్షిపణులను ప్రయోగిస్తారు. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన మొట్ట మొదటి సబ్ మెరైన్ - ఐ ఎన్ ఏస్ షల్కి. 1967 లో డిసెంబర్ 8న భారత నౌకాదళంలో తొలి జలాంతర్గామి - ఐ ఎన్ ఏస్ కల్వరి ప్రవేశ పెట్ట బడింది. ప్రపంచంలో అమెరికా, రష్యా, చైనా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, ఆస్ట్రే లియాతో పాటు భారత దేశం ఏడు దేశాలు అణుశక్తితో నడిచే జలాంతర్గాములను కలిగి ఉన్నాయి. కల్వరి తరగతి సబ్‌మెరైన్ ప్రాజెక్ట్-75లో జలాంతర్గామి తరగతికి చెందిన ఐఎన్ఎస్ కల్వరి, ఖండేరి, కరంజ్ జలాంతర్గాములను మన దేశంలో ఇప్పటికే ప్రారంభించారు. 2023 నవంబర్ చివరి వారంలో ఫ్రాన్స్‌కు చెందిన నావల్ గ్రూప్‌తో కలిసి ముంబయి లోని మజాగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ నిర్మించిన స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన జలాంత ర్గామి ఐఎన్ఎస్ వేలా నావిక దళంలోకి ముంబైలోని నావల్ డాక్‌యార్డ్‌లో చీఫ్ ఆఫ్ నేవల్ స్టాఫ్ అడ్మిరల్ కరంబీర్ సింగ్ సమక్షంలో జలప్రవేశం చేసింది. భారత రెండో అణు జలాంతర్గామి 'ఐఎన్ఎస్ అరిఘాత్' 2024 ఆగస్టు 29న నౌకాదళంలో చేరింది. అలా కల్వరిని భారత నౌకాదళంలో ప్రవేశ పెట్టబడిన డిసెంబర్ 8న భారత నావికా దళం జలాంతర్గామి దినంగా జరుపు కుంటుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# విధి నిర్వహణలో విశిష్ట సేవలు అందించిన రావత్ - డిసెంబర్ 8... బిపిన్ రావత్ వర్ధంతి

బిపిన్ రావత్ పూర్తి పేరు బిపిన్ లక్ష్మణ్ సింగ్ రావత్. ఉత్తరా ఖండ్ లోని పౌరీలోని రాజ్‌పుత్ కుటుంబంలో , 16 మార్చి 1958 బిపిన్ రావత్ జన్మించారు. బిపిన్ తండ్రి లక్ష్మణ్ సింగ్ రావత్ భారత సైన్యంలో వివిధ పదవులను అలంకరించి, లెఫ్టినెంట్ జనరల్‌గా పదవీ విరమణ చేశారు. బిపిన్ రావత్ సిమ్లాలోని సెయింట్ ఎడ్వర్డ్ స్కూల్‌లో చదువు ప్రారంభించి ఉన్నత విద్యన భ్యసించారు. పాఠశాల విద్య తర్వాత నేషనల్ డిఫెన్స్ అకాడమీలో చేరారు. ఇండియన్ మిలిటరీ అకాడమీ డెహ్రాడూన్‌లో ఆయనకు సోర్డ్ ఆఫ్ ఆనర్ లభించింది. డిఫెన్స్ సర్వీస్ స్టాఫ్ కాలేజీలో ఆయన గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. ఆ తర్వాత అమెరికా లోని కాన్సాస్‌లో యునైటెడ్ స్టేట్స్ ఆర్మీ కమాండ్ అండ్ జనరల్ స్టాఫ్ కాలేజీలో హైయ్యర్ కమాండ్ కోర్స్‌ను పూర్తి చేశారు. దేవీ అహల్యా విశ్వ విద్యాలయంలో ఎంఫిల్ పూర్తిచేశారు. మద్రాస్ యూనివర్శిటీలో కంప్యూటర్ డిప్లొమా చేశారు. 2011లో ఆయన చౌధరీ చరణ్ సింగ్ యూనివర్శిటీ నుంచి మిలిటరీ మీడియా అండ్ స్ట్రాటజిక్ స్టడీస్ పై పీహెచ్‌డీ చేశారు.˝ండ్రిని ఆదర్శంగా తీసుకుని, దేశ మాత సేవకే అంకితం కాదలిచి, 1978లో డిసెంబర్ 16న సైన్యంలో చేరారు. తన తండ్రి పనిచేసిన 11- గోరా? రైఫిల్స్‌లోనే ఆయన కూడా సిపాయిగా చేరారు. 1980 డిసెంబర్ 16న లెఫ్టినెంట్ గా నియామకం, 1984 జులై 31న ఆర్మీ కెప్టెన్ గా బాధ్యతలు, 1998 జూన్ 1న లెఫ్టినెంట్ కల్నల్ గా పదోన్నతి, 2003 ఆగస్టు 1న కల్నల్ గా బాధ్యతలు, 2007 అక్టోబర్ 1న బ్రిగేడియర్ గా, 2014 జూన్ 1న లెఫ్టినెంట్ జనరల్ గా నియామకం, 2017 జనవరి 1న చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ గా బాధ్యతలు నిర్వర్తించారు. మిలటరీలోని లోపాలకు సంబంధించి కొత్త అంశాలను ప్రతిపాదించి, లోపాలను సరిదిద్ది, త్రివిధ దళాలను సమన్వయ పరిచే నూతన ప్రక్రియకు ఇటీవలే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శ్రీకారం చుట్టారు. ఆర్మీ చీఫ్, నేవీ చీఫ్, ఎయిర్ ఫోర్స్ చీఫ్ వేర్వేరు అధికారులు వారివారి శాఖలకు అధిపతులు. వీరిపై సర్వ సైనాధ్యక్షులుగా రాష్ట్రపతి ఉంటారు.... కంబైన్డ్ చీఫ్ అంటూ ఎవరూ ఉండేవాళ్లు కాదు. అలాంటి పోస్టు ఆవశ్యకతను మోడీ గుర్తించారు. ప్రధాన మంత్రి ప్రతిపాదనకు డిసెంబర్ 24, 2019న కేంద్రమంత్రి వర్గం ఆమోదం తెలిపింది. ఆ తర్వాత ఆరు రోజులకు అప్పటి ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్‌ను మొదటి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్‌గా నియమిస్తున్నట్లు ప్రధానమంత్రి ప్రకటించారు. అలా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం సైన్యాధి పతిగా విశేష అనుభవం కలిగి ఉన్న రావత్ ను కొత్తగా త్రివిధ దళాధిపతి పోస్ట్ క్రియేట్ చేసి బాధ్యతలు అప్పగించింది... అంటే మన దేశ రక్షణకు అత్యున్నత పదవిలో రావత్ ను నియమించింది. భారత మిలిటరీ వ్యవస్థలో త్రివిధ విభాగాల మధ్య సమన్వయం, మార్గదర్శనం, ప్రణాళిక, కార్యాచరణ కోసం కోసం ఈ నిర్ణయం తీసుకున్నారు. త్రివిధ దళాలకు సంబంధించిన ఆయుధాల కొనుగోలు, శిక్షణ, సిబ్బంది, మిలిటరీ కమాండ్ల వ్యవస్థల మార్పులు, చేర్పులు వంటివి సీడీఎస్ ఆధ్వర్యంలో జరుగడం సదరు పదవి సృష్టి ఉద్దేశం. అనేక పదవుల సమర్థ నిర్వహణ నేపథ్యంలో మొట్ట మొదటి త్రివిధ దళాధిపతిగా 2019 డిసెంబర్ 30న నియమితులయ్యారు రావత్. 2020 జనవరి 1న ఆయన తొలి సి డి ఎస్ గా బాధ్యతలు స్వీకరించారు.




బిపిన్ రావత్ ఛీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి సరిహద్దు విషయాల్లో ఎక్కడా రాజీ పడలేదు. అటు చైనా, పాకిస్తన్ సైనికులు ఎన్ని సార్లు రెచ్చగొడితే అన్ని సార్లు ఆయన బహిరంగంగా తీవ్రంగా హెచ్చరికలు జారీ చేశారు. 40 ఏళ్లుగా దేశ రక్షణలో ఉన్న రావత్ పరమ విశిష్ట సేవా పతకం, ఉత్తమ యుద్ధ సేవా పతకం, అతి విశిష్ట సేవా పతకం, విశిష్ట సేవా పతకం, యుద్ధ సేవా పతకం మరియు సేన పతకాలతో అలంకరించారు. వెల్లింగ్టన్‌లో మిలిటరీ కాలేజీలో లెక్చర్ ఇచ్చేందుకు దిల్లీలోని ప్రత్యేక విమానంలో వెళ్లిన భారత చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ బిపిన్ రావత్ తమిళనాడులోని నీలగిరి జిల్లాలో అసువులు బాసారు. డిసెంబరు 8, 2021న ఉదయం రావత్ రావత్‌తో పాటు, ఆయన సతీమణి మధులిక రావత్, ఆర్మీ ఉన్నతాధికారులతో కలిసి ప్రత్యేక విమానంలో దిల్లీ నుంచి తమిళనాడు వెళ్లారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో సూలూరు ఎయిర్‌బేస్ నుంచి ఆర్మీ హెలికాప్టర్‌లో వెల్లింగ్టన్ వెళ్తుండగా ప్రమాదవశాత్తూ కుప్పకూలింది. ఈ ఘటనలో హెలికాప్టర్‌లో ప్రయాణిస్తున్న 14 మంది మృతి చెందడం దేశానికి తీరని లోటు.

**రామ కిష్టయ్య సంగన భట్ల... సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్, 9440595494**

# ఆకాశవాణి అగ్రగణ్య కళాకారుడు నేదునూరి - డిసెంబర్ 8...నేదునూరి కృష్ణమూర్తి వర్ధంతి



నేదునూరి కృష్ణమూర్తి (1927, అక్టోబరు 10 - 2014, డిసెంబరు 8) కర్ణాటక సంగీత విద్వాంసుడు, సంగీత కళానిధి బిరుదు పొందిన వాడు. మొదట్లో వయొలిన్ మీద ఆసక్తితో ఉన్నా తర్వాత గురువుల సలహాపై గాత్ర సంగీతం వైపు మొగ్గు చూపాడు. శ్రీపాద పినాక పాణి వంటి వారి వద్ద శిష్యరికం చేశాడు. అన్నమాచార్య సంకీర్త నలు, రామదాస కీర్తనలను స్వర పరిచాడు. నాదసుధా తరంగిణి అనే ట్రస్టును ఏర్పాటు చేసి స్వరపరిచిన కీర్తనలను వాటి నొటేషన్లతో సహా ప్రచురించాడు. కృష్ణమూర్తి అక్టోబరు 10, 1927 న తూర్పు గోదావరి జిల్లాలోని కొత్తపల్లి గ్రామంలో రామమూర్తి పంతులు, విజయలక్ష్మి దంపతులకు జన్మించారు. ఇంట్లో అందరికన్నా చిన్నవారు. వీరి తండ్రి పిఠాపురం రాజా వారి సంస్థాన కార్యాలయంలో పనిచేస్తూండే వారు. నేదునూరి 1940 లో విజయనగరం మహారాజా సంగీత కళాశాలలో వయొలిన్, గాత్రంలో ప్రాథమిక శిక్షణ పొందారు. కీర్తిశేషులు ద్వారం నరసింగరావు నాయుడు శిష్యుడిగా ఉన్నారు. 1945 నుంచి సంగీత సభలలో పాల్గొంటూ వచ్చారు. 1949లో ప్రముఖ సంగీత విద్వాంసుడు, సంగీత కళానిధి పద్మభూషణ్ డాక్టర్ శ్రీపాద పినాకపాణి వద్ద చేసి సంగీతంలో గమకాలు, ఇతర మెళకువలలో శిక్షణ పొంది, సంగీత నైపుణ్యానికి మెరుగులు దిద్దారు. ఆల్ ఇండియా రేడియోలో అగ్రగణ్య కళాకారుడిగా వెలుగులోకి వచ్చారు. 1951 నుండి ఐదు దశాబ్దాలకు పైగా మద్రాసు సంగీత అకాడమీలో ప్రదర్శనలు ఇస్తూ వచ్చారు. బాల్యం నుండి ఆయనకు సంగీతంలో మంచి అభిరుచి ఉండేది. అష్టపదులు, తరంగాలు, రామాయణ కృతులు పాడారు. చిన్నతనంలో నేదునూరి గ్రామంలో పెరిగిన ఆయన, విద్వాన్ అప్పా రావు వద్ద వర్ణాలుబీ కల్లూరి వేణు గోపాల రావు వద్ద అష్ట పదులు, తరంగాలు నేర్చు కున్నారు. అప్పల నరసింహం సహకారంతో విజయ నగరం మహారాజా కాలేజీలో చేరారు. ఆయన అనేక అన్నమయ్య కృతులకు బాణీలు కట్టాడు. "నానాటి బ్రతుకు నాటకము" కీర్తనకు నేదునూరి కట్టిన బాణీని ప్రశంసిస్తూ ఎం. ఎస్. సుబ్బలక్ష్మి "నేదునూరి గారూ, ఆ ఒక్కపాటకు బాణీని కట్టినందుకు మీకు సంగీత కళానిధి ఇవ్వచ్చండి" అని మెచ్చుకున్న సంఘటన. 1991 లో సంగీత కళానిధి పురస్కారం ఇచ్చినప్పుడు సెమ్మంగుడి శ్రీనివాస అయ్యర్ ఆయన పేరును ప్రతిపా దించగా, సుబ్బలక్ష్మి ఆ ప్రతి పాదనకు ఆమోద ముద్ర వేశారు. 2013 లో కొప్పరపు కవుల ప్రతిభా పురస్కారానికి కూడా ఎంపికయ్యారు. సంగీత లోకంలో ప్రముఖ స్థానం సంపాయించు కున్నారు. సంగీత అకాడమీలో యాభై యేళ్ళకు పైగా పాడారు. తన సుదీర్ఘ సంగీత యాత్రలో అనేక సంగీత కోవిదు లయిన ద్వారం వెంకట స్వామి నాయుడు, డాక్టర్ శ్రీపాద పినాక పాణి, లాల్గుడి జయరామన్, ఎం ఎస్ సుబ్బులక్ష్మి, పేరి శ్రీరామ మూర్తి (వయొలిన్), వెంకట రమణ (మృదంగం), నేమాని సోమ యాజులు (ఘటం) ఇత్యాదులచే నేదునూరి కొనియాడ బడ్డారు. నేదునూరి విజయవాడ జీ వీ ఆర్ ప్రభుత్వ సంగీత, నాట్య కళాశాల, ప్రధాన అధ్యాపకుడిగా, సికింద్రా బాద్, విజయ నగరం, తిరుపతి సంగీత కళాశాలలో పని చేసారు. వేంకటేశ్వర, నాగార్జున విశ్వ విద్యాలయాలలో ఆర్ట్స్ విభాగం డీన్, బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్‌గా, ఆల్ ఇండియా రేడియో, సంగీత విభాగ ఆడిషన్ బోర్డ్ సభ్యుడిగా పనిచేసారు. కొంతకాలం ఆంధ్ర విశ్వ విద్యాలయం గౌరవ ఆచార్యుడిగా ఉన్నారు. నేదునూరి కృష్ణమూర్తి స్వర పరచిన కీర్తనలలో - దాశరథి శతకం పద్యాలు, రాగ సుధా రసాలతో భద్రాచల రామదాస కీర్తనలు సీడీల రూపంలో తెచ్చారు. అన్నమాచార్య సంకీర్తనలు, పద కదంబం మీద పలు సీడీలు, కేసెట్లు వెలువరించారు. ఆల్ ఇండియా రేడియో భక్తి రంజనిలో కూర్చిన నారాయణ తీర్థ తరంగాలు, రామదాస కీర్తనలు వాసికెక్కాయి. టీ టీ డీ - ఆస్థాన విద్వాంసులుగా నియమితులైయ్యారు. అన్నమాచార్య కృతులని కూర్చి సంగీత లోకానికి అందించారు. మద్రాసు సంగీత అకాడమి నుండి సంగీత కళానిధి గౌరవం అందు కున్నారు. శ్రీ రాజా లక్ష్మీ పురస్కారం (2002), నేషనల్ ఎమినెన్స్ అవార్డు (2006), ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం నుండి కళా నీరాజనం పురస్కారం (1995), 2013 లో కొప్పరపు కవుల ప్రతిభా పురస్కారం అవార్డులు, గౌరవ పురస్కారాలు అందుకున్నారు. నేదునూరి ప్రముఖ శిష్యులలో కళాప్రపూర్ణ చిట్టి అబ్బాయి, శ్రీమతి కోక సత్యవతి, శ్రీమతి కె. సరస్వతి వుధ్యార్తి, జి. బాలకృష్ణ ప్రసాద్, శ్రీమతి శోభారాజు, మల్లాది సోదరులు (శివరామ ప్రసాద్, రవి కుమార్) ఉన్నారు. నేదునూరి 2014 డిసెంబరు 8న, అనారోగ్యంతో బాధపడుతూ 87 సంవత్సరాల వయసులో దేహం చాలించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**


# నీటి సమస్య తీర్చి మిమ్మల్ని ఆదుకుంటా.. : పవన్ కల్యాణ్



కడప: చదువుల నేల రాయలసీమకు తానొచ్చానని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. అత్యధికంగా లైబ్రరీలు ఉన్న ప్రాంతం ఇది అని పేర్కొన్నారు. కడప మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మెగా సమావేశంలో ఆయన మాట్లాడారు. "అన్నమయ్య, వేమన, పుట్టపర్తి నారాయణాచార్యులు, కేవీ రెడ్డి, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వంటి మహనీయుల నేల ఇది. రాయలసీమ అంటే వెనకబాటు కాదు.. అవకాశాలను ముందుండి నడిపించే ప్రాంతం. 2014-19 సంవత్సరంలో ఉద్దానం సమస్యను బయటకు తీసుకొచ్చా. ఆనాటి సీఎం చంద్రబాబు రూ.61 కోట్లతో ఉద్దానం ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లారు. కడపలో ఇంత నీటి సమస్య ఉందని నేను అనుకోలేదు. ఈ ప్రాంతం నుంచి ఇద్దరు సీఎంలు అయినందున సమస్యలు తీరిపోయి ఉంటాయనుకున్నా. పులివెందుల తాగునీటి ప్రాజెక్టుకు రూ.45 కోట్లు ఇచ్చాం. తాగునీటి కోసం ఎక్కడా ఇబ్బంది రాకూడదనేదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. నీటి సమస్యను తీర్చి ఇక్కడి ప్రజలను ఆదుకుంటానని మాట ఇస్తున్నా. సమాజానికి సరైన చదువు ఇవ్వకపోతే అభివృద్ధి దిశగా వెళ్లదు. విద్యార్థుల భవిష్యత్తు కోసమే కూటమి ప్రభుత్వం పని చేస్తోంది. పిల్లలతో చర్చిస్తేనే అన్ని విషయాలు మనకు తెలుస్తాయి. ఇటీవల విద్యార్థులు తిరగబడి టీచర్‌పై దాడి చేసిన ఘటన చూశాం. ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు కూడా బాధ్యతగా ఉండాలి. ఎక్కడ తప్పు జరిగినా ముందుగానే చర్చించుకోవాలి. సమస్య పరిష్కారానికి చర్చించుకోవడం చాలా ముఖ్యం" అని పవన్ కల్యాణ్ చెప్పారు.

# నిజాంపై బాంబు విసిరిన తెలంగాణ విప్లవ వీరుడు

## - డిసెంబర్ 8... నారాయణరావు పవార్ వర్ధంతి



NARAYANA RAO PAWAR
DOB: 03-10-1926 DOD:08-12-2010

ఆయన ఒక పోరాట యోధుడు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ధీరుడు. ప్రాణాలను పణంగా పెట్టీ, ప్రాణ త్యాగానికి సిద్ధపడ్డ త్యాగ ధనుడు. రాచరికంలో బందీ అయిన తెలంగాణ ప్రజల స్వేచ్ఛాకాంక్షను ప్రపంచానికి చాటడానికి, నిజాం ప్రభువు హత్యకై ఆయనపై బాంబును విసిరిన సాహస వంతుడు. ఆయనే పోరాటాల పురిటిగడ్డ తెలంగాణ ముద్దుబిడ్డ నారాయణ పవార్. బాంబు గురి తప్పినా, ఆయన బందీ అయినా, ఆయన త్యాగ నిరతి, స్ఫూర్తి దాయకం అయింది. పవార్ బాంబు వేసిన సంఘటనను పార్లమెంట్‌లో భగత్‌సింగ్ చేసిన సాహసంతో నాటి ప్రజలు పోల్చుకునే వారు. అయితే ఆ సాహస వీరునికి ప్రాధాన్యత దక్కలేదు. తానే స్వయంగా నిరాహార దీక్ష చేస్తే గానీ రాజకీయ ఖైదిగా గుర్తించలేదు. నాటి తరానికి పవార్ ఆదర్శవంతుడే అయినా, చరిత్ర ఆయన కు తగిన ప్రాధాన్యత ఇవ్వని కారణంగా, నాటి తరానికీ స్ఫూర్తి ప్రదాత అయిన పవార్ పేరు కూడా నేటి తరానికీ తెలియని దుస్థితి శోచనీయం. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా, హైదరాబాద్ సంస్థాన ప్రజలు మాత్రం నిరంకుశ బానిసత్వంలో మగ్గక తప్పలేదు. సొంతం చేసుకోవడానికి విశ్వప్రయత్నం చేస్తూ రజాకార్లను ఉసిగొల్పాడు. నిజాంకు అండగా ఖాసిం రజ్వీ నేతృత్వంలోని రజాకార్లు గ్రామాలపై బడి దోపిడి చేయడం, ఇండ్లు తగల బెట్టడం నానా అరాచకాలు సృష్టించగా, హైదరాబాదు సంస్థానాధీశుడు ఏడవ నిజాం నవాబు ఉస్మాన్ ఆలీ ఖాన్ నుంచి విముక్తి కోసం సంస్థాన ప్రజలు 1946 నుంచి 1948 మధ్య వీరోచిత పోరాటం చేశారు. 1926 అక్టోబర్ 3న వరంగల్‌లో జన్మించిన నారాయణరావు పవార్. బాల్యం నుంచే స్వేచ్ఛ భావాలు కలిగి అణచివేత ఏ రూపంలో ఉన్నా సహించేవాడు కాదు. 8వ తరగతిలోనే ఆర్య సమాజ్‌లో చేరాడు. నిజాం నవాబ్ ఆకృత్యాలు చదివాడు. ప్రత్యక్షంగా చూసాడు. అప్పుడే నిజాం నవాబ్‌కు వ్యతిరేకంగా పోరాడాలని నిర్ణయించు కున్నాడు. కొంత మంది యువకులతో కలిసి "ఆర్య యువక్రాంతి దళ్" ఏర్పాటు చేశాడు. దీనికి కొండా లక్ష్మణ్ బాపూజీ సలహాదారుడుగా ఆర్థిక సహాయం చేశాడు. సమకాలీన రాజకీయాలపై నిరంతరం చర్చించేవారు. " మారు వేశాలలతో వెళ్ళి హైదరాబాద్లో. జిన్నా "రెచ్చగొట్టే ఉపన్యాసం విన్నాడు. తెలంగాణ సాయుధ పోరుకు సంఘీభావంగా ఏదైనా చేయాలను కున్నారు. ప్రతి దినం సాయంత్రం నిజాం నవాబ్ దారుల్ షిఫాల ఉండే తన తల్లి సమాధిని దర్శించుకు నేందుకు వెళతాడని తెలుసుకుని మిత్రులతో కలిసి నైజాంను చంపాలని, ప్రాణత్యాగానికైనా సిద్ధపడ్డారు. నారాయణ పవార్, పండిత విశ్వనాథ్ బొంబాయి వెళ్లి బాంబులు కొనాలని బయలు దేరారు. మార్గ మధ్యలో షోలాపూర్ వద్ద కొండా లక్ష్మణ్ బాపూజీ కనబడ్డాడు. విషయం చెప్పారు. ఆరు వందల రూపాయ లిచ్చి జాగ్రత్తలు చెప్పి వెళ్లాడు. బొంబాయి వెళ్లి రెండు బాంబులు, రెండు రివాల్వర్లను తీసుకున్నారు. బాంబులు ఫెయిల్ అయితే రివాల్వర్, అదీ ఫెయిల్ అయితే శత్రువుకు మాత్రం చిక్కకూడదు, పథకం ఎక్కడ పొక్క కూడదు. ఇది పథకం. హైదరాబాద్‌కు వచ్చిన పవార్ నిజాంను ఎందుకు చంపాలనుకున్నది వివరంగా ఒక ఉత్తరం రాసారు. పవార్, జగదీష్, గండయ్యలు దానిపై రక్తంతో సంతకం చేసి నారాయణ స్వామికి ఇచ్చారు. బాంబులు వేసిన తర్వాత విజయవాడకు వెళ్లి ఆ పత్రాన్ని పత్రికలకు, రేడియో సంబంధీకులకు, నారాయణ స్వామి ఇవ్వాలన్నది వారి పథకం. అనుకున్న విధంగా వారు సంసిద్ధ మైన క్రమంలో, 1947 డిసెంబర్ 4న సాయంత్రం సుమారు 4 గంటల సమయాన, కింగ్‌కోఠి రోడ్డు నుండి తల్లి సమాధి దగ్గరకు వెళ్లే సమయంలో నిజాం ఇంటి ముందే గండయ్య, జగదీష్‌తో కలిసి పవార్ మాటు వేశాడు. పవార్ అందరి కంటే ముందు ఉన్నాడు. ఒకవేళ అతని చేతిలో తప్పించుకుంటే రెండో వాడు, అక్కడా తప్పితే మూడో వ్యక్తి పూర్తి చేయాలని రెడీ అయ్యారు. నిజాం కారు పవార్ దగ్గరకు రాంగనే కారుపై బాంబు విసిరాడు. అది గురి తప్పింది. కానీ ఆ బాంబు పేలుడుకు ఒక ఆడ మనిషి చని పోయింది. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే నిజాంపై రివాల్వర్‌తో కాల్చాలను కున్నాడు. ఈలోపే పోలీసులు పట్టుకున్నారు. బాంబు శబ్దం విన్న జగదీష్, గండయ్య పథకం విజయవంతమైందని అనుకొని వెళ్లిపోయారు. లేకుంటే నిజాంకు అదే ఆఖరి రోజు అయ్యేది. సైకిల్ ఆధారంగా గండయ్యను కూడా అరెస్టు చేశారు. ఐదు రోజులు నారాయణ పవార్‌ను పోలీసులు నానా చిత్ర హింసలు పెట్టారు. తన కేసును వాదించడానికి కోవడానికి వకీల్‌ను నియమించు కోక, స్వయంగా తానే తన వాదనలను వినిపించు కున్నాడు. ఎందుకు చంపాలనుకున్నాడో విచారణలో వివరించాడు. చివరికి కోర్టు పవార్‌కు ఉరిశిక్ష విధించింది. 1948 సెప్టెంబర్ 18న అది అమలు కావాల్సి ఉండగా, ఒక్క రోజు ముందు సెప్టెంబరు 17 న నిజాము నవాబు వల్లబాయి పటేల్ ముందు లొంగిపోగా, హైదరాబాద్ సంస్థానం స్వతంత్ర భారత్ లో విలీనం అయి పోయింది. సంస్థానం విముక్తి తర్వాత మిలిటరీ గవర్నర్ మేజర్ జనరల్ జె.ఎన్.చౌదరి, ఉరిశిక్షను యావజ్జీవ కారాగార శిక్షగా మార్చాడు. కాని వివిధ సంస్థల ఆందోళనతో 1949 ఆగస్టు 10న జనరల్ చౌదరి వీరిని విడుదల చేశాడు.అతనితోపాటు గండయ్య కూడా విడుదలయ్యాడు. ఎట్టకేలకు పవార్ 2009 ఆగస్టు 9న నాటి రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ ద్వారా పవార్ సన్మానించ బడి నాడు. నారాయణరావు పవార్ 85 యేళ్ళ వయసులో హైదరాబాద్‌లోని కేర్ ఆస్పత్రిలో, 2010, డిసెంబర్ 8 న కన్నుమూసాడు. తెలంగాణ గర్వించ దగిన పవార్ లాంటి దీరులను, త్యాగ ధనులను భావితరాలకు తెలిసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. నాటి చరిత్ర ను మరవకుండా ఉండేందుకు వైయక్తిక, చారిత్రక సంఘటనలను, సందర్భాలను పాఠ్యాంశాలుగా చేయాలి.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# సాహిత్య ఉద్యమంలో చలసానిది ప్రత్యేక స్థానం

## చలసాని జీవితం ప్రత్యేకతల సమాహారం - డిసెంబర్ 8...చలసాని ప్రసాద్ జయంతి



చలసాని ప్రసాద్ ప్రముఖ కవి, రచయిత, విమర్శకులు. ఆయన విప్లవ రచయితల సంఘం వ్యవస్థాపక సభ్యులు. విప్లవ రచయితగా, ప్రజా ఉద్యమాలను సమర్థించే కార్యకర్తగానే ఆయన జీవిత మంతా గడిపారు. ఉద్య మాల అణచివేతపై గళమెత్తారు. ఈ క్రమంలో అనేక సార్లు జైలుకు వెళ్లారు. విరసం ప్రస్థానంలో చలసానిది చెరగని ముద్ర. చలసాని ప్రసాద్ స్వస్థలం కృష్ణా జిల్లా లోని భట్ల పెనుమర్రు. డిసెంబరు 8, 1932 న కృష్ణానది తీరంలోని చల్లపల్లి దగ్గరిలో నాదెళ్ళవారి పాలెంలో జన్మించారు. విరసం స్థాపనలో ఆయనది కీలకమైన పాత్ర. అత్యవసర పరిస్థితి కాలంలో ఆయన జైలుకు వెళ్లారు. నమ్మిన విప్లవ సిద్ధాంతానికి కట్టుబడిన ఆయన పలుమార్లు జైలు జీవితం అనుభ వించారు. కవిగా, రచయితగా, విమర్శకుడిగా ఆయనకు మంచి పేరుంది., కొడవటి గంటి కుటుంబ రావు, రావిశాస్త్రి, కెవిఆర్‌లతో ఆయనకు సన్నిహిత సంబంధా లుండేవి. పలు గ్రంథాలను ఆయన సంకలనం చేశారు. శ్రీశ్రీ సాహిత్యంపై ఆయనకు ఎనలేని పట్టు ఉండేది. సాంస్కృతిక, సాహిత్య ఉద్యమాల్లో ఆయన ముఖ్యమైన భూమిక పోషించారు చలసాని ప్రసాద్. విప్లవ సాహిత్యోద్యమంలో ఆయన చివరి శ్వాస వరకు పాల్గొంటూ వచ్చారు. కమ్యూనిస్టు కుటుంబంలో జన్మించిన ఆయన చివరి వరకు కమ్యూనిస్టుగానే కొనసాగారు. కమ్యూనిస్ట్ ఉద్యమంలో కీలక పాత్ర వహించిన చలసాని ప్రసాద్.. నమ్మిన సిద్ధాంతాలకోసం చాలా మందితో విభేదించారు. కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో ఉన్నారు. ఎమర్జన్సీ కాలంలో చలసాని ప్రసాద్ జైలు శిక్ష అనుభవించారు. సాహితీ విమర్శకుడుగా ఎందరికో స్ఫూర్తి నిచ్చారు. విప్లవ రచయితల సంఘం స్థాపనలో శ్రీశ్రీతో కలిసి పనిచేశారు. ప్రజా ఉద్యమాల అణిచివేతలపై జీవితకాలం పోరాడారు. ఎన్నోసార్లు జైలు జీవితం గడిపాడు. శ్రీశ్రీ, రంగనాయకమ్మలకు చలసాని అత్యంత సన్నిహితులు. ఆయన విశాఖపట్నం ఎ.వి.ఎన్ కళాశాల నుంచి రాజనీతి శాస్త్రం అధ్యాపకునిగా పదవీ విరమణ చేశారు. హెచ్.బి.కాలనీ, విశాఖ పట్నంలోని ఆయన గృహంలో అనేక 20 వేలకు పైగా పుస్తకాలు ఉన్నాయి. అందులో ఎక్కడా లభించని అరుదైన పుస్తకాలు ఉన్నాయి. ఆయన అనేక విషయాలలో లోతుల వరకు చర్చించేవారు. ఆయన వద్ద ఉన్న పుస్తకాల ఆధారంగా ఎందరో పీహెచ్‌డీలు చేశారు. ఆయన వామపక్ష భావజాలం కలిగి ఉన్నప్పటికీ విశ్వనాథ సత్య నారాయణ సాహిత్య సమా వేశాలకు ఎప్పుడూ హాజరయ్యే వారు. ఆయనకు రచలనంటే ఆసక్తి ఎక్కువ. పధ్నాలుగేళ్లు కష్టపడి ఇరవై భాగాలుగా శ్రీశ్రీ సాహితీ సర్వస్వాన్ని ప్రచురించినా, అదే తరగని ఉత్సాహంతో రావిశాస్త్రి, కొడవటిగంటి కుటుంబరావుల సాహిత్య మంతటినీ సంపుటాలుగా వెలువరించినా అది చలసానికే చెల్లింది. కృష్ణా జిల్లా లోని ఓ సాధారణ కుటుంబంలో జన్మించిన చలసాని ప్రసాద్ బాల్యం నుంచి కమ్యూనిస్టు ఉద్యమాన్ని చూస్తూ, ఆస్వాదిస్తూ పెరిగారు. తెలంగాణా సాయుధ పోరాటంలో ఆయన కుటుంబం ప్రత్యక్షంగా పాలుపంచుకుంది. కమ్యూనిస్టు కుటుంబంలో పుట్టి మార్క్సిస్టుగా పెరిగి, విప్లవ రచయితగా స్థిరపడ్డ చలసాని జీవితం ఎన్నో ప్రత్యేకతల సమాహారం. సాహిత్య రంగంలో ఆయన కృషి ఎన్నదగినది. సాహిత్యోద్యమాల నిర్మాణంలో గత అర్ధ శతాబ్దంలో ఆయన కీలక పాత్ర పోషించారు. విరసం వ్యవస్థాపకత్వంలో ఆయనది ప్రధానమైన పాత్ర. ఆయన పేరు ఎవరు ప్రస్తావించినా విరసం ప్రసాద్ అంటారు. విరసం దాదాపుగా ఆయన ఇంటిపేరై పోయింది. ప్రసాద్ సాహితీ సృజన తక్కువేమీ కాదు. కవిత్వం, వ్యాసాలు రాశారు. అవసరమైనప్పుడల్లా సామాజిక, రాజకీయ అంశాల మీదా రాశారు. అయితే ఉద్యమ జీవులందరికి లాగే తన సృజనాత్మక శక్తిని ప్రోది చేసుకుని, పదిల పరచుకుని ఆ రంగంలో కీర్తి సంపాదించాలన్న దుగ్ధ ఆయనకే నాడూ లేదు. 1970లో విరసం ఏర్పడినప్పటి నుంచి కార్యవర్గ సభ్యులుగా ఉన్నారు. 1985 నుంచి 88 వరకు మూడేళ్ల పాటు విరసానికి కార్యదర్శి. 1998 నుంచి 2002 వరకు అధ్యక్షులు. అయినా ఆయన సాహిత్యోద్యమంలో తనను తాను కార్యకర్తగానే పరిగణించే వారు. సాహితీ రంగం కూడా ఆయనను అదే దృష్టితో చూసింది. తొమ్మిదో తరతి విద్యార్థిగా ఉన్నప్పుడు 1947 "నవయుగ" సంచికలో "ఓ విద్యార్థి సోదరుడా, సమ్మెయే మన ఆఖరి ఆయుధమోయ్" అన్న పాటతో మొదలు పెట్టి కవిత్వం, సాహిత్య విమర్శ, ముందు మాటలు, సాహిత్య, రాజకీయ అంశాల మీద వ్యాసాలు దండిగానే రాశారు. చాలా కాలం పాటు ఒకటి రెండు అనువాదాలు తప్ప స్వతంత్ర రచనలుగా ప్రచురించడం మీద ఆయన దృష్టి ఎన్నడూ లేదు. 2008లో "సాహిత్య వ్యాసాలు", 2010లో "చలసాని ప్రసాద్ రచనలు" వెలువడ్డాయి. ఇంగ్లీషును ఎదిరించి నిలిచిన భాష తెలుగు. ఏ భాషా పదాన్నయినా తనలో కలుపుకొని ఎదిగే శక్తి తెలుగుకు ఉంది. అందుకే తెలుగు అజరామరం. తెలుగు భవిష్యత్తు ఉజ్వలం అని చలసాని చెపుతుండే వారు. చలసాని జూలై 25, 2015న విశాఖపట్టణం లోని తన నివాసం లోనే గుండెపోటుతో తుది శ్వాస విడిచారు. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# విశాఖ నుంచే స్మార్ట్ మీటర్ ప్రయోగం...జనాలకు ఓకేనా ?



ఏపీలో కూటమి ప్రభుత్వం ఒక వైపు విద్యుత్ బాదుడుకు తెర తీసిందని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఏకంగా 18 వేల కోట్ల రూపాయలను ట్రూ అప్ చార్జీల పేరుతో మోత మోగించిందని కూడా విమర్శిస్తున్నాయి. ఇది సామాన్యుడు తట్టుకోలేని పెను భారం అని అంటున్నాయి. అయితే గత అయిదేళ్లలో వైసీపీ ప్రభుత్వం చేసిన నిర్వాకం విద్యుత్ రంగంలో చేసిన అనేక పొరపాట్ల వల్లనే ఇపుడు ఈ అధిక భారం పడుతోందని మొత్తం అన్నీ సరిచేస్తున్నామని కూటమి ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారు. ఈ పరిస్థితులలో విద్యుత్ బాదుడు మీద వామపక్షాలు పోరాటం చేశాయి. కాంగ్రెస్ కూడా షర్మిల నాయకత్వంలో ఉద్యమించింది. వైసీపీ ఈ నెల 13 నుంచి మూడు దశల పోరాటానికి పిలుపు ఇచ్చింది. ఇదిలా ఉంటే దీనికి మరోటి అన్నట్లుగా ఏపీలో స్మార్ట్ మీటర్ల ప్రయోగానికి టీడీపీ కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది అని అంటున్నారు. ఇది విద్యుత్ రంగంలో ప్రయోగం అని అంటున్నారు. ఒక విధంగా సంస్కరణలు అన్న మాట. మరి ఈ సంస్కరణలకు జనాల నుంచి ఏ మేరకు మద్దతు ఉంటుందో తెలియదు కానీ ఇది కూడా జనం నెత్తిన గుదిబండే అని వామపక్షాలు అపుడే విమర్శలు చేస్తున్నాయి. స్మార్ట్ మీటర్లను ఇంటింటికీ బిగించడం ద్వారా విద్యుత్ శాఖ చేస్తున్న ఈ సరికొత్త ప్రయోగం విద్యుత్ వినియోగదారులలో ఆందోళనలు రేకెత్తిస్తోంది. ఎందుకంటే ఈ స్మార్ట్ మీటర్ల ద్వారా ఎంత బిల్లు నెలకు వస్తుందో అన్న భయాలు అయితే ఉన్నాయి. పైగా ఇది ప్రీ పెయిడ్ విధానంలో ఉంటుంది. అంటే నెలకు ఎన్ని యూనిట్లు వాడుతారో ఒక అంచనాకు వచ్చి ప్రీ పెయిడ్ గా మొత్తాలను చెల్లిస్తే ఆయా స్మార్ట్ మీటర్ల నుంచి విద్యుత్ సరఫరా అవుతుంది. ఇక ప్రీ పెయిడ్ విధానంలో రీచార్జి కనుక చేయక పోతే ఆ వెంటనే ఇంట్లో కరెంట్ పోతుంది. మొత్తం చీకటి అవుతుంది. ఇదంతా ఆటోమేటిక్ గా జరిగిపోతుంది అన్న మాట. ఇపుడు విద్యుత్ బిల్లులు చెల్లించకపోతే కొంత గ్రేస్ పీరియడ్ ఇస్తారు. అలాగే అపరాధ రుసుము వేస్తారు. ఆ తరువాత కానీ కరెంట్ కట్ అవదు. కానీ స్మార్ట్ మీటర్లు ఒకసారి బిగిస్తే కనుక వినియోగదారులకు కలిగే అతి పెద్ద ఇబ్బంది ఇది అని అంటున్నారు. ఇక విద్యుత్ స్మార్ట్ మీటర్ల వల్ల రీచార్జి విషయంలో అప్రమత్తంగా ఉండాల్సి ఉంది. నిరక్షరాస్యులు చదువరులు కాని వారికి ఇది ఇబ్బందే అని అంటున్నారు. ఇక ఒక కుటుంబానికి సగటున వేయి రూపాయలు బిల్లు వస్తోంది అంటే వారు నెలకు సరిపడా వేయి రూపాయలు ప్రీ పెయిడ్ చేసుకోవాల్సి ఉంటుంది. అవసరం అయితే మరో వంద అదనంగా చేసుకున్నా తప్పు లేదు. ఎందుకంటే రోజూ ఒకేలా వాడతారని ఉండదు కాబట్టి మధ్యలో కట్ అవకుండా చూసుకోవచ్చు. ఇక ఎప్పటికపుడు రీచార్జి విషయంలో అలెర్ట్ ఉంటుందని అంటున్నారు. అలాగే ఎంత యూనిట్లు వాడకం చేశారో కూడా ఆన్ లైన్ లో చూసుకోవచ్చు అని చెబుతున్నారు. మరో వైపు చూస్తే విద్యుత్ దుర్వినియోగం కాదు అని చెబుతున్నారు. ఇదిలా ఉంటే విశాఖలోని తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ మొట్టమొదటి స్మార్ట్ మీటర్ ని విశాఖ ప్రజారోగ్య శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయంలో ఇటీవల ఏర్పాటు చేసింది. ఈ విధంగా మొదట ప్రభుత్వ కార్యాలయంలో ఏర్పాటు చేసి అక్కడ పనితీరు చూస్తున్నారు. ఆ మీదట ఇళ్ళకు కూడా స్మార్ట్ మీటర్లను బిగిస్తారు. అది కూడా విశాఖ నుంచే స్టార్ట్ చేస్తారు అని అంటున్నారు. ఒక్కో స్మార్ట్ మీటరుకు అయ్యే మొత్తాన్ని కూడా వినియోగదారులే భరించాల్సి ఉంటుందని అంటున్నారు. దానిని వాయిదా పద్ధతిలో నెలకు ఇంత అన్నట్లుగా వసూలు చేస్తారు అని అంటున్నారు. ఇక ఏపీలో చూస్తే రాయలసీమలోని నంద్యాలలో కూడా ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేశారు. ఇవన్నీ ఇలా ఉంటే స్మార్టు మీటర్ల బిగింపుతో అధికంగా విద్యుత్ బిల్లులు వస్తాయని ప్రచారం అయితే సాగుతోంది. దీని మీద అధికారికంగా వివరణ అధికారులు ఇవ్వాల్సి ఉంది. అంతే కాకుండా సాంకేతిక పరమైన సమస్యలు తలెత్తినా విద్యుత్ సడెన్ గా సరఫరా ఉండదని డౌట్లు ఉన్నాయి. వాటిని కూడా క్లారిఫై చేయాలి. అపుడే ఈ సంస్కరణలకు ఫలితం ప్రజామోదం ఉంటుందని అంటున్నారు.

# స్వదేశంలో ఆస్తుల రక్షణ... ఎన్నారైలకు షాకింగ్ సమస్య!

ఒకప్పుడు విదేశాల్లో ఉద్యోగలు చేసుకుంటున్న ఎన్నారైలకు... సొంత ఊరిని, కన్నవారిని, స్నేహితులను, బంధువులను విడిచిపెట్టి వచ్చామనే బాధ ఎక్కువగా ఉండేదని అనేవారు! అయితే... ఇప్పుడు మాత్రం ఆస్తులు అన్నీ అక్కడే ఉండిపోయాయి, ఎవడు ఎత్తుకుపోతాడో అనే టెన్షన్ వచ్చి చేరిందని.. ఇది ఇప్పుడు తీవ్రంగా మారిందని అంటున్నారు. అవును... నేడు భారతదేశంలో ఎన్నారైలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో ఒకటి.. వారి పూర్వీకుల లేదా వారి పాత ఆస్తులను అక్రమంగా స్వాధీనం చేసుకోకుండా కాపాడుకోవడమే అనే చర్చ బలంగా జరుగుతోంది. ఇటీవల ఇలాంటి ఉదంతాలు పెరుగుతుండటంతో.. అనేక కేసులు కోర్టు మెట్లు ఎక్కుతున్నాయని అంటున్నారు. ఇక్కడ ఎన్నారైలు ఆస్తులను చట్టపరమైన స్వాధీనం చేసుకోవడానికి పోటీ పడుతున్నారని అంటున్నారు. ఈ తరహా వివాదాలకు కొన్ని సందర్భాల్లో అపరిచితులు



కారణమైతే.. మరికొన్ని సార్లు బంధువులే ఆక్రమణలకు పాల్పడుతున్నారని చెబుతున్నారు. ఈ తరహా ఘటనలు ప్రధానంగ ఆస్థి విలువ ఎక్కువగా ఉండే మెట్రో నగరాల్లో జరుగుతున్నాయని అంటున్నారు. ఈ సందర్భగా... చట్టవిరుద్ధంగా ఆక్రమణకు గురైన ఆస్తులను తిరిగి పొందే క్రమంలో కలిగే మానసిక, ఆర్థిక నష్టాలు చాలా భయంకరంగా ఉన్నాయని.. చాలా మంది ఎన్నారైలు ఇలాంటి కేసులతో వ్యవహరించే క్రమంలో తీవ్ర ఆందోళన, నిరాశ వ్యక్తం చేస్తున్నారని అంటున్నారు. ఈ విషయాలపై స్పందించిన ఎన్నారై తరుపు న్యాయవాది అభిషేక్ రస్తోగి స్పందిస్తూ... బాధిత ఆస్తి యజమానులకు అందుబాటులో ఉన్న చట్టపరమైన సహాయాన్ని వివరించారు. ఇందులో భాగంగా... ఆస్తి చట్టబద్ధమైన యజమానులకు అనేక పరిష్కారాలు అందుబాటులో ఉన్నాయని.. ముందుగా పోలీసు ఫిర్యాదును నమోదు చేయాలని తెలిపారు.

భారతీయ న్యాయవ్యవస్థ పటిష్టంగా ఉందని.. ఆస్తి యజమానుల హక్కులను కాపాడేందుకు చట్టం చక్కగా రూపొందించబడిందని.. న్యాయ వ్యవస్థ అటువంటి సందర్భాల్లో ఎన్నారైల హక్కులను పరిరక్షించడంలో తన నిబద్ధతను ప్రదర్శించినప్పటికీ... క్రమబద్ధమైన చట్టపరమైన ప్రక్రియల అవసరాన్ని హైలెట్ చేస్తున్నాయని అన్నారు.

# బిగ్ బూమ్.. కోటి కోట్ల దిశగా భారత బిలియనీర్ల సంపద!

'ఒక కోటి సంపాదించే వరకే నాకు గుర్తుంది.. ఆపై ఎంత సంపాదించానో గుర్తు లేదు'.. బిలియనీర్లు చెప్పే మాట ఇది. మిగతావారికి కాస్త ఆశ్చర్యంగానో, అతిగానో అనిపించినా కొంత నిజం ఉంది. ఇప్పుడు ఇదంతా ఎందుకంటే.. కొవిడ్ మహమ్మారి వ్యాప్తి, రెండు-మూడు యుద్ధాలు, రాజకీయంగా అనిశ్చిత పరిస్థితులు.. ఇలా ఏం జరుగుతున్నా ప్రపంచంలోని బిలియనీర్ల సంపద మాత్రం పెరిగిపోతూనే ఉండడం.

**మనోళ్లు 185..** 2014 నుంచి చూస్తే బిలియనీర్ల సంపద 121 శాతం పెరిగిందట. మొత్తంగా 14 ట్రిలియన్ డాలర్లకు చేరిందని స్విట్జర్లాండ్ అతి పెద్ద బ్యాంక్ యూబీసీ నివేదించింది. దీంతోపాటు భారత్‌లో బిలియనీర్ల సంఖ్య ఈ ఏడాది 185కు పెరిగిందని పేర్కొంది. వీరందరి సంపద కలిపితే రూ.76 లక్షల కోట్ల పైమాటేనని చెప్పింది.

**అప్పట్లో 1,757.. ఇప్పుడు 2,682..** 2015 నుంచి చూస్తే ప్రపంచంలోని మొత్తం అపర కుబేరులు 1,757 మంది అని యూబీసీ



పేర్కొంది. ఇప్పుడు వారు 2,682కు పెరిగారని తెలిపింది. అయితే, మూడేళ్ల కిందటితో పోలిస్తే ఈ సంఖ్య తగ్గింది. 2021లో ప్రపంచంలోని అపర కుబేరులు 2,686. ఇప్పటివరకు ఇదే అత్యధికం. ఇక గత పదేళ్లలో వీరి మొత్తం సంపద 6.3 ట్రిలియన్ డాలర్ల నుంచి 14 ట్రిలియన్ డాలర్లకు పెరిగింది.

**టెక్ దే టిప్ టాప్...** ఇప్పుడంతా టెక్నాలజీ యుగం.. అందుకే టెక్ బిలియనీర్ల సంపదకు రెక్కలొచ్చాయట. అప్పట్లో.. అంటే టెక్నాలజీ ఇంతగా లేని 2015లో టెక్ బిలియనీర్ల సంపద 788.9 బిలియన్ డాలర్లు. ఈ ఏడాది 2.4 ట్రిలియన్ డాలర్లు కావడం విశేషం.

**పారిశ్రామికవేత్తలు సెకండ్...** బిలియనీర్ల జాబితాలో సంప్రదాయ పారిశ్రామికవేత్తలు ద్వితీయ స్థానంలో ఉన్నారు. 2015-2020 మధ్య చైనా బిలియనీర్ల సంపద 887.3 బిలియన్ డాలర్ల నుంచి 2.1 ట్రిలియన్ డాలర్లకు చేరింది. తర్వాత నుంచి తరుగుతూ వస్తోంది. ప్రస్తుతం 1.8 ట్రిలియన్ డాలర్లుగా ఉంది.

**268 కొత్త బిలియనీర్లు.. భారతీయులు 185..** 2024లో ఒక్క ఏడాదిలోనే కొత్తగా 268 మంది బిలియనీర్లు పుట్టుకొచ్చారు. వీరిలో 60 శాతం వ్యాపార వ్యవస్థాపకులే. అమెరికా కుబేరుల సంపద 27.6శాతం పెరిగి 5.8 ట్రిలియన్ డాలర్లుగా ఉంది. భారత్ లో బిలియనీర్ల సంఖ్య 153 నుంచి 185కు పెరిగింది. ఇక మన దేశ కుబేరుల మొత్తం సంపద ఈ ఏడాది 42.1శాతం పెరిగి 905.6 బిలియన్ డాలర్లకు (రూ.76లక్షల కోట్లకు పైమాటే) చేరింది. చూస్తూ ఉంటే ఏడాది రెండేళ్లలో ఇది కోటి కోట్లకు చేరడం ఖాయమే.

# 5 నెలలైనా అల్పాహారం ఊసేది..?

హైదరాబాద్: రాజధానిలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులందరికీ అల్పాహారం అందించేందుకు గత ప్రభుత్వం చేపట్టిన పథకం నిలిచిపోయింది. ఈ ఏడాది జూన్ విద్యా సంవత్సరం ప్రారంభమై ఐదునెలలు పూర్తైనా ఇప్పటి వరకూ విద్యాశాఖ అధికారులు స్పందించడం లేదు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో గతంలో విద్యార్థులకు పౌష్టికాహారం అందించారు. ప్రస్తుతం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని 2500పైగా ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహారం అందడం లేదు. పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణతను పెంచేందుకు డిసెంబరు తొలివారం నుంచి ప్రత్యేక తరగతులను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ప్రారంభించారు. వీటికి హాజరయ్యే విద్యార్థులకు గతంలో చిరుతిళ్లు అందజేయగా ప్రస్తుతం ఆ ప్రస్తావనే లేదు. విద్యాశాఖ అధికారులను అడగ్గా.. బడ్జెట్ కేటాయింపులు ఇంకా రాలేదని, వస్తే అమలు చేస్తామంటున్నారు. ఉదయం, సాయంత్రం తరగతులకు హాజరవుతున్న పదోతరగతి విద్యార్థులకు కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సేవాసంస్థల ప్రతినిధులు చిరుతిళ్లను పంపిణీ చేస్తున్నారు.



**ఉదయమే ఆకలితో వస్తారు..**

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ప్రభుత్వ పాఠశాలలు ఉదయం 9గంటల్లోపే ప్రారంభమవుతున్నాయి. ఆయా పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు ఇళ్లనుంచి వచ్చేప్పుడు అల్పాహారం తినకుండా వస్తారని, ఆకలితో పాఠాలు వినలేరన్న భావనతో గతంలో ఇడ్లీ, ఉప్మా, పొంగల్ వంటి వాటితో రోజూ అల్పాహారాన్ని అందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పథకాన్ని మరింత మెరుగుగా అమలు చేయాలని విద్యాశాఖ అధికారులు నిర్ణయించారు. అమలులో చేతులెత్తేశారు. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలలను పర్యవేక్షించాల్సిన జిల్లా విద్యాశాఖ అధికారులు ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకుంటే అమలు చేస్తామని చెబుతున్నారు.

**రెండు గంటలు.. చిక్కీలు.. బిస్కెట్లు**

పదోతరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం రెండు గంటల పాటు ప్రత్యేక తరగతులను ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్నారు. దీంతో పదోతరగతి విద్యార్థులు ఉదయం 8 గంటలకు వచ్చి సాయంత్రం 5.30కు ఇళ్లకు వెళ్తున్నారు. మధ్యాహ్న భోజనం మినహా మధ్యలో ఎలాంటి ఆహారం తీసుకోకపోవడంతో విద్యార్థులు ఆకలితో ఉంటారన్న భావనతో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులే చిక్కీలు, బిస్కెట్లు తీసుకొస్తున్నారు. పాతబస్తీలోని కొన్ని పాఠశాలలకు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు చిరుతిళ్లు పంపిణీ చేస్తున్నారు. కొందరు సమోసాలు, మరికొందరు అరటిపళ్లు ఇస్తున్నారు.

# సంతాన భాగ్యం!

హైదరాబాద్: పేట్లబుర్జు ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో ఇన్‌విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవీఎఫ్) ప్రక్రియ ప్రారంభం కానుంది. తొలిసారి ఓ మహిళకు ఈ ప్రక్రియ చేపట్టనున్నారు. మరికొన్ని జంటలు కూడా ఐవీఎఫ్ సేవలకు సిద్ధంగా ఉన్నాయి. ఇక్కడ అధునాతన లేబరేటరీ, పరికరాలు సిద్ధం చేశారు. ఇప్పటికే ఇంట్రా యుటెరైన్ ఇన్సెమినేషన్ (ఐయూఐ) ద్వారా సంతానం లేని దాదాపు 20 జంటలకు ఈ విధానంలో చికిత్స అందించినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ రజినీరెడ్డి చెప్పారు. భర్త నుంచి సేకరించిన వీర్యాన్ని ల్యాబ్‌లో శుద్ధి చేసి దానిని హైలీ కాన్సన్‌ట్రేటెడ్ మొటిలిటీ స్పెర్మ్‌గా మార్చి భార్య అండాశయంలోకి ప్రవేశపెడతారు. ఈ విధానంతో 80 శాతం ఫలితాలుంటాయని వైద్యులు చెబుతున్నారు. అప్పటికీ సంతానం



కలగకపోతే ఐవీఎఫ్ చేయనున్నారు. ఈ పద్ధతిలో ల్యాబ్‌లో పిండం ఫలదీకరణ చెందించిన తర్వాత దానిని సంబంధిత మహిళ గర్భాశయంలో ప్రవేశపెడతారు. ఈ సేవలు ఇప్పటికే గాంధీలో ప్రవేశపెట్టారు.

**పిల్లల్లేని దంపతులకు వరం..**

సంతానలేమికి జన్యుపరమైన ఇబ్బందులే కాకుండా వాతావరణ కాలుష్యం, ఉద్యోగ వేటలో పడి ఆలస్యంగా పెళ్లిళ్లు చేసుకోవడం, లేదంటే హార్మోన్ల అసమతుల్యత తదితర కారణాలుగా చెప్పొచ్చు. దీంతో చాలామంది ఐవీఎఫ్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రైవేటు క్లినిక్‌ల్లో ఒక్కసారి ఐవీఎఫ్ చేసుకోవాలంటే రూ.3-4 లక్షల వరకు వెచ్చించాల్సిందే. తొలిసారే విజయవంతం అవుతుందనే గ్యారంటీ కూడా లేదు. రెండోసారి చేయించుకోవాలంటే మరో రూ.3-4 లక్షలు సిద్ధం చేసుకోవాల్సిందే. ఆర్థికంగా వెనుకబడి జంటలు ఈ ఆర్థిక భారం భరించలేక వెనక్కు తగ్గుతున్నారు. కొన్ని జంటలు ఒకటి, రెండుసార్లు ప్రయత్నించి విరమించుకుంటున్నారు.

**ప్రయివేటులో దోపిడీ**

పెళ్లైన ఒకటి రెండేళ్లకే చాలామంది అవగాహన లేక సంతాన సాఫల్య కేంద్రాలను సంప్రదిస్తుంటారు. తొలుత ఇలాంటి జంటలకు సూచనలు, సలహాలు అందించాలి. అనారోగ్య సమస్యలు.. వారు కలిసి ఉండే సమయం.. ఇలా అన్నివిధాలుగా పరిశీలించాలి. ఇద్దరిలో లోపం లేదని తేలితే వారికి ఐవీఎఫ్ అవసరమే ఉండదు. వైద్యుల సూచనలు, సలహాలు తీసుకుంటే సంతాన భాగ్యం దక్కుతుంది. కొన్ని ప్రైవేటు క్లినిక్‌లు మాత్రం పిల్లల్లేని జంటల అవసరాలను ఆసరాగా తీసుకుంటున్నాయి. లేనిపోని భయాలు కల్పించి ఐవీఎఫ్ పేరుతో ఫీజులు వసూలు చేస్తున్నాయి.

# అవిశ్రాంతత ఎదురు చూపులు



వికారాబాద్ : ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన ప్రతి ఉద్యోగికి రిటైర్‌మెంట్ బెనిఫిట్ అందజేస్తారు. ఇదే తరహాలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రిటైర్‌మెంట్ బెనిఫిట్ కింద అంగన్‌వాడీ టీచర్లకు రూ.2 లక్షలు, ఆయాలకు రూ.లక్ష చొప్పున అందజేస్తామని ప్రకటించింది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 65 ఏళ్లు దాటిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను ఉద్యోగం నుంచి తొలగించారు. 2024 జూలై 1 నుంచి జీతభత్యాలను నిలిపివేశారు. వీరంతా ఇప్పుడు ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారు. సంపాదన లేక ఆర్థిక ఇబ్బందులతో కాలం గడుపుతున్నామని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

**నెలకు రూ.5 వేలు పింఛన్ చెల్లించాలి**

– భారతి, అంగన్‌వాడీ టీచర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

ఉద్యోగ విరమణ పొందిన అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు నెలకు రూ.5 వేలు పింఛన్ చెల్లించాలి. 65 సంవత్సరాల తర్వాత ఎలాంటి పనులు చేయడానికి శక్తి ఉండదు. పింఛన్‌ను ఇస్తే ఆర్థిక సహకారాన్ని అందించినట్లు అవుతుంది.

త్వరలో మంజూరు – కృష్ణవేణి, జిల్లా సంక్షేమాధికారిణి, వికారాబాద్

జిల్లాలో ఉద్యోగ విరమణ పొందిన టీచర్లు, ఆయాల జాబితాను ఉన్నతాధికారులకు పంపించాం. జిల్లాల వారిగా నిధులు విడుదల చేస్తున్నారు. త్వరలో మన జిల్లాకు నిధులు మంజూరు చేయవచ్చు.

**త్వరలో మంజూరు:**జిల్లాలో 50 మంది టీచర్లు, 111 మంది ఆయాలు జిల్లాలో 65 ఏళ్లు వయసు నిండిన అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, ఆయాలు 161 మంది వివరాలను అధికారులు నమోదు చేశారు. వీరిలో 50 మంది టీచర్లు, మిగిలిన 111 మంది ఆయాలున్నారు. మరో నాలుగు నెలల్లో ఈ సంఖ్య రెండింతలు కానుంది. గతంలో 70 ఏళ్లు దాటినా విధులు నిర్వర్తించేవారు. ప్రస్తుతం ఐసీడీఎస్ సిబ్బందికి ఉద్యోగ విరమణ వయస్సును నిర్ణయించింది. ఆర్థిక సాయాన్ని పెంచినా అమలుకాకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఆందోళన చేస్తేనే అప్పటి ప్రభుత్వం స్పందించి సిబ్బంది ఉద్యోగ విరమణ వయస్సును 65 ఏళ్లుగా నిర్ణయించింది. ఉద్యోగ విరమణ సమయంలో టీచర్లకు రూ.లక్ష ఆయాలకు రూ. 50 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించాలని ఉత్తర్వులు జారీ చేసింది.

**దుద్యాలలో పోలీస్ స్టేషన్**

దుద్యాల మండలం లగచర్లలో అధికారుల బృందంపై గత నెలలో జరిగిన దాడి నేపథ్యంలో నూతన పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వ హోంశాఖ ముఖ్య కార్యదర్శి రవిగుప్త గత నెల 28నే నోటిఫికేషన్ జారీ చేయగా అధికారికంగా జిల్లా ఎస్పీ ఆఫీస్‌కు ఆదేశాలిచ్చారు.

**ఇప్పటివరకు బొంరాస్‌పేట పరిధి**

ఇప్పటి వరకు బొంరాస్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో కొనసాగే దుద్యాల పరిధిలోని గ్రామాలు నూతనంగా ఏర్పాటయ్యే పోలీస్ స్టేషన్ పరిధిలోకి రానున్నాయి. నారాయణపేట జిల్లా కోస్గి సర్కిల్ పరిధిలో కొనసాగిన హకీంపేట, పోలేపల్లి, దౌల్తాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కుదురుమల్ల, కొడంగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆలేడు, హస్నాబాద్‌లను దుద్యాల పోలీస్‌స్టేషన్ పరిధిలోకి చేర్చారు.

**పతంజలి ఆశ్రమంలో నిర్వహణ యోచన**

పోలీస్‌స్టేషన్ నిర్వహణకు పక్కా భవనం లేకపోవడంతో అద్దె భవనంలో కొనసాగించడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. దుద్యాల గేట్ సమీపంలోని పతంజలి ఆశ్రమంలో కొనసాగించాలని యోచిస్తున్నారు. ఈ ఆశ్రమాన్ని ఇది వరకే జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి, పరిగి డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

**2022 అక్టోబర్ 3న నూతన మండలంగా ఏర్పాటు**

దుద్యాల నూతన మండలంగా 2022 అక్టోబర్ 3న ఆవిర్భవించింది. రెండేళ్లు దాటినా ప్రభుత్వ కార్యాలయాలకు నిధులు మంజూరు కాలేదు. ఇటీవలే ప్రభుత్వ సమీకృత కార్యాలయాల సముదాయం (ఇంటిగ్రేటెడ్ బిల్డింగ్)లో భాగంగా తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో, మండల విద్యావనరుల కేంద్రం, వ్యవసాయ శాఖ కార్యాలయం తదితర కార్యాలయాల భవనాల నిర్మాణాలకు ప్రభుత్వం రూ.8.5కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ భవనాల నిర్మాణానికి రైతువేదిక సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిని గుర్తించి సర్వే నిర్వహించారు. రెవెన్యూ శాఖ భవన నిర్మాణాలకు భూమిని కేటాయిస్తూ ప్రతిపాదనలు రూపొందించే పనిలో ఉంది. తాజాగా నూతన పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి కూడా నిధులు మంజూరు కానుండటంతో పూర్తి స్థాయిలో ప్రభుత్వ శాఖల కార్యాలయాలు దశల వారీగా రానున్నాయి.

# నితం.. విద్యార్థుల లేక సతమతం



హైదరాబాద్: పర్యాటక రంగం అభివృద్ధికి, పర్యాటక ఆతిథ్య రంగానికి అత్యంత నైపుణ్యం కలిగిన ఉన్నతస్థాయి మానవ వనరులను అందించేందుకు ఐఐటీ, ఐఐఎంల స్థాయిలో రెండు దశాబ్దాల క్రితం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన నితం (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్) విద్యార్థులు లేక వెలవెలబోతోంది. ఇందులో బీబీఏ, ఎంబీఏ, బీఎస్సీలో ఒక్కో కోర్సులో 120 మంది చొప్పున మొత్తం 360 మంది విద్యార్థులు అడ్మిషన్లకు అవకాశం ఉంది. 2025లో 27 మంది మాత్రమే చేరడం గమనార్హం. 120 సీట్లు ఉన్న ఎంబీఏలో కేవలం నలుగురే ప్రవేశం పొందారు. రెండు దశాబ్దాల క్రితం జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పర్యాటక, ఆతిథ్య రంగంలో విద్య, శిక్షణ, పరిశోధనతో కన్సల్టెన్సీ సేవలు అందించేందుకు నితం ఏర్పాటైంది. మానవ వనరులు, ప్రజా సంబంధాలు, ఈవెంట్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్, బిజినెస్ డెవలప్‌మెంట్, ఫెసిలిటీ మేనేజ్‌మెంట్, బీఎస్సీ హాస్పిటాలటీ, హోటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సులను అందిస్తోంది. సుమారు నాలుగు వేలమంది ఇప్పటిదాకా ఇక్కడ కోర్సులను పూర్తి చేసుకుని ఎయిర్‌లైన్స్, ట్రావెల్ ఏజెన్సీలు, టూర్ ఆపరేటర్లు, ఎయిర్‌పోర్ట్‌లు హోటళ్లు, రిసార్ట్‌లు, ఈవెంట్ మేనేజ్‌మెంట్‌తోపాటు వివిధ సంస్థల్లో ఉద్యోగాల్లో చేరారు. కొన్నేళ్లుగా ప్రవేశాలు తగ్గుతూ వస్తుండగా ఈ ఏడాది మరింత దారుణంగా మారింది. అత్యాధునిక వసతులు, వరల్డ్‌క్లాస్ కలినరీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను కలిగి ఉండి లైబ్రరీ, హాస్టల్ వసతితోపాటు హాస్పిటాలటీ లేబొరేటరీలు ఉన్నాయి. కొత్తగా వస్తున్న ఉద్యోగ అవకాశాల్లో నాలుగింటిలో ఒక ఉద్యోగం పర్యాటక, ఆతిథ్య రంగాల్లోనే ఉంటున్నా.. అందుకోలేని పరిస్థితి. ప్రస్తుతం ఒక ప్రొఫెసర్, ఐదుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, మరో ముగ్గురు ఫ్యాకల్టీ సభ్యులు ఉన్నారు. సరిపడా బోధనా సిబ్బంది ఇక్కడ లేకపోవడంతో విద్యార్థులు ఇక్కడ చదివేందుకు ఆసక్తి చూపడం లేదు.

**పర్యవేక్షణ నాస్తి...**

యువజన, పర్యాటక శాఖ ఆధీనంలో ఉన్న నితంపై పరిపాలనాపరమైన ఉదాసీనత కొనసాగుతోంది. కొన్నేళ్లుగా బోధన, క్యాంపస్ రిక్రూట్‌మెంట్లను నిర్లక్ష్యం చేశారు. దీంతో సరైన శిక్షణ లేక, ఉపాధికి ఇబ్బందులు ఎదుర్కొంటూ విద్యార్థులు కోర్సులు పూర్తి చేయాల్సి వస్తోంది. ఫలితంగా అడ్మిషన్ల తీసుకునేందుకు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది.

# చుక్కేసి.. చిక్కేస్తే డ్రైవింగ్ లైసెన్సు రద్దు

హైదరాబాద్: డ్రైవింగ్ లైసెన్సుల రద్దు చేసిన వాటిలో మందుబాబులవే అధికంగా ఉంటున్నాయి. మద్యం మత్తులో వాహనం నడిపినా, అధిక వేగం, బరువుతో వాణిజ్య వాహనాలు నడిపినట్లు చోదకుడిపై కేసు నమోదైతే లైసెన్సును రవాణా శాఖ అధికారులు సస్పెండ్ చేస్తారు. ఏడాది కాలంలో రాష్ట్రంలో 15,209 లైసెన్సులను రవాణా శాఖ సస్పెండ్ చేసింది. అందులో 85 శాతం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో నమోదైన కేసులే కావడం విశేషం. గ్రేటర్ పరిధిలో 2022-23లో 16,649 లైసెన్సులు సస్పెండ్ చేయగా.. 2023-24లో ఆ సంఖ్య 7,565కు తగ్గింది. 2024-25లో ఇప్పటి వరకు సుమారు 10 వేల వరకు లైసెన్సులను రవాణా శాఖ సస్పెండ్ చేసినట్లు సమాచారం.చర్యలు తీసుకోవడంలో రవాణా శాఖ జాప్యం చేస్తోందని పోలీసు శాఖ అసహనం వ్యక్తం చేయడంతో ఇటీవల ఆ ప్రక్రియను వేగవంతం చేసినట్లు తెలిసింది. కేసులు ఎక్కడ నమోదైనా లైసెన్సు పొందిన రవాణా శాఖ అధికారులకే సస్పెన్షన్ అధికారం ఉంది. ఈ చిక్కుముడి వీడితేనే సస్పెన్షన్లలో జాప్యం జరుగుతోందని పోలీసు శాఖ అభిప్రాయంగా ఉంది. ఒకే వ్యక్తి మూడుసార్లు మద్యం మత్తులో వాహన నడుపుతూ పట్టుపడితే లైసెన్సును సస్పెండ్ చేసేందుకు పోలీసు అధికారులు రవాణా శాఖకు సిఫార్సు చేస్తారు. **డేటాబేస్‌తో అనుసంధానం** డ్రైవింగ్ లైసెన్స్ విధానాన్ని కట్టుదిట్టం చేసేందుకు డేటా బేస్‌ను మరింత ఆధునికీకరించాలని రవాణా శాఖ యోచిస్తోంది. మద్యం మత్తులో, అధిక వేగంతో, ఓవర్ లోడ్‌తో వాహనం నడుపుతూ పట్టుబడిన వ్యక్తి ఫొటో లేదా ఆధార్ నంబరు డేటాబేస్‌తో అనుసంధానం చేయడం ద్వారా ఆ వాహన చోదకుడి డ్రైవింగ్ లైసెన్సు నంబరు, ఎక్కడి తీసుకున్నది తక్షణం తనిఖీ అధికారులకు తెలిసేలా ఆధునికీకరించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఆయా వివరాలు తనిఖీ అధికారుల నుంచి సంబంధిత రవాణా శాఖ కార్యాలయానికి చేరితే సస్పెన్షన్ ప్రక్రియను వేగంగా నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

# భాగ్యనగరం సురక్షితమే

వరంగల్ : భారీస్థాయిలో భూకంపాలు.. రిక్టర్ స్కేల్‌లో ఏడుకు పైన పాయింట్లు నమోదైనా భాగ్యనగరం సురక్షితమేనని ఉత్తరాఖండ్‌లోని భవన నిర్మాణాల కేంద్రీయ పరిశోధన సంస్థ సంచాలకులు ప్రొఫెసర్ ప్రదీప్ కే.రామన్‌చెర్ల అన్నారు. తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో భూకంపాలు ఏర్పడిన నేపథ్యంలో వాటి తీవ్రతపై ఆయన మాట్లాడారు. భూకంపాలు వచ్చిన ప్రాంతాలన్నీ మూడో జోన్‌లో ఉన్నాయని, రిక్టర్‌స్కేల్‌లో 5.3 పాయింట్లు నమోదైనందున భూ ప్రకంపనలు హైదరాబాద్‌కు సమీపంలో వచ్చుంటాయి తప్ప వాటితో ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోవన్నారు. నేషనల్ బిల్డింగ్ కోడ్ 1893ద్వారా భవనాలు నిర్మించుకుంటే ఎలాంటి ముప్పు ఉండదని వివరించారు.

**నాలుగు.. ఐదు జోన్లలోనే తీవ్రత..**

దేశవ్యాప్తంగా భూకంప ప్రభావ పరిస్థితుల ఆధారంగా 2,3,4,5 జోన్లుగా వర్గీకరించారు. 2, 3 జోన్లలోని రాష్ట్రాలు ప్రమాదానికి కాస్త దూరంగా ఉంటాయి. 4, 5జోన్లలో ప్రమాదకర పరిస్థితులు ఉంటాయి. ఈ రెండు జోన్లలోని ఎనిమిది రాష్ట్రాల్లో పర్వతశ్రేణులు, హిమపాతం ఎక్కువగా ఉంటుంది. దేశ జనాభాలో 82శాతం(సుమారు 116కోట్లు) 56శాతం భూ భాగంలో ఉంది. ఈ భూభాగం 3, 4 జోన్లలో విస్తరించి ఉంది. దశాబ్దాలుగా ఆయా ప్రాంతాల్లో భూకంపాలు రాకపోయినా.. పెరుగుతున్న కాలుష్యం, భవన నిర్మాణాల్లో సమపాళ్లలో



సిమెంట్, కాంక్రీట్‌ను వినియోగించకపోవడం, ఎత్తయిన భవనాలు, టవర్ల కారణంగా భూమి అంతరపొరల్లో మార్పులు జరుగుతున్నాయి. గతంలో ఇలా..: మేడ్చల్‌లో 1983లో 4.8 తీవ్రతతో భూకంపం వచ్చింది. ఇప్పటివరకు ఇదే నగరంలో అత్యధికం. : 2020లో బోరబండ సైట్-3 ప్రాంతంలో రాత్రివేళ కొన్ని సెకన్లు భూమి కంపించడంతో జనం ఇళ్లలోంచి బయటికి పరుగులు తీశారు. రిక్టర్ స్కేల్‌పై 1.5 తీవ్రతతో అప్పుడు భూ ప్రకంపనలు వచ్చాయి. ఆ ఏడాది అక్టోబరు 2 నుంచి 30వ తేదీ వరకు 59సార్లు కంపనాలు వచ్చాయి.

**హైదరాబాద్, వైజాగ్‌లు రెండోజోన్‌లో..**

తెలుగు రాష్ట్రాల్లో 35శాతం భూభాగం మూడోజోన్ పరిధిలో ఉంది. వరంగల్, కరీంనగర్, ప్రకాశం, గుంటూరు జిల్లాలు మూడోజోన్‌లో ఉన్నాయి. తెలంగాణ రాజధాని హైదరాబాద్ రెండోజోన్ పరిధిలో ఉండగా.. విశాఖపట్నం కూడా అదే జోన్‌లో ఉంది. హైదరాబాద్‌లో ఆకాశ హర్మ్యాలు నిర్మిస్తున్నారు. 30 నుంచి యాభై అంతస్తుల భవనాలు, టవర్లు నిర్మాణమవుతున్నాయి. వాటిలో నాణ్యతా ప్రమాణాలను పరిశీలించాలి. ఇక విజయవాడ మూడో జోన్ పరిధిలో ఉంది. మన తెలుగు రాష్ట్రాల్లో ఒక్క ప్రాంతం కూడా నాలుగోజోన్ (ప్రమాదకర పరిస్థితులు)లో లేదు. మెట్రో నగరాల్లో ఢిల్లీ నాలుగోజోన్ పరిధిలో ఉండగా.. ముంబయి, చెన్నైలు మూడోజోన్‌లో ఉన్నాయి.

**హైదరాబాద్, వైజాగ్‌లు రెండోజోన్‌లో..**

తెలుగు రాష్ట్రాల్లో 35శాతం భూభాగం మూడోజోన్ పరిధిలో ఉంది. వరంగల్, కరీంనగర్, ప్రకాశం, గుంటూరు జిల్లాలు మూడోజోన్‌లో ఉన్నాయి. తెలంగాణ రాజధాని హైదరాబాద్ రెండోజోన్ పరిధిలో ఉండగా.. విశాఖపట్నం కూడా అదే జోన్‌లో ఉంది. హైదరాబాద్‌లో ఆకాశ హర్మ్యాలు నిర్మిస్తున్నారు. 30 నుంచి యాభై అంతస్తుల భవనాలు, టవర్లు నిర్మాణమవుతున్నాయి. వాటిలో నాణ్యతా ప్రమాణాలను పరిశీలించాలి. ఇక విజయవాడ మూడో జోన్ పరిధిలో ఉంది. మన తెలుగు రాష్ట్రాల్లో ఒక్క ప్రాంతం కూడా నాలుగోజోన్ (ప్రమాదకర పరిస్థితులు)లో లేదు. మెట్రో నగరాల్లో ఢిల్లీ నాలుగోజోన్ పరిధిలో ఉండగా.. ముంబయి, చెన్నైలు మూడోజోన్‌లో ఉన్నాయి.

**కొత్త ప్రమాణాలు.. భవన నిర్మాణాల్లో సాంకేతిక పరిజ్ఞానం..**

నగరాలు, పట్టణాల్లో భవనాలను కొత్త ప్రమాణాలతో నిర్మించడం, వాటిల్లో అత్యాధునిక సమాచార సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా భూకంపాల పరిధిలోకి వెళ్లకుండా పర్యవేక్షించే అవకాశాలున్నాయి. ఎత్తయిన టవర్లను నిర్మించేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలి. అధికార యంత్రాంగం పర్యవేక్షించాలి. భారీ టవర్ల నిర్మాణాలు తగ్గించాలంటే నగరాలకు దూరంగా శాటిలైట్ టౌన్‌షిప్పులు నిర్మించడం శ్రేయస్కరం.

**షాద్‌నగర్‌లో కంపించిన భూమి** షాద్‌నగర్‌లో 12.55 సమయంలో 3సెకన్ల పాటు స్వల్పంగా భూమి కంపించింది. పట్టణంలోని ప్రధాన రహదారిలో ఉండే స్థానికులు తన ఇంట్లోని వస్తువులు కదిలాయని పేర్కొన్నారు. కాలేజీరోడ్, ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ప్రకంపనలు గుర్తించినట్లు స్థానికులు వివరించారు.

# కంటోన్మెంట్ పరిధిలో యూజర్ ఛార్జీలు

హైదరాబాద్: కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఇకపై ఘన వ్యర్థాల నిర్వహణలో భాగంగా నివాసితులు యూజర్ ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. యూజర్ ఛార్జీలతో పాటు ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలను ఖరారు చేస్తూ రక్షణ శాఖ గెజిట్ విడుదల చేసింది. కంటోన్మెంట్ బోర్డు సీఈఓ డి.మధుకర్ నాయక్ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. నివాసితుల నుంచి ఘన వ్యర్థాలను కంటోన్మెంట్ బోర్డు సేకరించనుంది. గెజిట్ ప్రచురితమైన ఆరు నెలల్లో నివాసితుల డేటా బేస్‌ను రూపొందించుకుని యూజర్ ఛార్జీల వసూలును ప్రారంభించాలని తెలిపారు. ఆరు నెలలకు, ఏడాదికి ముందుగానే యూజర్ ఛార్జీలు చెల్లించే అవకాశం కల్పించడంతో పాటు ఇలా చెల్లించేవారికి రాయితీని ఇవ్వాలని సూచించారు. ఒక వేళ ఏడాది మొత్తానికి యూజర్ ఛార్జీలను ఒకే సారి ముందుగా చెల్లించేవారు 12 నెలలకు కాకుండా 10 నెలలకు అయ్యే మొత్తాన్ని, ఆరునెలలకు చెల్లించేవారు ఐదున్నర నెలల యూజర్ ఛార్జీలను చెల్లిస్తే సరిపోతుందని తెలిపారు. నెలకు యూజర్ ఛార్జీల కనీస మొత్తం రూ.50. గరిష్ఠంగా రూ.5000గా నిర్ణయించారు. 50 చదరపు మీటర్ల ఇంటికి రూ.50, 50 నుంచి 200 చదరపు మీటర్ల ఇంటికి రూ.100, 200 చదరపు మీటర్ల పైన ఉంటే రూ.200 చెల్లించాల్సి ఉంటుందని, వీధి వ్యాపారులు రూ.100 ఇలా వేర్వేరుగా యూజర్ ఛార్జీలు నిర్దేశించారు.




## విద్యార్థులతో ముచ్చటించిన చంద్రబాబు, పవన్..

బాపట్ల: ఏపీ రాష్ట్రవ్యాప్తంగా ఒకే రోజున శనివారం తల్లిదండ్రులు- ఉపాధ్యాయుల మెగా సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. దేశంలో పెద్ద రాష్ట్రాల్లో ఈ స్థాయిలో సమావేశం నిర్వహించడం ఇదే మొదటిసారి. రాష్ట్రవ్యాప్తంగా 45,094 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో ఈ కార్యక్రమం కొనసాగుతోంది. బాపట్ల పురపాలక ఉన్నత పాఠశాలలో కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ హాజరయ్యారు. పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో సీఎం ముచ్చటించడంతో పాటు వారి ప్రగతి నివేదికలు పరిశీలించారు. తర్వాత తల్లిదండ్రులు, పూర్వవిద్యార్థుల సూచనలు, సలహాలు విన్నారు. సమావేశం అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రుల సహపంక్తి భోజనాలకు 23 ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేశారు. సీఎం చంద్రబాబు, లోకేశ్.. పిల్లలతో కలిసి భోజనం చేశారు. **కడప మున్సిపల్ హైస్కూల్‌కు పవన్...** మరోవైపు కడప మున్సిపల్ హైస్కూల్‌కు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వచ్చారు. ఆయనకు అధికారులు ఘనస్వాగతం పలికారు. విద్యార్థులతో పవన్ ముఖాముఖి నిర్వహించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.




అమెరికాలోని ఓర్లాండ్‌లోని ఓ పార్క్‌లో ఫ్రీ పాల్ టవర్ నుంచి పడి ఓ బాలుడు మృతి చెందాడు. ఈ కేసుకు సంబంధించి ఫ్లోరిడాలోని న్యాయస్థానం సంచలనమైన తీర్పునిచ్చింది. మృతుడి కుటుంబానికి రూ.2,624 కోట్లు ఇవ్వాలని ఆదేశించింది. టైర్ సాంప్సన్ (14) అనే బాలుడు 2022లో తన ఫుట్‌బాల్ టీమ్‌తో కలిసి ఐకాన్ పార్క్‌కు వెళ్లాడు. ఆ సమయంలో ఫ్రీ పాల్ టవర్ ఎక్కాడు. ఒక రైడ్‌లో 129 కిలోగ్రాముల బరువు మాత్రమే టవర్ మోయగలదు. అయితే, సాంప్సన్ బరువు 173 కిలో గ్రాములు. బరువు ఎక్కువగా ఉన్నప్పటికీ సిబ్బంది ఆ బాలుడిని రైడ్‌కు వెళ్లేందుకు అనుమతించారు. అయితే రైడ్ సమయంలో సాంప్సన్ పెట్టుకున్న సీటుబెల్టు ఊడిపోవడంతో అతడు 70 అడుగుల దూరంలో ఎగిరిపడి ప్రాణాలు కోల్పోయాడు. ఈక్రమంలోనే బాధితులు ఫ్లోరిడాలోని న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. 'కార్పొరేషన్ల నిర్లక్ష్యం వల్లే సాంప్సన్ మృతి చెందారు. రైడ్‌కు సంబంధించిన తయారీదారులు ప్రయాణికుల భద్రత కంటే లాభాల మీదనే దృష్టిసారించారు. అందువల్లే ఓ బాలుడు మృతి చెందాడు. దీనికి తగిన పరిణామాలు వారు ఎదుర్కోవాలి' అని బాధితుల తరఫు న్యాయవాదులు వాదించారు. విచారణ జరిపిన న్యాయస్థానం తాజాగా తీర్పును వెలువరించింది.

మృతుడి కుటుంబసభ్యులకు 310 మిలియన్ డాలర్లు (2,624 కోట్లు) పరిహారం ఇవ్వాలని ఆదేశించింది. కార్పొరేషన్లు భద్రత విషయంలో జవాబుదారీతనం తీసుకురావాలనే ఈ తీర్పునిస్తున్నట్లు అందులో వెల్లడించింది. దీంతో రైడ్ తయారీ, నిర్వాహక సిబ్బంది మృతుడి తల్లిదండ్రులకు ఒక్కొక్కరికి 155 మిలియన్ డాలర్లు (రూ.1,312 కోట్లు)చొప్పున అందించనున్నారు.




## బెజవాడ ట్రాఫిక్‌కు చెక్.. అమరావతికి బూస్ట్

విజయవాడ వాసుల దశాబ్దాల కల త్వరలోనే సాకారం కాబోతోంది. ట్రాఫిక్ కారణంగా నగరంలో వాహనదారులు ఎన్నో ఏళ్లుగా పడుతోన్న నరకయాతన నుంచి త్వరలోనే విముక్తి లభించనుంది. ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తోన్న విజయవాడ వెస్ట్ బైపాస్ ఎట్టకేలకు పూర్తి కావచ్చింది. మరో మూడు నెలల్లోనే బైపాస్ ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం శరవేగంగా చర్యలు తీసుకుంటోంది. ఇది ప్రారంభమైతే ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర వాసులు విజయవాడ నగరంలోకి అడుగు పెట్టకుండానే హైదరాబాద్ వైపు రాకపోకలు జరపవచ్చు. బైపాస్ మీదుగా విజయవాడ నగరంలోకి చాలా తక్కువ సమయంలో చేరుకోవచ్చు. రాజధాని అమరావతిలోకి అడుగుపెట్టాలంటే గంటల తరబడి ప్రయాణించాల్సిన అవస్థలు ఉండవు. బైపాస్ ప్రారంభమయ్యే ప్రాంతం నుంచి కేవలం అరగంటలోనే అమరావతిలో అడుగు పెట్టొచ్చు. గుంటూరు ఆపై ప్రాంతాలకు వెళ్లేవారూ బెజవాడ ట్రాఫిక్ బారిన పడకుండా వేగంగా వెళ్లవచ్చు.




ముంబయి: మహారాష్ట్రలో ప్రభుత్వ ఏర్పాటుపై గత కొంతకాలంగా నెలకొన్న ప్రతిష్టంభన అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రిగా భాజపా సీనియర్ నేత దేవేంద్ర ఫడణవీస్ ప్రమాణస్వీకారం చేసిన విషయం తెలిసిందే. డిప్యూటీ సీఎంలుగా ఏక్‌నాథ్ శిందే, అజిత్ పవార్‌లకు హోదా కల్పించారు. కాగా మహాయుతిలో మంత్రిత్వశాఖల కేటాయింపులపై ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. ఈనేపథ్యంలో శిందేకు సన్నిహితుడిగా పేరున్న ఎన్సీపీ ఎమ్మెల్యే భరత్ కీలక వ్యాఖ్యలు చేశారు. మహారాష్ట్రలో కొత్తగా ఏర్పాటైన మహాయుతి ప్రభుత్వంలో తనకు హోంశాఖను అప్పగించాలని మాజీ సీఎం ఏక్‌నాథ్ శిందే డిమాండ్ చేశారని శివసేన ఎమ్మెల్యే భరత్ గోగవాలే పేర్కొన్నారు. ఏక్‌నాథ్ శిందే సీఎంగా ఉన్న సమయంలో ప్రస్తుత సీఎం దేవేంద్ర ఫడణవీస్‌కు హోంశాఖ అప్పగించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అసెంబ్లీ శీతాకాల సమావేశాలకు ముందే డిసెంబరు 11-16 మధ్య కేబినెట్ విస్తరణ ఉంటుందని వెల్లడించారు. నాగ్‌పూర్‌లో డిసెంబర్ 16న శాసనసభ శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. గత మహాయుతి ప్రభుత్వంలో శివసేనకు ఉన్న శాఖలను మార్చేందుకు కూటమిలో ప్రయత్నాలు జరుగుతున్నాయని మరో శివసేన ఎమ్మెల్యే ఆరోపించారు. కాగా శిందే నేతృత్వంలోని మునుపటి ప్రభుత్వంలో మాదిరిగానే ఎన్సీపీ తమ దగ్గరున్న ఆర్థికశాఖను, భాజపా హోంశాఖను నిలబెట్టుకునే అవకాశాలు ఉన్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. శివసేనకు పట్టణాభివృద్ధి, రెవెన్యూ శాఖలు దక్కే అవకాశం ఉన్నట్లు సమాచారం. 288 శాసనసభ స్థానాలు ఉన్న మహారాష్ట్రలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమి ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఏకంగా 230 స్థానాలతో భారీ మెజార్టీ దక్కించుకుంది. అయితే, ఆ తర్వాత ప్రభుత్వం ఏర్పాటుపై కూటమిలో ప్రతిష్టంభన నెలకొంది. సీఎం ఎంపిక, శాఖల కేటాయింపులపై భాజపా, శివసేన, ఎన్సీపీల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. డిప్యూటీ సీఎం పదవికి అంగీకరించని ఏక్‌నాథ్ శిందే, హోంశాఖ కేటాయించాలని పట్టుబట్టినట్లు వార్తలు వచ్చాయి. మరోవైపు, సీఎంగా భాజపా నేతే ఉంటారని ముందునుంచీ ప్రచారం జరిగినా ఫడణవీస్ స్థానంలో ఇంకెవరినైనా తీసుకుంటారా? అనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. కానీ, పార్టీ అధిష్ఠానం మాత్రం ఆయన వైపే మొగ్గు చూపింది. దీంతో ముఖ్యమంత్రిగా మూడోసారి ఆయన ప్రమాణస్వీకారం చేశారు.

## ఏపీ రాష్ట్రవ్యాప్తంగా తల్లిదండ్రులు - ఉపాధ్యాయుల మెగా సమావేశాలు



అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా శనివారం తల్లిదండ్రులు- ఉపాధ్యాయుల మెగా సమావేశాలు ప్రారంభమయ్యాయి. 45,094 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో ఈ కార్యక్రమం కొనసాగుతోంది. ఎలాంటి రాజకీయ ప్రమేయం లేకుండా విద్యాశాఖ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. బాపట్ల పురపాలక ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ హాజరయ్యారు. కడప మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ విద్యార్హతలు గల ఉపాధ్యాయులు ఉన్నారని మంత్రి నారాయణ అన్నారు. నెల్లూరు జిల్లా నవాబుపేటలోని బీవీఎస్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్ర చరిత్రలో ఒకే రోజున, ఒకే సమయంలో 45 వేల పాఠశాలల్లో ఈ సమావేశాలు నిర్వహించడం గర్వించదగ్గ విషయమన్నారు. పదో తరగతిలో గ్రేస్ మార్కులతో పాసైన తాను.. డిగ్రీ పీజీలో గోల్డ్ మెడల్ సాధించడానికి గురువులే కారణమని చెప్పారు. తరచుగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో గొప్ప మార్పు వస్తుందని నారాయణ పేర్కొన్నారు. తిరుపతిలో మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ ఘనంగా జరిగింది. సత్యనారాయణపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో శాప్ ఛైర్మన్ రవినాయుడు పాల్గొన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం విద్యావ్యవస్థలో మార్పు తీసుకువస్తోందని తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను మార్చే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు.

## అదానీ స్కాంలో జగన్‌పై విచారణ చేయించండి..



విజయవాడ: రేషన్ బియ్యం అక్రమాలపై విచారణకు ఏపీ ప్రభుత్వం స్పెషల్ సిట్ వేయడం సంతోషకరమని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. మరి సోలార్ విద్యుత్ ఒప్పందాల్లో జరిగిన రూ.1750 కోట్ల ముడుపులపై విచారణ ఎక్కడ అని ప్రశ్నించారు. బియ్యం మాఫియాపై పెట్టిన శ్రద్ధ.. అదానీ అక్రమ డీల్‌పై ఎందుకు పెట్టలేక పోతున్నారని నిలదీశారు. అమెరికా దర్యాప్తు సంస్థలు ఇచ్చిన నివేదికలకు విలువ లేదా అని వైఎస్ షర్మిల అడిగారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి స్వయంగా లంచాలు తీసుకున్నారని నివేదిక ఇస్తే , నిజాలు నిగ్గు తేల్చే బాధ్యత కూటమి ప్రభుత్వానిది కాదా అని ప్రశ్నించారు. తీగ లాగితే మాజీ ముఖ్యమంత్రితో పాటు, అదానీని సైతం అరెస్టు చేయాల్సి వస్తోంది కదా అని అన్నారు. నోరు విప్పకుండా, విచారణ చేయకుండా మౌనంగా ఎందుకు ఉంటున్నారని ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీ ప్రతిపక్షంలో ఉండగా.. %ాజుజ×%తో చేసుకున్న ఒప్పందంలో భారీ అవినీతి ఉందని అనలేదా అని నిలదీశారు. టెండర్లు లేకుండా అదానీకి కట్టబెట్టడం అంటే పెద్ద ఎత్తున లంచాలు తీసుకున్నారని గతంలో ఆరోపణలు చేయలేదా అని వైఎస్ షర్మిల ప్రశ్నించారు. **ఏసీబీతో విచారణ చేయించాలి..** "గుజరాత్‌లో రూ 1.99 పైసలు దొరికే సోలార్ విద్యుత్‌ను రాష్ట్ర ప్రభుత్వం రూ.2.49 పైసలకు ఎలా కొన్నారని ఉద్యమాలు చేశారు. 25 ఏళ్ల పాటు డీల్ అంటే రాష్ట్ర ప్రజల నెత్తిన లక్ష కోట్ల అదనపు భారం పడిందని చెప్పారు. ఇది ప్రజలను అదానీ కోసం నిలువునా దోచి పెట్టడం అని చెప్పారు. ఈ డీల్ రద్దు చేయాలని ఇప్పటి ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ద్వారా హైకోర్టులో కేసు కూడా వేయించారు. జగన్ అదానీకి అమ్ముడు పోయారని.. దీనిపై విచారణ చేయించాలని చంద్రబాబుని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది. వెంటనే ఏసీబీతో విచారణ చేయించాలని కోరారు. రూ.1750 కోట్ల ముడుపుల వ్యవహారంపై ఫాస్ట్రాక్ విచారణ జరిపించండి. తక్షణం అదానీతో చేసుకున్న సోలార్ పవర్ డీల్‌ను రద్దు చేయండి" అని షర్మిల డిమాండ్ చేశారు.


## దర్పం లేని లోకేష్ దర్బార్!




టీడీపీ యువ నాయకుడు, మంత్రి అయిన నారా లోకేష్‌కి తట్టిన వినూత్న ఆలోచన ప్రజా దర్బార్. గతంలో ఎందరో మంత్రులుగా పనిచేశారు కానీ వారు ప్రజా దర్బార్ లని నిర్వహించిన దాఖలాలు అయితే పెద్దగా లేవు అని అంటున్నారు. ముఖ్యమంత్రులు అయితే ఆ విధంగా కొన్ని సందర్భాల్లో చేసి ఉన్నారు. లోకేష్ మాత్రం తనదైన పాలనా వైఖరిని ప్రస్ఫుటించే విధంగా ప్రజా దర్బార్ ని నిర్వహిస్తున్నారు. ఈ విషయంలో ఆయన ఎక్కడా తగ్గడం లేదు. ఆయన వివిధ జిల్లాలకు పర్యటనకు వచ్చినా కూడా అక్కడ కూడా ప్రజా దర్బార్ ని నిర్వహించడం ద్వారా అది నిరంతరాయంగా సాగేలా చూసుకుంటున్నారు. ఆ విధంగా లోకేష్ ప్రజా దర్బార్ ఏపీలో హాట్ టాపిక్ గా మారింది. ప్రజా దర్బార్ నిర్వహించడం సమస్యలను, ఫిర్యాదులను స్వీకరించడం మాత్రమే కాదు వాటికి తగిన పరిష్కారాన్ని కూడా చూపించడంలో లోకేష్ ప్రజా దర్బార్ మంచి మార్కులు సాధించింది అని అంటున్నారు. ఏకంగా ఇప్పటి వరకూ యాభై రోజుల పాటు లోకేష్ ప్రజా దర్బార్ సాగింది అంటే గ్రేట్ అనాల్సిందే అంటున్నారు. అంతే కాదు లోకేష్ ప్రజా దర్బార్ కు ఈ యాభై రోజుల వ్యవధిలో 5 వేల 810 వినతులు వచాయి. అయితే ఇందులో 4 వేల 410 సమస్యలకు పరిష్కారం లభించడం అంటే లోకేష్ ప్రజా దర్బార్ సక్సెస్ రేటు ఏమిటి అన్నది చాటి చెబుతోంది అని అంటున్నారు. ప్రజా దర్బార్ కి వచ్చిన సమస్యలకు 75 శాతం పైగా పరిష్కారాలు లోకేష్ నుంచి దక్కుతున్నాయని అంటున్నారు. దీంతో ఏపీ నలుమూలల నుంచి మంగళగిరిలోని లోకేష్ ప్రజా దర్బార్ కి జనాలు వెల్లువలా క్యూ కడుతున్నారు. లోకేష్ కూడా క్రమం తప్పకుండా ఠంచనుగా ఉదయం గంట పాటు ప్రజా దర్బార్ ని నిర్వహిస్తున్నారు. వచ్చిన ప్రతీ వారి సమస్యను ఓపికగా విని సంబంధిత అధికారులకు వాటి పరిష్కారం మీద ఆదేశాలు అక్కడికక్కడే ఇస్తున్నారు. దాంతో ప్రజా దర్బార్ కి వెళ్ళిన వారు అంతా ఫుల్ హ్యాపీ మూడ్ తో వెనక్కి తిరిగి వస్తున్నారు. ఇది నిజంగా లోకేష్ సాధించిన బిగ్ అచీవ్ మెంట్ గానే అంతా చూస్తున్నారు. ఇక ప్రజా దర్బార్ లో లోకేష్ నుంచి ఆదేశాలు అంటే అధికారులు సైతం అలెర్ట్ గా ఉంటున్నారు. వాటి పరిష్కారంలో కూడా వేగం చూపిస్తున్నారు. దాంతో ప్రజా దర్బార్ కి మంచి పేరు వస్తోంది. మరో వైపు చూస్తే లోకేష్ ప్రజా దర్బార్ లో సగానికి సగం సమస్యలు రెవిన్యూ హెూం శాఖకు సంబంధించినవి వస్తున్నాయని అంటున్నారు. అలాగే ఆరోగ్యం, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలు, విద్యా రంగం విషయంలోనూ మిగిలిన యాభై శాతం సమస్యలు ఉంటున్నాయి అని అధికారులు వెల్లడిస్తున్నారు ఇక తమకు ఉపాధి కావాలని కూడా లోకేష్ ప్రజా దర్బార్ కి యువత వస్తున్నారు. అలా వచ్చిన దాదాపుగా 800 వినతుల మీద లోకేష్ సీరియస్ గానే దృష్టి పెట్టారని అంటున్నారు. వారి అర్హత్లనౌ బట్టి అవసరమైన చోట జాబ్స్ ఇప్పించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ విధంగా మూడు వందల మంది దా ఉపాధిని పొందేందుకు వీలుగా ప్రజా దర్బార్ లో చర్యలు తీసుకుంటున్నారు.

అదే విధంగా పెన్షన్ల కోసం కూడా నాలుగు వందల మంది దాకా దరకాస్తు చేసుకుని వినతులు సమర్పించారు. వారి విషయంలోనూ సానుకూలంగా ప్రజా దర్బార్ లో నిర్ణయాలు తీసుకుంటున్నారు. మొత్తానికి దర్జాకు దర్పానికి దూరంగా సామాన్యులకు చేరువగా లోకేష్ చేపట్టిన ప్రజా దర్బార్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకుని సక్సెస్ ఫుల్ గా ముందుకు సాగుతోంది అని అంటున్నారు.

## వివేకా పీఏ కృష్ణారెడ్డి ఫిర్యాదు.. మరోసారి ప్రారంభమైన విచారణ




పులివెందుల: మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో ఆయన పీఏ కృష్ణారెడ్డి ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసుల దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. కృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు గత ఏడాది డిసెంబర్ 15న వివేకా కుమార్తె సునీత, రాజశేఖర్ రెడ్డి, సీబీఐ ఎస్పీ రాంసింగ్‌పై పులివెందుల పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును తిరిగి విచారణ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించడంతో.. పులివెందుల పోలీసులు మరోసారి విచారణ చేపట్టారు.

విచారణకు రావాలని డీఎస్పీ మురళీ నాయక్ పలువురికి ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. ఈ క్రమంలో శనివారం ఆరుగురు సాక్షులు విచారణకు వచ్చారు. సురేంద్రనాథ్ రెడ్డి, న్యాయవాది ఓబుల్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, రాజేశ్‌కుమార్ రెడ్డి, భరత్ యాదవ్, వీఆర్వో మహేశ్వరరెడ్డి డీఎస్పీ ముందు హాజరయ్యారు. మరోవైపు వివేకా పీఏ కృష్ణారెడ్డి పులివెందుల డీఎస్పీ కార్యాలయానికి వెళ్లారు.

## దేశంలోనే ఇటువంటి మోసం ఎక్కడా జరిగి ఉండదు: ఆదిరెడ్డి వాసు



రాజమహేంద్రవరం: గత ఐదు సంవత్సరాలుగా అధికారాన్ని అడ్డుపెట్టుకొని వైకాపా నేతలు ఎన్నో అక్రమాలు చేశారని తెదేపా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఆరోపించారు. రాజమహేంద్రవరం మాజీ ఎంపీ మార్గాని భరత్ చేసిన అక్రమాలు బయటికి వస్తున్నాయని చెప్పారు. గౌతమి కోఆపరేటివ్ సూపర్ బజార్‌కు చెందిన భూమిని అన్యాక్రాంతం చేశారని ఆరోపించారు. 11 సంవత్సరాల లీజు అగ్రిమెంట్‌ను 33 సంవత్సరాల సబ్ లీజుకు మార్చారన్నారు. దేశంలోనే ఇటువంటి మోసం ఎక్కడా జరిగి ఉండదని మండిపడ్డారు. కార్యవర్గాన్ని సైతం రద్దుచేసి అక్రమాలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. సంబంధిత అధికారులపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తమ నాయకులను కూడా ప్రలోభాలకు గురిచేయాలని చూస్తున్నారన్నారు. నగరం నడిబొడ్డున రూ.5 కోట్ల విలువైన ఆస్తిని కొట్టేయాలని చూశారని చెప్పారు. కూటమిలోని నాయకులు ప్రజలతో మమేకం అవుతున్నారని వివరించారు. జగన్ అసెంబ్లీకి వస్తే బాగుంటుందని ఆదిరెడ్డి వాసు హితవు పలికారు.

# ఉమ్మడి నంబరు.. రైతుకు ఉరి

కర్నూలు : గత ప్రభుత్వం చేపట్టిన భూముల రీ సర్వే అన్నదాతలకు అవస్థలు మిగిల్చింది. అధికారులు ఇష్టానుసారంగా కొలతలు వేశారు. రైతుల సమక్షంలో వేయాల్సి ఉండగా.. కనీసం వారికి సమాచారం ఇవ్వలేదు. ఫలితంగా పెద్దఎత్తున తప్పులు దొర్లాయి. భూ విస్తీర్ణంలో తేడాలు ఒక ఎత్తయితే.. జాయింట్ ఎల్పీఎంలు మరో సమస్యగా మారింది. సబ్ డివిజన్ చేసుకోవడానికి ఒక జాయింట్ ఎల్పీఎంకు రూ.550 చెల్లించాల్సి వస్తోంది. ఇది రైతులకు ఇబ్బందికరంగా మారింది.. రీసర్వేలో జరిగిన తప్పిదాలకు దిద్దుబాటు చర్యలు చేపడుతున్న 'కూటమి' ప్రభుత్వం జాయింట్ ఎల్పీఎంల సమస్య సరిదిద్దే ప్రక్రియను 'ఉచితం' చేయాలని అన్నదాతలు విన్నవిస్తున్నారు.

**1.20 లక్షల మంది రైతుల అవస్థ**

దశాబ్దాలకాలంగా ఉన్న సర్వే నంబర్ల స్థానంలో ల్యాండ్ పార్సిల్ మ్యాప్ (ఎల్పీఎం)లను తీసుకొచ్చారు. సర్వే నంబర్లు ఒక వ్యక్తికి ఒక్కటే.. ఆయన వారసులకు అదే సర్వే నంబరు ఉండేది. రీ సర్వే తర్వాత ఐదారుగురికి కలిపి ఒక ఎల్పీఎం నంబరు కేటాయించి భూ హక్కు పత్రాలు అందజేశారు. వీరు ఇతరులకు భూములు అమ్మాలన్నా.. కొనుగోలు చేయాలన్నా వీలులేకుండా పోతోంది. రిజిస్ట్రేషన్లు జరగడం లేదు. 1బీలు రావడం లేదు. ఎల్పీఎంలతో ఉమ్మడి జిల్లాలో ఉమ్మడి లక్షలాది మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కర్నూలు జిల్లాలో ఎల్పీఎంల ఖాతాలు 65,028, నంద్యాల జిల్లాలో 76,162 ఖాతాలున్నాయి. దాదాపు 1.20 లక్షల మందికిపైగా రైతులు జాయింట్ ఎల్పీఎం కేటాయింపుతో ఇబ్బందులు పడుతున్నారు.

చలానా చెల్లిస్తేనే సబ్ డివిజన్

జాయింట్ ఎల్పీఎంల సమస్యను పరిష్కరించుకోవాలంటే నలుగురైదుగురిలో ఏ రైతు సర్వే సబ్ డివిజన్‌కు చలానా కట్టాలి అన్నది పెద్ద సమస్యగా మారింది. ఒక జాయింట్ ఎల్పీఎంకు రూ.550 చెల్లించాల్సి ఉంది. నగదు చెల్లించే విషయంలో సమస్యలు ఎదురవుతున్నాయి. చలానా కట్టిన తర్వాత సర్వే చేసిన అనంతరం సబ్ డివిజన్లుగా మారుస్తారు. ఆ తర్వాతే జాయింట్ ఎల్పీఎంలు కాస్త విడివిడిగా రైతులకు ప్రత్యేక ఎల్పీఎం నంబర్లు కేటాయిస్తారు. కొందరు రైతులకు నాలుగు నుంచి ఐదు జాయింట్ ఎల్పీఎంలు వచ్చాయి. వీరు రూ.2,200 నుంచి రూ.2,750 వరకు రుసుము చెల్లించాల్సి ఉంది.

**దండిగా దరఖాస్తులు**

రీసర్వేలో లోపాలు సరిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహించింది. రాష్ట్రంలోనే అత్యధికంగా అర్జీలు అందిన జిల్లాల్లో ఉమ్మడి కర్నూలు జిల్లా ఒకటి. రీసర్వే పూర్తయిన 464 గ్రామాల్లో గత అక్టోబరు నుంచి నవంబరు వరకు గ్రామసభలు నిర్వహించారు. ఈ సభల ద్వారా 32,659 ఫిర్యాదులొచ్చాయి. రెవెన్యూ శాఖకు సంబంధించినవి 8,227, సర్వే శాఖకు చెందినవి 24,432 ఉన్నాయి.

**ప్రభుత్వానికి నివేదించాం**

మునికన్నన్, జిల్లా సర్వే అధికారి,

జాయింట్ ఎల్పీఎంలను విడివిడిగా ఒక్కో రైతు పేరున మార్చుకోవాలంటే ప్రస్తుతం ఒక ఎల్పీఎం నంబరుకు రూ.550 చొప్పున ప్రభుత్వానికి చలానా చెల్లించాల్సి ఉంది. రైతులపై భారం పడకుండా ఉండేందుకు ఉచితంగా సేవలందించేలా ప్రభుత్వం త్వరలో చర్యలు చేపట్టనుంది.

**ఏడాదిగా అధికారుల చుట్టూ..**

లక్ష్మీదేవమ్మ, బలపనూరు

బలపనూరులో సర్వే నంబరు 63లో 2.50 ఎకరాలు ఉంది.. భూ సర్వే అనంతరం ఇదే సర్వే నంబరులో నాతోపాటు నలుగురు రైతులకు కలిసి జాయింట్ ఎల్పీ నంబరు కేటాయించారు. నా పొలం.. నా పేరుపై నమోదు చేయమని ఏడాది కాలంగా అధికారుల చుట్టూ తిరుగుతున్నాం.. ఎవరూ పట్టించుకోవడం లేదు.. బ్యాంకులో పంట రుణం ఇవ్వడం లేదు.. నాకు 2.50 ఎకరాలు ఉంటే 1బీలో కేవలం 1.30 ఎకరాలు నమోదైంది.. సర్వే నంబరు 56లో నాకు 2 ఎకరాలు ఉండగా ఎల్పీ నంబర్లలో ఆరుగురు రైతులు ఉన్నట్లు చూపుతున్నారు.

**సర్వేతో తీవ్ర నష్టం** సంగటి శివలింగ, నాగలాపురం, ఆదోని మండలం

రీ సర్వేతో తీరని నష్టం జరిగింది. సర్వే నంబరు 126లో 1.35 ఎకరాలు ఉంది.. రీ సర్వే తర్వాత 52 సెంట్లు తగ్గించారు.. జాయింట్ ఎల్పీఎం నంబర్లుగా నమోదు చేశారు. బ్యాంకులో రుణం ఇవ్వడం లేదు. అమ్ముకుందామంటే అవకాశం లేకుండా పోయింది. పలుమార్లు అధికారులను కలిసి సమస్యను విన్నవించాం. రీ సర్వే సమస్యలపై గ్రామసభలు పెట్టినప్పుడు అర్జీలు ఇచ్చాం. ఇంతవరకు సమస్య పరిష్కారం కాలేదు.

# క్యాన్సర్ ఆసుపత్రిలో అవినీతి కణాలు

కర్నూలు : రూ.120 కోట్లతో నిర్మించిన క్యాన్సర్ ఆసుపత్రిలో అడుగడుగునా లోపాలే దర్శనమిస్తున్నాయి. ఎన్నికల సమయంలో ఏడాది కిందట అప్పటి ఆర్థిక మంత్రి హడావుడిగా ప్రారంభించారు. తొమ్మిది నెలలు గడిచినా నేటికీ పనులు పూర్తి చేయలేదు.. భవనాన్ని అధికారికంగా ఆసుపత్రి అధికారులకు అప్పగించలేదు. చేసిన పనుల్లో నాణ్యత తేలిపోయింది.. భవనం పైఅంతస్తులో సేవలు ప్రారంభం కాకుండానే కొన్నిచోట్ల టైల్స్ పగిలిపోయాయి.. గోడలకు పగుళ్లు వచ్చాయి.. రంగులు తేలిపోయాయి. కింది అంతస్తు ప్రధాన ద్వారం దగ్గరున్న కింది మెట్టు గ్రానైట్ పలక ధ్వంసమైంది. సెమినార్ హాల్లో ట్యూబ్‌లైట్ నట్లు ఊడిపోయి సీలింగ్‌కు వేలాడుతోంది.




ఎండోస్కోపీ గదిని నిర్మించామని చెబుతున్నారు కానీ పనులు పూర్తి కాలేదు.

**కొన్నారు.. పక్కన పెట్టారు**

విద్యుత్తు విభాగానికి రూ.36 కోట్లు వెచ్చించారు.. బిల్లులు పూర్తిగా చెల్లించకపోవడంతో గుత్తేదారుడు మధ్యలోనే పనులు ఆపేశారు.

క్యాన్సర్ వైద్యంలో కీలకమైన రేడియేషన్ ప్రక్రియ కోసం లీనియర్ యాక్సిలరేటర్ ఉపకరణాన్ని రూ.36 కోట్లు వెచ్చించి కొనుగోలు చేశారు. రోగులకు సేవలందించే ప్రక్రియ ప్రారంభం కాలేదు. హెచ్.డి.ఆర్. బ్రాకీథెరపీ యూనిట్‌ను రూ.6 కోట్లతో కొనుగోలు చేశారు. ఇంకా ఆసుపత్రికే చేరలేదు.

రూ.9.88 కోట్లు వెచ్చించి సి.టి.సిమ్యులేటర్ ఉపకరణాన్ని కొనుగోలు చేశారు. దీనికి అన్ని రకాల పరీక్షలు పూర్తయ్యాయి. ఇతర విభాగాలు ప్రారంభం కాకపోవడంతో దీన్ని పక్కన పెట్టారు.

# చలికి గజగజ



చిత్తూరు : చిత్తూరు ప్రభుత్వాసుపత్రిలో వైద్యాధికారుల నిర్లక్ష్యానికి రోగులు అవస్థలు పడుతున్నారు. అరకొర వసతులతో నిత్యం ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అధికారుల నిర్లక్ష్యం, అలసత్వం కారణంగా రోగులు, వారి సహాయకులకు తిప్పలు తప్పలేకపోతున్నాయి. చలి మొదలైనా ఆస్పత్రిలో వాటికి తగ్గ ఏర్పాట్లు లేకపోవడంతో అక్కడి రోగుల అవస్థలు వర్ణణాతీతంగా మారాయి. చిత్తూరు ప్రభుత్వ–అపోలో ఆస్పత్రిలో 600 పడకలు ఉన్నా.. ఇద్దరి పెత్తనం కారణంగా వాటికి తగ్గ వసతులు, సౌకర్యాలు లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇన్–పేషెంట్ వార్డుల్లో నేటికీ సమస్యలు కొకొల్లలు. స్థానికంగా చికిత్స పొందుతున్న ఏ ఒక్కరిని పలకరించినా ఇదే సమాధానం. అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. రోగాలతో ఆస్పత్రిలో చేరే వారిలో చాలామంది బలహీనంగా ఉంటూ నీరసించి పడకపై ఉంటుంటారు. వారు చలికి తట్టుకోలేకున్నారు. ఆస్పత్రిలోని వార్డుల్లో కిటికీలకు తలుపులు లేక రోగులు చలికి వణికిపోతున్నారు. చాలా కిటికీలకు ఆస్పత్రిలో వినియోగించే వస్త్రాన్ని అడ్డం పెట్టడం గమనార్హం. వాటి కారణంగా పెద్దలు, వృద్ధులే కాక అప్పుడే పుట్టిన శిశువులు కూడా తిప్పలు పడుతున్నారు.

**కొత్త రోగాలు తెచ్చుకోవాల్సిందే..**

రోగాన్ని నయం చేసుకోవాలని ఆస్పత్రిలో చేరితే కొత్త రోగంతో బయటకు వెళ్లే పరిస్థితి. రోజూ వార్డులను శుభ్రం చేస్తున్నా.. దుర్వాసనతో ముక్కుపుటలు అదురుతున్నాయి. కిటికీలు, మరుగుదొడ్లకు తలుపులు లేకపోవడంతో పగలు, రాత్రి దోమల బెడదతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుప్పటి కప్పుకొంటే పంకాలు పనిచేయక ఇక్కట్లు పడుతున్నారు. ప్రతి పడక వద్ద మస్కిటో కాయిల్స్ వినియోగిస్తున్నా దోమల బెడద తగ్గలేదు.

**దుప్పట్లూ మార్చరు..** ప్రభుత్వాసుపత్రిలోని పడకలకు ఉన్న దుప్పట్లు రోజూ మార్చాల్సి ఉన్నా చిత్తూరులో ఆ పరిస్థితి లేదు. ప్రతి వార్డుల్లో రోగులు మారుతున్నా పడకపై ఉన్న దుప్పట్లు మారడం లేదు. కొన్ని పడకలపై దుప్పట్లు లేక రోగులే ఇళ్ల నుంచి తెచ్చుకుని వినియోగిస్తున్నారు. మరికొందరు చల్లటి మెత్తపైనే పడుకుని చలికి వణికిపోతున్నారు. రోజూ రౌండ్స్‌కు వచ్చే వైద్యులు, సిబ్బంది పరిస్థితిని చూస్తున్నా పట్టించుకోవడం లేదు. సంబంధిత అధికారులు దృష్టిపెట్టి రాత్రివేళ రోగులు ఎదుర్కొనే సమస్యలు పరిష్కరించాల్సిన అవసరం ఉంది.

# కీలక స్థానాలన్నీ ఖాళీ




కర్నూలు : ఉమ్మడి జిల్లా పోలీసు శాఖ, అనుబంధ విభాగాల్లో కీలక స్థానాలు ఖాళీగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలవుతున్నా ఇప్పటికీ భర్తీ చేయలేదు. ముఖ్యమైన స్థానాలు సైతం ఖాళీగా ఉండటంతో సమస్యలు ఎదురవుతున్నాయి. అధికారులు, సిబ్బంది కొరత నేపథ్యంలో క్షేత్రస్థాయిలో దాడులు చేయలేకున్నారు. ఈ నేపథ్యంలో అక్రమాలను నిరోధించలేని పరిస్థితి ఏర్పడింది.

**అనిశా.. దాడులే లేక**

కర్నూలు రేంజి పరిధిలోని అవినీతి నిరోధక శాఖ కార్యాలయంలో డీఎస్పీ స్థానం దాదాపు ఏడు నెలలుగా ఖాళీగా ఉంది. కర్నూలు, నంద్యాల జిల్లాలకు సంబంధించి అనిశా కార్యాలయం కర్నూలులో ఉంది. ఒక డీఎస్పీ, ఆరుగురు సీఐలు, సిబ్బంది ఉంటారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులపై వచ్చే ఫిర్యాదులను స్వీకరించి పకడ్బందీ వ్యూహం రచించడం.. లంచం తీసుకునే సమయంలో దాడి చేసి పట్టుకోవటం.. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉండే అధికారుల వివరాలు ఆరా తీసి దాడులు చేసి జప్తు చేయటం.. ప్రభుత్వ కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలు చేయటం వంటివి అనిశా డీఎస్పీ ఆధ్వర్యంలో జరుగుతాయి.

**మూడంటే.. మూడే**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2021లో 12, 2022లో 6, 2023లో 12 అనిశా కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది ఇప్పటివరకు పరిశీలిస్తే కేవలం మూడు కేసులు మాత్రమే నమోదవడం గమనార్హం. అసలు అనిశా పనిచేస్తోందా? లేదా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సిబ్బంది కొరత నేపథ్యంలో క్షేత్రస్థాయిలో దాడులు కానరావడం లేదు.

**నిఘా.. నిర్వీర్యం**

పోలీసు శాఖలో నిఘా విభాగమైన ఇంటెలిజెన్స్‌కు సంబంధించిన ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాల ప్రాంతీయ కార్యాలయం కర్నూలులోనే ఉంది. రెండేళ్ల కిందట డీఎస్పీగా ఉన్న వెంకటరాముడు అదనపు ఎస్పీగా పదోన్నతిపై బదిలీ అయిన తర్వాత ఆ స్థానం భర్తీ కాలేదు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి బదిలీ అయిన తర్వాత ఆ స్థానాన్నీ భర్తీ చేయలేదు. ప్రస్తుతం ఈ శాఖ కార్యాలయంలో డీఎస్పీతోపాటు మరో రెండు సీఐ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు ఆకస్మిక దాడులు చేయలేని పరిస్థితి ఏర్పడింది.

ఏపీఎస్పీ రెండో పటాలం దళాధిపతిగా ఉన్న రవిశంకర్ ఈ ఏడాది సెప్టెంబరులో ఉద్యోగ విరమణ చేశారు. రెండు నెలల నుంచి ఈ స్థానం ఖాళీగా ఉంది. అనంతపురం జిల్లాకు చెందిన ఏపీఎస్పీ 14వ బెటాలియన్ దళాధిపతి ప్రభుకుమార్ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు.

**సీఐడీ విభాగంలోనూ..**

ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాల్లో కీలక కేసులు దర్యాప్తు చేసే సీఐడీ ప్రాంతీయ (రీజినల్) కార్యాలయం కర్నూలులో ఉంది. అదనపు ఎస్పీ స్థాయి అధికారి సీఐడీ రీజినల్ అధికారిగా ఉంటారు. సీఐడీ రీజినల్ అధికారిగా ఉన్న పి.ఎన్.బాబు రెండేళ్ల కిందట ఉద్యోగ విరమణ చేశారు. అనంతరం అప్పటి వైకాపా ప్రభుత్వం ఎవరినీ నియమించలేదు. అప్పటినుంచి నేటి వరకు డీఎస్పీ స్థాయి అధికారులే ఇన్‌ఛార్జి ప్రాంతీయ అధికారులుగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం డీఎస్పీ దైవప్రసాద్ ఇన్‌ఛార్జి ప్రాంతీయ అధికారిగా ఉన్నారు.

**సీఐకే బాధ్యతలు**

సార్వత్రిక ఎన్నికలకు ముందు మే నెలలో కర్నూలు అనిశా డీఎస్పీ వెంకటాద్రి చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఆ తర్వాత ఇప్పటివరకు ఆ పోస్టు భర్తీకి నోచుకోలేదు. కడప డీఎస్పీ గిరిధర్ అనిశా ఇన్‌ఛార్జి డీఎస్పీగా వ్యవహరించేవారు. ఎన్నికలు ముగిసిన తర్వాత ఆయన సైతం మరో విభాగానికి బదిలీ కావటంతో ప్రస్తుతం సీఐ వెంకటకృష్ణారెడ్డి ఇన్‌ఛార్జి డీఎస్పీగా వ్యవహరిస్తున్నారు. దీనికితోడు కొంతకాలం కిందట సీఐలు సైతం మాతృ శాఖకు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో మరో రెండు సీఐ స్థానాలు ఖాళీగా ఉన్నాయి.

# సంతానోత్పత్తికి మేలుజాతి మేకలు




ఎమ్మిగనూరు : జిల్లాలో సేద్యం కలిసిరాని చాలా మంది చిన్న, సన్నకారు రైతులకు మేకల పెంపకమే జీవనాధారం. ముఖ్యంగా జిల్లా పశ్చిమ ప్రాంతంలో కొండలు, గుట్టలు ఉండటంతో మేకల మందలను మేపేందుకు అనువుగా ఉంటుంది. మేకల పోషకులకు ఆదాయాన్ని పెంచేందుకు మేలు జాతి సంతానోత్పత్తికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నడుం బిగించాయి. రూ.కోట్లతో అత్యాధునిక వసతులతో ల్యాబ్, వీర్య ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయనుంది. ఇప్పటికే పలు నిర్మాణాలు పూర్తయ్యాయి. వచ్చే ఏడాది జనవరిలో ప్రాజెక్టును అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

ఎమ్మిగనూరు మండలం బనవాసి వద్ద రూ.6.74 కోట్లతో రీజనల్ గోట్ సెమెన్ ప్రాసెసింగ్ ల్యాబొరేటరీ, సెమెన్ బ్యాంకు నిర్మాణం చేపట్టారు. ఎన్ఎల్ఎం ప్రాజెక్టు కింద కేంద్ర ప్రభుత్వం రూ.4.05 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.2.69 కోట్లతో సంయుక్తంగా మేకపోతుల వీర్య కేంద్రం నిర్మాణం చేపట్టింది. ఇప్పటికే రూ.4.39 కోట్లు విడుదల చేసింది. సుమారు ఎకరానికిపైగా విస్తీర్ణంలో రూ.75 లక్షలతో అత్యాధునిక వసతులతో ప్రయోగశాల, రూ.72 లక్షలతో ఫ్యాన్లతో షెడ్లు, వీర్య సేకరణ యార్డు, కంచె నిర్మాణాలు పూర్తయ్యాయి. ప్రభుత్వం నిర్దేశించిన కమిటీ ద్వారా రూ.1.04 కోట్లతో ప్రయోగశాలలో అత్యాధునిక పరికరాలు కొనుగోలు పనులు కొనసాగుతున్నాయి.

**మొదట తొమ్మిది మేలుజాతి, వంద మేకపోతుల పెంపకం**

ప్రస్తుతం ఉమ్మడి కర్నూలు జిల్లాలో 6 లక్షలకుపైగా మేకలు ఉన్నాయి. మేకల ఘనీకృత వీర్య కేంద్రం ఏర్పాటుతో ప్రస్తుతం పెంచుతున్న మేకల కన్నా అధిక బరువు కలిగి శారీరకంగా దృఢంగా ఉండి ఆరోగ్యవంతమైన మేలు జాతి మేకల ఉత్పత్తి జరుగనుంది. ఇందుకోసం అంతర్జాతీయ, దేశీంగా పేరుగాంచిన జమనాపరి (ఉత్తర్‌ప్రదేశ్), బోయర్ (ఆస్ట్రేలియా), బర్‌బరీ (రాజస్థాన్), బీటల్ (రాజస్థాన్), ఉస్మాన్‌బాదీ (రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్), మల్బరీ (కేరళ), సిరోహి (రాజస్థాన్), జక్రానా (రాజస్థాన్), శ్రుతి (గుజరాత్) తొమ్మిది మేలు జాతి మేకపోతులను ప్రభుత్వం నిర్దేశించిన కమిటీ ద్వారా వంద వరకు తొలి విడతగా కొనుగోలు చేయనున్నారు.

**రెండు నెలల్లో అందుబాటులోకి వీర్యకేంద్రం**

మేకపోతుల వీర్య కేంద్రాన్ని వచ్చే ఏడాది జనవరి రెండో వారంలోపు అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ఇప్పటికే మేకపోతుల షెడ్లు, ల్యాబొరేటరీ, కంచె నిర్మాణ పనులు పూర్తయ్యాయి. వాటికి అవసరమైన మేలు జాతి గడ్డిని బనవాసిఫారంలో బీడుగా ఉన్న సుమారు 1,500 ఎకరాల్లో పెంచేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటికే ఉమ్మడి రాష్ట్రంలో ఆబోతుల ఘనీకృత వీర్య కేంద్రం పేరుగాంచింది. మేకపోతుల వీర్య కేంద్రం ఏర్పాటుతో జిల్లా పశ్చిమ ప్రాంతంలోని మేకల పెంపకందారులకు వరంగా మారనుంది.

**పెంపకందారులకు మంచి ఆదాయం**

చంద్రశేఖర్, ఇన్‌ఛార్జి డీడీ, ఘనీకృత వీర్యకేంద్రం బనవాసిబనవాసిలో ఇప్పటికే ఆబోతు వీర్యకేంద్రం ఉంది. మేలు జాతి మేకపోతుల ఉత్పత్తి కోసం ల్యాబొరేటరీ, వీర్య ఉత్పత్తి, సెమెన్ బ్యాంకు ఏర్పాటు పనులు వేగంగా జరుగుతున్నాయి. త్వరలో వీర్యకేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నాం. నిర్దేశించిన కమిటీ ద్వారా మేలు జాతి మేకపోతులు కొనుగోలు చేస్తున్నాం. ఈ ప్రాజెక్టుతో మేకల పెంపకందారుల ఆదాయం మరింత పెరుగనుంది.

# బడుగులకు బలం

కర్నూలు : ఉమ్మడి కర్నూలు జిల్లాలో బీసీ సామాజిక వర్గం ఎక్కువ.. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా జగన్ ప్రభుత్వం వారి వెన్నువిరిచింది.. బీసీ ఎదుగుదలకు అత్యంత కీలకమైన కార్పొరేషన్లను నిర్వీర్యం చేసింది.. వృత్తిదారులను కోలుకోకుండా చేసింది.. స్వయం ఉపాధికి చిల్లిగవ్వ ఇవ్వలేదు.. రాయితీ రుణాలకు ఎగనామం పెట్టారు.. గత ఐదేళ్ల వైకాపా పాలనలో 'నిధి'వంచనకు గురైన బీసీలను ఆదుకోవాలని 'కూటమి' ప్రభుత్వం నిర్ణయించింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కార్పొరేషన్లకు జవసత్వాలు అందించేలా ప్రణాళిక రూపొందించారు. చేతివృత్తులకు పునరుజ్జీవం కల్పించేలా రాయితీ రుణాలు అందించనున్నారు.

**11 వేల మందికి రూ.185 కోట్లు**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 3.5 లక్షల బీసీ కుటుంబాలు ఉన్నాయి. ఆయా కుటుంబాల్లో యువత స్వయం ఉపాధిలో రాణించేలా రాయితీ రుణాలను అందించనున్నారు.. 2024–25 ఏడాదికి కేటాయింపులకు సంబంధించి ఉమ్మడి జిల్లాలో సుమారు 11 వేల మందికిపైగా రూ.185.06 కోట్ల మేర బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలిచ్చేందుకు జిల్లా బీసీ కార్పొరేషన్ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. చిన్నతరహా పరిశ్రమలు, పాడి పరిశ్రమ, చేతివృత్తులకు సంబంధించి మొత్తం ఆరు రంగాలను ప్రాధాన్యంగా తీసుకోనున్నారు.

**ఆదరణ చూపిన తెదేపా**

తెదేపా ప్రభుత్వ హయాంలో బీసీల కోసం 2014–19 మధ్య 'ఆదరణ' పథకం అమలు చేశారు. కులవృత్తిని బట్టి వారికి పరికరాలను అందజేశారు. స్వయం ఉపాధిలో భాగంగా వడ్డెరలకు పలుగు, పార,



చేపలు పట్టే వారికి వలలు, యాదవులకు ప్లాస్టిక్ పాల డ్రమ్ములు, నాయీ బ్రాహ్మణులకు సెలూన్ పరికరాలు.. ఇలా వృత్తుల ఆధారంగా అందజేశారు. 2019లో వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకాన్ని రద్దు చేసి కేవలం రెండు కులాలకు మాత్రమే చేదోడు పథకాన్ని ఏడాదికి రూ.10 వేలు ఇచ్చి చేతులు దులుపుకొంది.

**కోత పెట్టిన వైకాపా** 'జగనన్న చేదోడు' పథకాన్ని 2020లో ప్రారంభించారు. ఏటా రూ.10 వేల సాయం చేస్తామని చెప్పిన జగన్ ఆ తర్వాత సంవత్సరానికి 2021లో ఎలాంటి సాయాన్ని అందించలేదు. ఇదే సమయంలో ప్రతి ఏడాది ఆర్థిక సాయం అందజేస్తామని హామీ ఇచ్చిన జగన్.. 2019 నుంచి 2024 వరకు కేవలం నాలుగుసార్లు మాత్రమే ఇచ్చారు. ఒక్క ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.41,39,40,000లను ఇవ్వకుండా ప్రభుత్వం వంచించింది. తొలి ఏడాది కర్నూలులో 12,191 మంది, నంద్యాలలో 24,540 మందిని పథకానికి ఎంపిక చేశారు. 2021లో సాయం అందించకపోగా 2022లో లబ్ధిదారుల సంఖ్యను కుదించారు. కర్నూలులో 11,222, నంద్యాలలో 22,701 మందిని తగ్గించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెండో ఏడాది 2,800 మందిని తప్పించి రూ.2.80 కోట్లను ప్రభుత్వం మిగుల్చుకుంది. బీసీల్లోని 113 కులాల్లో కేవలం రెండు కులాల వారికే పరిమితం చేయడంతో సుమారు రూ.2 లక్షల కుటుంబాలు పథకాన్ని అందుకోలేకపోయాయి.

# జల్‌జీవన్‌లో... నిర్లక్ష్యపు ధారలు

నంద్యాల : ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చి.. కుటుంబ అవసరాలకు సరిపడా మంచినీరు అందించాలన్న లక్ష్యంతో కేంద్రం జల్‌జీవన్ మిషన్‌ను తీసుకొచ్చింది. పల్లెల్లో ప్రతి ఒక్కరికీ నిత్యం 55 లీటర్ల చొప్పున 3.45 లక్షల కుటుంబాలకు మంచినీరు అందించాల్సి ఉంది. ఇందుకోసం బోరుబావులు తవ్వించి.. మోటార్లు బిగించాలి.. ట్యాంకులు, పైపులైన్లు నిర్మించాల్సి ఉంది. ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా రాష్ట్ర వాటా ఇవ్వకుండా 'నీరు'గార్చింది.. ఆరు నెలల కిందట అధికారంలోకి వచ్చిన 'కూటమి' ప్రభుత్వం సర్వే చేయించింది.. చేసిన పనుల్లో అడుగడుగునా లోపాలు దర్శనమిచ్చాయి.. కనెక్షన్లు ఇవ్వకున్నా ఇచ్చినట్లు లెక్కలు రాసుకొన్నారన్న విషయం వెలుగులోకి వచ్చింది.. ఆయా అంశాలపై నివేదికలిచ్చిన అధికారులు పనులపై డీపీఆర్ రూపొందించకపోవడంతో పనుల ప్రగతిపై ప్రభావం పడింది.. వీటి పూర్తికి ఏడాది మాత్రమే గడువు ఉంది.. అప్పటిలోపు పూర్తవుతాయా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

**పూర్తయ్యింది సగమే** నంద్యాల జిల్లాలో 215 పనులు జరుగుతుండగా 16 చోట్ల రద్దు చేశారు. చేసిన పనులకుగాను గుత్తేదారులకు రూ.14.25 కోట్లు చెల్లించాల్సి ఉంది. కర్నూలు జిల్లాలో రూ.12.17 కోట్ల చెల్లించాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాలో 532 కి.మీ. పొడవునా పైపులైన్ పూర్తి చేయాల్సి ఉంది. ఆయా పనులకు డీపీఆర్ తయారు చేయాల్సిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చేతులెత్తేయడం పథకం ప్రగతిపై ప్రభావం చూపనుంది.

**ట్యాంకు నిర్మాణాల ఊసేలేదు**

కర్నూలు జిల్లాలో 245 ట్యాంకులు నిర్మించాల్సి ఉండగా, ఇప్పటి వరకు 45, నంద్యాలలో 183కుగాను 63 పూర్తయ్యాయి. రూ.5 లక్షల్లోపు పనులను నామినేషన్ పద్ధతిలో కేటాయించారు. కర్నూలు జిల్లాలో 478, నంద్యాలలో 508 గ్రామ జల సంఘాలు ఏర్పాటు చేసి పనులను నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టారు. పేరుకు జల సంఘాలు పనులు చేస్తున్నట్లు పైకి చెప్పినా క్షేత్ర స్థాయిలో వైకాపా నాయకులే చేశారు.

**కనిపించని కుళాయిలు**

కర్నూలు జిల్లాలో 34, నంద్యాలలో 26 సీపీడబ్ల్యూ పథకాలున్నాయి. వీటి పరిధిలో కుళాయిల ఏర్పాటుకు రెండు జిల్లాలకు రూ.40 కోట్లు కేటాయించారు. పనులు ప్రారంభించి నాలుగేళ్లయినా ఇంత వరకు సగం కనెక్షన్లు ఇవ్వలేకపోయారు.

పైపులైన్లు, కుళాయి కనెక్షన్ పనులు నాసిరకంగా చేపట్టారు. ఇచ్చిన కనెక్షన్లు క్షేత్ర స్థాయిలో కనిపించడం లేదు. నీళ్లు రాక చాలాచోట్ల విరిగిపోయాయి. దస్త్రాల్లో కనెక్షన్లు, కుళాయిలు ఏర్పాటు చేసినట్లు చూపుతున్నా, క్షేత్ర స్థాయిలో కనిపించడం లేదు. ఈ విషయం ఇంటింటి సర్వేలో వెల్లడైంది. ఆలూరు, మంత్రాలయం, ఆదోని, కోడుమూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో 40 శాతం పనులు జరగలేదు. ఉయ్యాలవాడ, చాగలమర్రి, రుద్రవరం దొర్నిపాడు, పాణ్యం, గడివేముల మండలాల్లో పనులు నాసిరకంగా జరిగాయి.

పనుల విలువ: రూ.530.11 కోట్లు(కర్నూలు రూ.239.64 కోట్లు, నంద్యాల రూ.290.47 కోట్లు)

# గూడు పురాణి

విజయనగరం : విజయనగరం శివారు గుంకలాం వద్ద రాష్ట్రంలోనే మూడో అతి పెద్ద లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణానికి 2020 డిసెంబరులో శంకుస్థాపన చేసింది. సొంతంగా ఇళ్లు నిర్మించుకోలేని లబ్ధిదారులకు థర్డ్ ఆప్షన్ కింద రాక్రీట్ సంస్థకు 6,055 అప్పగించారు. నాలుగేళ్లలో ఒక్క ఇంటినీ పూర్తి చేయలేదు.

వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉండటంతో రాక్రీట్ సంస్థ పెట్టుబడి కింద ముందస్తుగానే బిల్లులు చెల్లించాలని అప్పట్లో రాష్ట్రస్థాయి అధికారులతో పైరవీలు చేయించుకుంది. పునాదుల దశ దాటిన తర్వాత ఒక్కో నిర్మాణానికీ రూ.55 వేలకు బదులు రూ.70 వేల చొప్పున అందుకుంది. ప్రతి దశలోనూ లబ్ధిదారులకు అందించే ఆర్థిక సాయంలో అత్యధిక శాతం ముందుగా చెల్లించాలని అధికారులపై సంస్థ ప్రతినిధులు తీవ్ర ఒత్తిడి చేశారు. తీరా.. కాసులు అందిన తర్వాత నత్తనడకన పనులు చేపట్టారు. అధికారుల ఆదేశాలను ఖాతరు చేయలేదు.

ఇసుక, ఇనుము, సిమెంటు అమ్మేశారు

ఇళ్ల నిర్మాణం వేగవంతంగా పూర్తి చేసేందుకు ఇసుక, ఇనుము, సిమెంటు ప్రభుత్వమే సరఫరా చేసింది. వీటికి అయ్యే మొత్తాన్ని మినహాయించుకుని మిగిలిన బిల్లు చేస్తామని అధికారులు చెప్పడంతో అందుకు సంస్థ అంగీకరించింది. ఒక్కో ఇంటి నిర్మాణానికీ 20 టన్నుల



ఇసుక, 90 బస్తాల సిమెంటు, 470 కిలోల ఇనుము సరఫరా చేశారు. అప్పట్లో 20 టన్నుల ఇసుక ఉచితంగా ఇచ్చారు. తీరా ఒక్కో ఇంటికి సుమారు 350 కిలోల ఇనుము, 70 బస్తాల సిమెంటు, పది టన్నుల ఇసుక వరకు వినియోగించారు. సుమారు 120 -150 కిలోల ఇనుము, 20 బస్తాల సిమెంటు, 10 టన్నుల ఇసుక దొడ్డిదారిన విక్రయించినట్లు తెలిసింది. ఈ మొత్తంతో పాటు ప్రభుత్వం నుంచి బిల్లుల రూపంలో ముందుగా తీసుకొన్న నిధులు జేబులో వేసుకున్నారు. తర్వాత అధికారులు ఎంత ఒత్తిడి చేసినా పనులు చేపట్టలేదు. పైగా ఆ ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేమని చేతులెత్తేసి లేఅవుట్ నుంచి పత్తా లేకుండా వెళ్లిపోయారు.


రూ.6 కోట్లు అదనం..

రాక్రీట్ సంస్థ చేపట్టిన పనుల కంటే ప్రభుత్వం నుంచి అదనంగా రూ.6 కోట్లు తీసుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఇళ్ల నిర్మాణంపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో విచారణ జరిపించింది. గుంకలాం లేఅవుట్‌లో మూడు రోజుల పాటు సంబంధిత అధికారులు పరిశీలించారు. చేపట్టిన పనుల విలువ కంటే రూ.6 కోట్లు ఎక్కువ నిధులు సంస్థ తీసుకుందని ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిసింది. దీనిపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. ఇసుక, ఇనుము, సిమెంటు రూపంలో తీసుకున్న దానికి సంబంధించి విజిలెన్స్ అధికారులు దృష్టి సారించలేదు. ఈ లెక్కలు సైతం అధికారులు తీస్తున్నారు. మొత్తం కలిపితే రూ.15 కోట్లకు పైగా ఉంటుందని ప్రాథమిక అంచనా. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ సంస్థపై త్వరలో చర్యలు తీసుకోనున్నట్లు తెలిసింది. విజిలెన్స్ విచారణ జరుగుతోంది – కూర్మినాయుడు, పీడీ, గృహ నిర్మాణ సంస్థ రాక్రీట్ సంస్థ చేపట్టిన ఇళ్ల నిర్మాణాలపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. ఆ నివేదికను ప్రభుత్వం పరిశీలించిన తర్వాత చర్యలు తీసుకుంటారు. మార్చి నెలాఖరులోగా అసంపూర్తి ఇళ్లన్నీ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు లబ్ధిదారులను ప్రోత్సహిస్తున్నాం.

# కాసులిస్తే..కట్టేసుకోవచ్చు!

ఆకివీడు : ఆకివీడు పట్టణ పరిధి సిద్ధాపురం రహదారిలో చినకాపవరం మురుగు కాలువ గట్టును ఆక్రమించి నిర్మించిన భవనానికి ఆన్‌లైన్‌లో అనుమతులు వచ్చినట్లు యజమానులు చెబుతున్నారు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు అధికారులు పరిశీలించి కాలువ భూమిని ఆక్రమించినట్లు గుర్తించినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఆకివీడు పరిధిలో ఇలాంటి భవన నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతూనే ఉన్నాయి.


ఆకివీడు పట్టణ పరిధిలో కొన్నేళ్లుగా భవన నిర్మాణ అనుమతుల్లో భారీ స్థాయిలో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. కొందరు అడ్డదారిలో అనుమతులు పొంది.. మరికొందరు అసలు అనుమతులతో పనిలేకుండా భారీ భవనాలు నిర్మించుకుంటున్నారు. భవన నిర్మాణ అనుమతులకు ఎక్కువ శాతం మంది ప్రైవేటు ఏజెన్సీల ద్వారా



ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటున్నారు. వీటిని కమిషనర్, టీపీవో లాగిన్ ద్వారా 15 రోజుల్లో పరిశీలించి అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ గడువులోపు సంబంధిత అధికారులు దరఖాస్తులను చూడకపోతే అనుమతులు మంజూరైనట్లుగా ప్రక్రియ ముందుకు సాగుతుంది. ఆకివీడుకు నగర పంచాయతీ హోదా 2020 జనవరి 28న రాగా అప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు 268 వరకు భవన నిర్మాణ అనుమతులకు సంబంధించిన దరఖాస్తులు వచ్చాయి. వీటిలో అన్ని పత్రాలు సక్రమంగా ఉన్న 109 ఆమోదం పొందాయి. పూర్తి వివరాలు లేని 30 దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. మరో 103 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో కమిషనర్, టీపీవోలు పరిశీలించకుండానే గడువు దాటిపోయింది. సంబంధిత దరఖాస్తుదారులకు సంబంధించిన నిర్మాణాలు దాదాపు పూర్తయ్యాయి. ఈ వ్యవహారంలో భారీ స్థాయిలో ముడుపులు చేతులు మారినట్లు ఆరోపణలున్నాయి. ఈ నిర్మాణాలపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే తమకు అన్ని అనుమతులు వచ్చాయంటూ యజమానులు కోర్టులను ఆశ్రయిస్తున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి..ఆకివీడు పరిధిలో ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై దృష్టి సారించాం. ఆన్‌లైన్లో పరిశీలన జరగని దరఖాస్తుల ద్వారా అనుమతులు పొందిన నిర్మాణాలపై ఆరా తీస్తున్నాం. వీటిపై నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తాం. వారి ఆదేశాలు మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం. జి.కృష్ణమోహన్, కమిషనర్, పి.రాధా కృష్ణ, టీపీవో

# శేషాచలంలో అతిక్రమణలు



తిరుపతి : తూర్పు కనుమల్లో అంతర్భాగమైన శేషాచలం అడవులకు భౌగోళికంగా ప్రత్యేకత ఉంది. ఇక్కడి అడవుల్లో అరుదైన వృక్ష, జంతు, పక్షిజాతులు ఉన్నాయి. అందుకే కేంద్రం బయోస్పియర్‌గా ప్రకటించింది. ఇక్కడి జీవరాశిని వాటి మనుగడ సంరక్షణకు పర్యావరణ సున్నిత ప్రాంతం (ఎకోసెన్సిటివ్ జోన్)గానూ గుర్తించింది. వన్యప్రాణుల సంరక్షణలో ఇది ఎంతవరకు ఉపకరిస్తోంది అంటే మాత్రం.. అది మిలియన్ డాలర్ల ప్రశ్నే అవుతోంది. ఐదేళ్లూ నిబంధనలకు తూట్లు పడుతున్నా అటవీశాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించింది. వన్యప్రాణుల జీవితాలు గాలిలో దీపం చేసింది.

ఉల్లంఘనలు ఇలా..

అటవీ ప్రాంతం సంరక్షణ, చట్టాలు, నియమావళి అమలులో గత ఐదేళ్లూ అటవీశాఖ విఫలమైందనే చెప్పాలి. ప్రకటిత ప్రాంతంలో అనధికార దుకాణాల ఏర్పాటు, వ్యర్థాల డంపింగ్‌ను అడ్డుకోలేకపోయింది. రాజకీయ పార్టీల నాయకుల ఆదేశాలతో నియమావళి అమలు వైపు కన్నెత్తి చూడలేదు. అనధికార దుకాణాల కేటాయింపునకూ పచ్చజెండా ఊపింది. తిరుమలకు వెళ్లే రెండు కనుమదారులు, నడకదారులు పది కి.మీ. పరిధిలోని సెన్సిటివ్ జోన్‌లోనే ఉన్నందున నియమావళిని అమలు చేయడంలో అడ్డంకులు ఎదురవుతున్నాయంటూ తప్పించుకుంటోంది.

ప్రాంతం పరిధి ఇలా..

10 కి.మీ. పరిధిలోని 525.97 ఎకరాల అటవీ ప్రాంతం. 353.62 చ.కి.మీ. పరిధిలోని ఎస్వీ నేషనల్ పార్కు, 172.35 చ.కి.మీ. పరిధిలోని ఎస్వీ వైల్డ్‌లైఫ్ ప్రాంతం.

నిబంధనలు

అటవీ సంరక్షణ చట్టం 1986 ప్రకారం వన్యప్రాణులకు హానికలిగించేలా పర్యావరణ విధ్వంస కార్యక్రమాలపై పూర్తిగా నిషేధం ఉంది. మైనింగ్, భారీ హైడ్రో ఎలక్ట్రికల్ పరిశ్రమల స్థాపన, సామిల్లుల నిర్వహణ, చెట్లు నరకడం, వన్యప్రాణులను వేటాడటం వంటివాటిపై కఠినమైన నియమావళి అనుసరించాలి. ఎంపిక చేసిన అటవీ ప్రాంతంలో దుకాణాల ఏర్పాటు, వ్యర్థాల డంపింగ్ ఎట్టిపరిస్థితుల్లో చేపట్టకూడదు.

2015లో గుర్తింపు

తొమ్మిదేళ్ల కిందట 2015లో కేంద్ర, పర్యావరణ అటవీశాఖ పర్యావరణ సున్నితమైన జోన్‌గా గుర్తించింది. తద్వారా ఇక్కడి పర్యావరణాన్ని, వన్యప్రాణులను రక్షించే అవకాశం అటవీశాఖకు కల్పించింది. శేషాచలం కొండల్లోని ఎస్వీ నేషనల్ పార్కు, శ్రీవేంకటేశ్వర అభయారణ్యం పరిధిని ఇందులో చేర్చింది.

కి.మీ. పరిధి కీలకం

సుప్రీంకోర్టు 2023లో పది కి.మీ. పరిధిలో ఎకోసెన్సిటివ్ జోన్ల ఏర్పాటుపై సవరణ చేసింది. జాతీయ ఉద్యానవనాలు, వన్యప్రాణుల అభయారణ్యాల చుట్టూ కనీసం కి.మీ. పరిధినైనా సున్నిత జోన్‌గా ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో కనీసం కి.మీ. పరిధిలోనైనా నియమావళిని అమలు చేసే ప్రయత్నం జరగడం లేదు.

నిబంధనల అమలుపై సమీక్షిస్తాంపర్యావరణ సున్నిత ప్రాంతం అమలు అంశంపై సమీక్షిస్తాం. జోన్ పరిధిలో దుకాణాల ఏర్పాటు, వ్యర్థాల డంపింగ్ వంటి అంశాలు పరిశీలించి చర్యలు తీసుకుంటాం. వివేక్, తిరుపతి జిల్లా అటవీ అధికారి

# కార్తిక స్నానం.. కష్టాల తీరం



కర్నూలు : శివునికి ప్రీతిపాత్రమైన కార్తికం వచ్చేసోంది.. ఈ మాసంలో నదీ స్నానాలు చేయడానికి భక్తులు ప్రాధాన్యం ఇస్తారు.. ఉమ్మడి కర్నూలు జిల్లాలో తుంగభద్ర, కృష్ణా నదులు ప్రవహిస్తున్నాయి.. పుష్కరాల సమయంలో ఘాట్లు నిర్మించారు.. వాటి అపరిశుభ్రత పేరుకుపోయింది.. బురద నిండిపోయింది.. మెట్లన్నీ పాకురు పట్టాయి.. వీధి దీపాలు వెలగడం లేదు.. మహిళలు దుస్తులు మార్చుకొనే సదుపాయాలు లేవు.. గతంలో వినాయక ఘాట్ ప్రాంతంలో కార్తిక దీపాలు వదిలేందుకు వచ్చిన దంపతులు ప్రమాదవశాత్తు నీటిలో కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోయారు. దేవాదాయశాఖ, స్థానిక సంస్థలు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. కనీసం ఇప్పటికైనా అధికారులు స్పందించాలని భక్తులు కోరుతున్నారు.నగరంలో సంకల్‌బాగ్ సమీపంలో ఘాట్ వద్ద మెట్లు, పరిసర ప్రాంతా లు అధ్వానంగా ఉన్నాయి. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి విగ్రహాలను నదిలో నిమజ్జనం చేశారు. ప్రస్తుతం కొన్ని విగ్రహాలు అలానే ఉన్నాయి. సాయిబాబా దేవాలయం, నాగసాయిబాబా దేవాలయం వద్ద ఘాట్లు ఉన్నా.. వ్యర్థాలతో నిండిపోయి భరింపరాని దుర్వాసన వస్తోంది. రాత్రివేళల్లో వీధి దీపాలూ సరిగా వెలగడం లేదు. కార్తిక మాసం సందర్భంగా నదిలో దీపాలు వదిలేందుకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తప్పవు.

వినాయక ఘాట్ వద్దకు భక్తులు పెద్ద ఎత్తున్న వస్తుంటారు. కేసీ కాల్వలో వరద నీరు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ఇక్కడ కేవలం కార్తిక పౌర్ణమి నాడే అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మిగతా రోజుల్లో పట్టించుకోవడం లేదు. పెద్దఎత్తున వ్యర్థాలు పేరుకుపోయాయి. భరించరాని దుర్గంధం వస్తోంది.

ఇటీవల వచ్చిన వరదలకు పెద్ద ఎత్తున పూడిక పేరుకుపోయింది. వీధి దీపాలు లేకపోవడంతో తెల్లవారుజామున వచ్చే భక్తులు ఇబ్బంది పడనున్నారు. రాఘవేంద్రస్వామి మఠం అధికారులు నిర్మించిన ఘాట్ వద్ద శుభ్రతను పాటిస్తున్నారు. మఠం సంప్రదాయం ప్రకారం ఈ నెల 17న పౌర్ణమి నుంచే కార్తిక దీపోత్సవాలు వెలిగిస్తున్నారు. వచ్చే నెలలో లక్ష దీపోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు.

సుంకేసుల, మునగాలపాడు, పంచలింగాల, గొందిపర్ల గ్రామాల్లో పుష్కర ఘాట్ల నిర్వహణ అధ్వానంగా ఉంది. కార్తిక మాసంలో పుణ్య స్నానాలు చేసేందుకు భక్తులు పెద్దఎత్తున ఈ ప్రాంతాలకు తరలొస్తుంటారు. ఘాట్ల వద్ద బురద పేరుకుపోయింది. వీధి దీపాల సౌకర్యం లేదు.

శ్రీశైల మహాక్షేత్రంలో పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించడానికి ప్రాధాన్యమిస్తారు. అరటిదోనె, దీపాల విక్రయదారులు మెట్లపైనే అడ్డదిడ్డంగా బల్లలు ఏర్పాటు చేయడంతో భక్తులు వెళ్లడానికి ఇబ్బందికరంగా మారింది. కొంతమంది ప్రైవేటు ఫొటోగ్రాఫర్లు మెట్ల వద్దే దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు.. మెట్ల ఆవరణలో విద్యుత్తు తీగలు సక్రమంగా లేవు. నదీ ఉద్ధృతి ఎక్కువగా ఉంది.. నీటి మట్టం వద్ద ఇనుప కంచెను ఏర్పాటు చేయాలి. ఇక్కడ దుస్తులు మార్చుకోవడానికి వసతులు ఉన్నా భక్తులు వినియోగించుకునేలా దేవస్థానం అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలి. అన్ని సౌకర్యాలతో సిద్ధం చేస్తామని ఇన్‌ఛార్జి ఈవో ఇ.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

సప్తనదులు సంగమేశ్వరంలోని సప్తనదుల తీరం వద్దనున్న పుష్కరఘాట్‌లో నదీ ఉద్ధృతి ఎక్కువగా ఉంది. ఉమామహేశ్వరాలయంలో పుష్కరఘాట్‌పై వరకు నీటి అలల తాకిడికి మెట్లపైన బండలు పాడయ్యాయి. మెట్లపైన పాచి పేరుకుపోవడంతో భక్తులు జారిపడుతున్నారు. ఇక్కడ ఇనుప కంచెను ఏర్పాటు చేయకపోవడంతో నదీ లోపలికి వెళ్తున్నారు. చెత్త, ముళ్లకంపలు, గాజు సీసాలు భక్తులు దుస్తులు మార్చుకునే గది వరకు వచ్చాయి. ఇక్కడ చెత్త పేరుకుపోవడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. నందికొట్కూరు

లింగాలగట్టు లింగాలగట్టు వద్ద హైలెవల్, లోలెవల్ ఘాట్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. బుట్టలు, రాళ్లుండటంతో నడిచేందుకు భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. దీపాల కొరతతో పాటు మహిళలు దుస్తులు మార్చుకునేందుకు సరైన గదులు లేవు. లోలెవల్ ఘాట్‌లో దుస్తులు మార్చుకునేందుకు మత్స్యకారులు చీరలతో గదిని ఏర్పాటు చేసి రూ.5 వసూలు చేస్తున్నారు. సున్నిపెంట సర్కిల్

# వసతిగృహాల్లో వణుకే..

అనకాపల్లి : వసతిగృహాల్లో నెలకొంటున్న అసౌకర్యాలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులకు దుప్పట్లు అందక చలితో ఇబ్బందులు పడుతున్నారు. వివిధ ప్రాంతాల్లో వసతిగృహాలను ఆదివారం పరిశీలన చేయగా విద్యార్థులు ఇబ్బందులు కొట్టొచ్చినట్లు కనిపించాయి. అనకాపల్లి బీసీ బాలుర వసతిగృహంలో మూడు నుంచి పదో తరగతి వరకు 180 మంది విద్యార్థులు ఉన్నారు. వీరు వసతికి ఇబ్బందులు పడుతున్నారు. గత ఏడాది విద్యార్థులకు చలికాలంలో దుప్పట్లు ఇచ్చారు. కొత్తగా చేరిన 60 మంది విద్యార్థుల వరకు దుప్పట్లు లేవు. ఈ ఏడాది దుప్పట్లను ప్రభుత్వం సరఫరా చేసినా ఇంకా అందించలేదు. గత ప్రభుత్వ హయాంలో ఎంపీ ల్యాడ్స్‌తో అదనపు భవన నిర్మాణానికి నిధులు మంజురు చేసినా నిర్మాణ పనులు నిలిచిపోయాయి. బాత్‌రూంలో సెప్టిక్ ట్యాంకు నిండిపోయింది. ఈ కారణంగా విద్యార్థులు కంపును భరించలేకపోతున్నారు. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టు బాత్‌రూంలు లేకపోవడం, తలుపులు విరిగిపోవడంతో బాలురు అవస్థలు పడుతున్నారు. దోమల బెడద తీవ్రంగా ఉంది. రాత్రివేళలో కంటిమీద కుసుకు లేకుండా చేస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు.


కళాశాల బాలుర వసతి గృహంలో రాత్రివేళలో కరెంటు పోతే విద్యార్థులు అవస్థలు అన్నీ ఇన్నీ కావు. కరెంటు పోతే చదువుకోడానికి ఇబ్బందులు పడుతున్నారు. మురుగు కాలువ సదుపాయం లేకపోవడంతో దోమలు పెరిగి పోతున్నాయి. కిటికీలకు తలుపులు లేక చలిగాలులు వీస్తున్నాయి. స్లాబ్ పాడైపోవడంతో వర్షం పడితే కారిపోతోంది. ఇక్కడ ఎంపీ ల్యాడ్స్ నిధులతో అదనపు భవన నిర్మాణ పనులు గత ప్రభుత్వ హయాంలో చేపట్టినా పూర్తిచేయలేదు.

# హృదయ ఘోష విను

ఒంగోలు : సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేస్తున్న యువకుడు ఒకరు ఒంగోలు నగరంలోని ఒక కార్పొరేట్ ఆసుపత్రికి ఇటీవల వచ్చారు. కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతుండటంతో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఫలితాల్లో అతని గుండె కవాటాలు రెండు పూడిపోయినట్లు బయట పడింది. దీంతో చిన్న వయసులోనే వైద్యులు అతనికి స్టంట్‌లు వేశారు.

బేస్తవారపేటకు చెందిన యాభై సంవత్సరాల వ్యక్తి కడుపు ఉబ్బరం సమస్యతో ఇటీవల ఒంగోలులోని జీజీహెచ్‌కి వచ్చారు. పరీక్షించిన వైద్యులు గుండెపోటుగా నిర్ధారించి అత్యవసర వైద్యం అందించారు. కేవలం కడుపు ఉబ్బరం సమస్యగా అతను భావించి మరికొంత సమయం ఉపేక్షిస్తే ప్రాణాలకే హాని తలెత్తేదని వైద్యులు చెప్పారు.

మానవ దేహానికి గుండె కీలకం. అది పదిలంగా ఉంటేనే పదికాలాల పాటు ప్రాణాలు నిలిచేది. ఒకప్పుడు వృద్ధులు, జన్యుపర బాధితుల్లో గుండెపోటు సమస్య కనిపించేది. మారుతున్న జీవనశైలితో ఇప్పుడు చిన్న వయసులోనే హృదయం లయ తప్పుతోంది. జిల్లాలో కొన్నేళ్లుగా ఇటువంటి వారి సంఖ్య పెరుగుతుండటం ఆందోళన కలిగించే పరిణామం. ఒంగోలులోని జిల్లా సమగ్ర వైద్యశాలకు వచ్చే రోగుల్లో 5 శాతం గుండె సంబంధ వ్యాధులతో బాధపడే వారు కావడం పరిస్థితి తీవ్రతను చెప్పకనే చెబుతోంది. గుండె సంబంధ వ్యాధులకు మారిన జీవనశైలి ఓ కారణమని వైద్య ఆరోగ్య శాఖ అసంక్రమిత వ్యాధుల



విభాగం ప్రోగ్రాం అధికారి డాక్టర్ భగీరథ తెలిపారు. ఈ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, సకాలంలో గుర్తిస్తే ప్రాణహాని నుంచి కాపాడటానికి అవకాశాలుంటాయని చెబుతున్నారు. గుండె జబ్బులకు కారణమవుతున్న మధుమేహం, రక్తపోటులను ముందుగా అదుపులో ఉంచుకోవాలని సూచిస్తున్నారు.

మధుమేహం, రక్తపోటుపై ఎన్‌సీడీ సర్వే వివరాలు...

ఆరోగ్య గుర్తింపు సంఖ్యలున్నవారు: 18,15,288

పరీక్షలు చేయించుకున్నది: 11,68,410

రక్తపోటు(బీపీ) బాధితులు: 1,17,166 (చేరువలో ఉన్నవారు: 1,39,444)మధుమేహం బాధితులు: 99,324 (చేరువలో ఉన్న వారు: 1,50,423) రక్తపోటు, మధుమేహం రెండింటి బాధితులు: 54,243 (సెప్టెంబర్ ఆఖరి వరకు)

# పదేళ్లుగా ప్రారంభించే తీరికే లేధా

పామూరు: రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన కల్యాణ మండపం ప్రారంభించేందుకు పదేళ్లుగా యంత్రాంగానికి తీరికే లేదు. జిల్లాలో పవిత్ర పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయం చెంత నిర్మించిన తితిదే కల్యాణ మండపం దుస్థితి ఇది. దీంతో కొత్త పెళ్లి జంటలతో పాటు వారి బంధువులు నానా కష్టాలు పడుతున్నారు. సీఎస్‌పురం మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయం పక్కనే 2012లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి రూ.80 లక్షలు మండప నిర్మాణానికి మంజూరు చేయించారు. ప్రజల వాటాగా రూ.8 లక్షలను భక్తులు, దాతలు, వసూలుచేసి తితిదేకి పంపారు. దీంతో పనులు చేపట్టి 2014 నాటికి పూర్తిచేశారు. నారాయణస్వామి దేవస్థానం అధికారులు రూ.2.50 లక్షలు వెచ్చించి మండలం, భోజనశాల ప్రాంగణం వద్ద



గ్రావెల్ తోలించి పనులు చేపట్టారు.

ఎక్కడికక్కడే శిథిలమై..: మండపం నిర్మాణం పూర్తయి పదేళ్లు దాటినా నేటికీ పాలకులు, అధికారులు దీన్ని ప్రారంభించలేదు. దీంతో నిర్మాణమంతా శిథిలమైంది. గోడలు పలుచోట్ల నెర్రెలిచ్చాయి. కిటికీలకు అమర్చిన అద్దాలు పగిలిపోయాయి. మరుగుదొడ్లు పాడైపోయాయి. మండపం, భోజనశాల ప్రాంతమంతా పావురాల రెట్టలు, ఈకలతో నిండిపోయాయి. నీళ్ల ట్యాంక్ దెబ్బతింది. ప్రాంగణంలో చిల్ల, పిచ్చిచెట్లు పెరిగిపోయాయి. వసతుల కల్పనలో నిర్లక్ష్యం: కల్యాణ మండపంలో వసతుల కల్పనలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేశారు. ఇప్పటికీ మండపం హాలులో కుర్చీలు, భోజనశాలలో వంట సామగ్రి, టేబుళ్లు ఏర్పాటు చేయలేదు. దీంతో పుణ్యక్షేత్రం చెంత వివాహాలు చేసుకోవాలన్న కొత్త జంటల కలలు నెరవేరడం లేదు. పలుమార్లు విషయాన్ని గత ఎమ్మెల్యే, ప్రస్తుత ఎమ్మెల్యే, తితిదే ఛైర్మన్ల దృష్టికి నాయకులు, ప్రజలు తీసుకెళ్లినా ఫలితం లేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి మండపాన్ని ప్రారంభించి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

# పొలాల్లోనే తేమశాతం నిర్ధారణ!

భీమవరం : అన్నదాతలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని జిల్లా అధికారులు, నాయకులు ప్రారంభించనున్నారు. రైతు సేవా కేంద్రాల్లో ఇప్పటికే 34 లక్షల గోనె సంచులు సిద్ధం చేశారు. గతంలో ధాన్యంలో తేమశాతాన్ని రైతుసేవా కేంద్రాల్లో కొలిచేవారు. ఈ సారి సిబ్బంది పొలాలకు వెళ్లి నిర్ధారిస్తారు. ధాన్యం విక్రయించిన 48 గంటల్లో సొమ్ము రైతుల ఖాతాల్లో జమ చేస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది.

లోపాలకు తావులేకుండా.. గతంలో క్షేత్రస్థాయిలో ఎదురైన సమస్యలన్నింటినీ అధిగమించేలా తగిన ఏర్పాట్లు చేసినట్లు అధికారులు ప్రకటించారు. మిల్లును ఎంపిక చేసుకునే అవకాశాన్ని రైతులకే కల్పిస్తున్నారు. ధర ఎక్కువ ఉంటే బహిరంగ మార్కెట్‌లో ధాన్యం విక్రయించుకోవచ్చు ధాన్యం రవాణాకు కోటి గోనె సంచులు అవసరమని అధికారులు గుర్తించారు. రవాణా వాహనాలను సిద్ధం చేస్తున్నారు.

# జత కట్టి.. బె'ధర'గొట్టి

కర్నూలు : వ్యవసాయ మార్కెట్లో ఉల్లి రైతుల కష్టాలు రోజురోజుకు తీవ్రమవుతున్నాయి. నిన్నటివరకు ఈ-నామ్ సర్వర్ సమస్యతో కొనుగోళ్లు మందకొడిగా కొనసాగాయి. వారం రోజులుగా రైతులు రేయింబవళ్లు పడిగాపులు కాశారు.. సరకు కుళ్లిపోవడంతో పెద్దఎత్తున నష్టపోయారు. సోమవారం ఈ-నామ్ విధానంలో క్రయవిక్రయాలు ప్రారంభమవడంతో సమస్య తీరిందని భావించారు. మరోవైపు వ్యాపారులు ధరలు తగ్గించేసి రైతులను నిలువునా ముంచుతున్నారు. గత వారంతో పోలిస్తే క్వింటాకు రూ. 1,000 వరకు తగ్గిపోయింది. వ్యాపారులు పది లాట్లు గరిష్ఠ ధర రాసి మిగిలిన సరకంతా రూ. 2 వేల నుంచి రూ. 3 వేల లోపే ధర రాశారని అన్నదాతలు వాపోతున్నారు.. గత వారంలో మధ్యస్థ ధర రూ. 3,919 ఉండగా ప్రస్తుతం రూ. 2,669కు పడిపోయింది.

మార్కెట్‌కు ఉల్లి సరకు పోటెత్తడంతో వ్యాపారులు సిండికేటయ్యారు. సరకు నాణ్యతగా లేదని, తేమ శాతం ఎక్కువగా ఉందని.. మూతికుళు ఉందంటూ తక్కువ ధరకు సరకు తీసుకున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యపై దృష్టి సారించాల్సిన మార్కెట్ కమిటీ



ఏమాత్రం పట్టించుకోలేదు ఒక్క రోజే వంద లాట్లకు ధరలు రాయకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో మార్కెట్ కమిటీ అధికారులు వ్యాపారులతో మాట్లాడి సరకు నాణ్యతను బట్టి గిట్టుబాటు ధరలు వచ్చేలా వ్యాపారులను ఒప్పించాల్సి ఉంది. కానీ వారు తమకేం సంబంధం లేదన్న రీతిలో వ్యవహరిస్తున్నారు.

దళారి.. గద్దలా వాలి

రైతు చేయి పట్టుకొని అడుగుతున్నది ఓ దళారి. సోమవారం మార్కెట్లో దళారులు వాలిపోయారు. లైసెన్సుడు వ్యాపారులు ఏ లాట్లకు ధర రాయలేదో అక్కడికెళ్లి ఒక ప్యాకెట్ రూ. 100కు ఇస్తావా అంటూ బేరమాడారు. పర్లకు చెందిన రైతు సుంకన్న పది ప్యాకెట్ల ఉల్లిని అమ్మకానికి తీసుకురాగా వ్యాపారులు ఆ లాట్‌ను కొనుగోలు చేయలేదు. చివరికి సదరు దళారి ఆ రైతు వద్దకెళ్లి 50 కిలోల ఉల్లి ప్యాకెట్‌ను రూ. 100కు కొనుగోలు చేసేందుకు బేరమాడాడు.

అనధికార కొనుగోళ్లు

విపణిలో ముగ్గురు దళారులు సుమారు 30-50 ప్యాకెట్ల ఉల్లిని అనధికారికంగా ప్యాకెట్‌ను రూ. 100, రూ. 150కు కొనుగోలు చేశారు. ఇంత జరుగుతున్నా మార్కెట్ కమిటీ అధికారులు పట్టించు కోలేదు. పర్యవేక్షించాల్సి ఉండగా అధికారులు, సిబ్బంది పత్తా లేకుండా పోయారు. దీంతో దళారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ రైతుల పొట్టకొడుతున్నారు. అక్రమ వ్యాపారంతో అటు మార్కెట్ కమిటీ ఆదాయానికీ గండిపడుతోంది.

వచ్చిన దిగుబడులు : 19,767 క్వింటాళ్లు

క్వింటా కనిష్ఠ ధర రూ. 495,

మధ్యకస్థం రూ. 2,669

గరిష్ఠం రూ. 4,347 పలికింది.

# ఇంతులు వాణిజ్య కాంతులు

డోన్ : స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు కూటమి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. ఇందు కోసం 'మై స్టోర్ సెల్లార్' యాప్‌ను రూపొందించారు. పొదుపు మహిళలు తయారు చేసిన డోర్ మ్యాట్స్, జ్యూట్‌బ్యాగ్స్, పచ్చళ్లు వంటకాల పొడులు, అగరబత్తీలు వంటివి యాప్‌లో అందుబాటులో ఉంచనున్నారు. ఓపెన్ నెట్ వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ) విధానం ద్వారా ఇంటి నుంచే విక్రయాలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో పెట్టేందుకు మెప్మా ఆధ్వర్యంలో ప్రతి జిల్లాలో సెల్లార్ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. పర్యవేక్షణకు డీఆర్పీని (డిస్ట్రిక్ట్ రిసోర్స్‌పర్సన్) నియమించారు. పొదుపు సభ్యురాలి పేరు, ఐడీ, ఫోన్ నంబరు, వస్తువుల ధర, బ్యాంకు ఖాతా, ఫోన్‌పే లాంటి పలు వివరాల్ని సెల్లార్ పాయింట్‌లోని జిల్లా రిసోర్స్‌పర్సన్‌కు అందిస్తే రిజిస్ట్రేషన్ చేయనున్నారు.

ఎక్కడ ఏయే ఉత్పత్తులు

కొవ్వొత్తులు, నార సంచులు, ముత్యాలపూసల దండలు (హ్యాండ్ మేడ్ డీడ్స్), పచ్చళ్లు, చిరుధాన్యాలతో తయారు చేసిన మిల్లెట్ మురుకులు, కొర్రల లడ్డూ, రాగి, కొర్రలతో తయారు చేసిన మిక్చర్, పొడర్లు, బిస్కెట్లు, ఫినాయిళ్లు, రాగి పిండి, జొన్న పిండి, బియ్యం పిండి, పట్టుచీరలు, నైటీలు, చీరలు, డ్రస్ మెటీరియల్స్, తలనూనెలు, హెయిర్‌షాంపూ వంటివి స్థానికంగా అన్ని దుకాణాల్లో లభించేలా చేయడంతో పాటు ఓఎన్‌డీసీ విధానం ద్వారా ఆన్‌లైన్ మార్కెటింగ్‌కు అవకాశం కల్పించనున్నారు.

సాంబార్, రసం, పులిహోర, చట్నీ, కారం,కరివేపాకు వంటి పొడులు, చాక్లెట్లు, రెడీమేడ్ దోస పిండి, ఇడ్లీ పిండి, తీగల బుట్టలు, మహిళల ఫ్యాన్సీ వస్తువులు, బొమ్మలు, చిన్న పిల్లలకు సంబంధించిన ఆట వస్తువులు, ప్లాస్టిక్ బాక్సులు, హెయిర్ ఆయిల్, హెయిర్‌షాంపూ, మగ్గంవర్క్ ఉత్పత్తులకు చోటు కల్పించారు.

లెదర్ సంచులు, మట్టి ప్రమిదలు, మట్టి బొమ్మలు, గంధం, మహిళలకు సంబంధించిన ఎంబ్రాయిడరీ వస్తువులు, వివాహాలకు సంబంధించిన అలంకరణ వస్తువులను గుర్తించారు.

దీపం పుల్లలు, డోన్, ఆళ్లగడ్డ, కర్నూలు, ఎమ్మిగనూరులలో అగరుబత్తీల తయారీ వస్తువులకు చోటు కల్పించారు.

డోన్, ఆళ్లగడ్డ, నంద్యాల, కర్నూలు, ఎమ్మిగనూరు, ఆత్మకూరు, నందికొట్కూరు, బేతంచెర్ల పురపాలికల పరిధిలో జ్యూట్‌బ్యాగులు, తీగల బుట్టలు, చిరుధాన్యాలతో తయారు చేసిన వస్తువులు, చీరలు, ఫినాయిల్ విక్రయాలు ప్రోత్సహించనున్నట్లు మెప్మా అధికారులు పేర్కొన్నారు.

# కాస్త చేయూతనిస్తే.. కష్టాలు తీరినట్లే!



అనంతపురం : గత వైకాపా ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన శ్రీసత్యసాయి తాగునీటి పథకాన్ని గాడిలో పెట్టేలా కూటమి సర్కారు చర్యలు తీసుకుంటోంది. గడిచిన ఐదేళ్లలో పథకం నిర్వహణకు కనీస నిధులు ఇవ్వకపోవడంతో పంపుహౌసుల్లో ఇబ్బందులు తలెత్తి నీటి సరఫరా పూర్తిస్థాయిలో జరగలేదు. జీతాలు సైతం సక్రమంగా అందకపోవడంతో కార్మికులు ప్రతి నెలా సమ్మె చేయాల్సి వచ్చింది. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రాగానే పథకం నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించింది. కార్మికుల వేతన బకాయిలు, అత్యవసర మరమ్మతులకు రూ. 30 కోట్లు మంజూరు చేసింది. వాటిని ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్వహణకు వినియోగించనున్నారు. పథకం నిర్వహణకు రూ. 52 కోట్లు అవసరమని గ్రామీణ నీటి సరఫరా అధికారులు రెండు నెలల కిందట ప్రతిపాదనలు పంపారు. స్పందించిన ప్రభుత్వం గతనెలలో నిధులు విడుదల చేసింది.

మూడు చోట్ల కొత్త మోటార్ల ఏర్పాటు

కూటమి ప్రభుత్వం వచ్చాక విడుదల చేసిన నిధులతో ముందుగా కార్మికుల జీతాలు చెల్లించారు. ఈఏడాది సెప్టెంబరు వరకు ఉన్న బకాయిలకు రూ. 14 కోట్లు విడుదల చేశారు. పంపుహౌసుల్లో మరమ్మతులకు రూ. 60 లక్షలు వినియోగించారు. ఇప్పటికిప్పుడు చేపట్టాల్సిన పనులకు సంబంధించి అధికారులు కసరత్తు చేస్తున్నారు. పంపుహౌసుల్లో అదనపు మోటార్ల ఏర్పాటు, ఫిల్టర్ల మార్పు, అవసరమైన చోట కొత్త పైపులైన్ల ఏర్పాటు తదితర పనులు గుర్తించారు. పీఏబీఆర్, ముదిగుబ్బ, కళ్యాణదుర్గం పంపుహౌసుల్లో కొత్త మోటార్ల ఏర్పాటుకు రూ. 2 కోట్లతో టెండర్లు ఆహ్వానించారు.

మరో రూ. 42 కోట్లు అవసరం

శ్రీసత్యసాయి పథకాన్ని 600 గ్రామాలకు తాగునీరు అందించేందుకు రూపొందించారు. కొన్నేళ్లుగా నిర్వహణ లేకపోవడంతో పలుచోట్ల సమస్యలు తలెత్తాయి. ప్రస్తుతం 72 గ్రామాలకు తాగునీరు అందడం లేదు. పథకానికి పూర్వవైభవం రావాలంటే మరో రూ. 42 కోట్లు అవసరమని అధికారులు అంచనా వేస్తున్నారు. మొత్తం 66 పంపుహౌసుల్లో 22 మోటార్లకు కాలం చెల్లింది. వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడానికి రూ. 16 కోట్లు అవసరం. గుత్తి, కళ్యాణదుర్గం, ముదిగుబ్బ, ఉరవకొండ తదితర ప్రాంతాల్లో 48 కిలోమీటర్ల మేర కొత్త పైపులైన్ ఏర్పాటు చేయడానికి రూ. 18 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది. పంపుహౌసుల్లో ఫిల్టర్లు, వాల్వులు, విద్యుత్తు ఉపకరణాల ఏర్పాటు వంటి వాటికి మరిన్ని నిధులు అవసరమవుతాయని ప్రభుత్వానికి నివేదించినట్లు గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు చెబుతున్నారు.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం

– వినోద్‌కుమార్, కలెక్టర్, అనంతపురం

శ్రీసత్యసాయి తాగునీటి పథకం నిర్వహణకు గాను ఈ ఆర్థిక సంవత్సరానికి రూ. 30 కోట్లు మంజూరయ్యాయి. కార్మికుల జీతాలతో పాటు కొన్ని మరమ్మతులకు ఖర్చు చేస్తున్నాం. పూర్తిస్థాయిలో మరమ్మతులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. అనుమతులు వచ్చిన వెంటనే పనులు చేపడతాం. పథకం నిర్వహణ కోసం టెండర్లు ఆహ్వానిస్తాం.

# మహిళా శక్తి.. వ్యాపార యుక్తి

డోన్ : స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు కూటమి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. ఇందు కోసం 'మై స్టోర్ సెల్లార్' యాప్‌ను రూపొందించారు. ఓపెన్ నెట్ వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ) విధానం ద్వారా ఇంటి నుంచే విక్రయాలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో పెట్టేందుకు మెప్మా ఆధ్వర్యంలో ప్రతి జిల్లాలో సెల్లార్ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. పర్యవేక్షణకు డీఆర్పీని (డిస్ట్రిక్ట్ రిసోర్స్‌పర్సన్) నియమించారు.

ఎక్కడ ఏయే ఉత్పత్తులు

లెదర్ సంచులు, మట్టి ప్రమిదలు, మట్టి బొమ్మలు, గంధం, మహిళలకు సంబంధించిన ఎంబ్రాయిడరీ వస్తువులు, వివాహాలకు సంబంధించిన అలంకరణ వస్తువులను గుర్తించారు.

దీపం పుల్లలు, డోన్, ఆళ్లగడ్డ, కర్నూలు, ఎమ్మిగనూరులలో అగరుబత్తీల తయారీ వస్తువులకు చోటు కల్పించారు.

సాంబార్, రసం, పులిహోర, చట్నీ, కారం,కరివేపాకు, చట్నీ వంటి పొడులు, చాక్లెట్లు, రెడీమేడ్ దోస పిండి, ఇడ్లీ పిండి, తీగల బుట్టలు, మహిళల ఫ్యాన్సీ వస్తువులు, బొమ్మలు, చిన్న పిల్లలకు సంబంధించిన ఆట వస్తువులు, ప్లాస్టిక్ బాక్సులు, హెయిర్ ఆయిల్, హెయిర్‌షాంపూ, మగ్గంవర్క్ ఉత్పత్తులకు చోటు కల్పించారు.

కొవ్వొత్తులు, నార సంచులు, ముత్యాలపూసల దండలు (హ్యాండ్ మేడ్ డీడ్స్), పచ్చళ్లు, చిరుధాన్యాలతో తయారు చేసిన మిల్లెట్ మురుకులు,



కొర్రల లడ్డు, రాగి, కొర్రలతో తయారు చేసిన మిక్చర్, పొడర్లు, బిస్కెట్లు, ఫినాయిళ్లు, రాగి పిండి, జొన్న పిండి, బియ్యం పిండి, పట్టుచీరలు, నైటీలు, చీరలు వంటివి స్థానికంగా అన్ని దుకాణాల్లో లభించేలా చేయడంతో పాటు ఓఎన్‌డీసీ విధానం ద్వారా ఆన్‌లైన్ మార్కెటింగ్‌కు అవకాశం కల్పించనున్నారు.

డోన్, ఆళ్లగడ్డ, నంద్యాల, కర్నూలు, ఎమ్మిగనూరు, ఆత్మకూరు, నందికొట్కూరు, బేతంచెర్ల పురపాలికల పరిధిలో జ్యూట్‌బ్యాగులు, తీగల బుట్టలు, చిరుధాన్యాలతో తయారు చేసిన వస్తువులు, చీరలు, ఫినాయిల్ విక్రయాలు ప్రోత్సహించనున్నట్లు మెప్మా అధికారులు పేర్కొన్నారు.

# అపార్ నమోదు ఎలా?




తిరుపతి: ఒక దేశం, ఒక స్టూడెంట్ కార్డు పేరుతో జాతీయ నూతన విద్యావిధానం-2020లో భాగంగా కేంద్రం తెచ్చిన ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) నమోదులో సమస్యలు తలెత్తుతున్నాయి. విద్యార్థి వివరాలు అడ్మిషన్ రిజిస్టర్‌తోపాటు యూడైస్‌లో పొందుపరిచారు. సంబంధిత కోడ్ నమోదు చేయగానే విద్యార్థి వివరాలన్నీ వస్తాయి. ఆపార్ నమోదు సమయంలో ఆధార్ వినియోగిస్తుండటం, అందులో వివరాలు తప్పుగా ఉండటంతో నమోదులో సమస్యలు తలెత్తుతున్నాయి. పేరు, పుట్టినతేదీ, తండ్రి పేర్లు అడ్మిషన్ రిజిస్టర్, యూడైస్‌లతో వేరువేరుగా ఉండటంతో ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నాయి.

ఆధార్ కేంద్రాల్లో వీలుకాక: సచివాలయాల కేంద్రంగా కళాశాల, పాఠశాలల విద్యార్థుల ఆధార్ సమస్యలు పరిష్కరించేందుకు ఈనెల 22 నుంచి 25 వరకు ఆధార్ నమోదును ప్రారంభించారు. అక్కడ చిన్నచిన్న పొరపాట్లు మాత్రమే పరిష్కరిస్తున్నారు. ప్రధాన సమస్యల పరిష్కారానికి జనన ధ్రువపత్రాలు తప్పనిసరిగా అడుగుతున్నారు. పాఠశాల స్టడీ సర్టిఫికెట్, గెజిటెడ్ సంతకం ఉన్నవాటినీ అంగీకరించడం లేదు. దీంతో గ్రామీణ విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు.

లక్షల మంది విద్యార్థులు : జిల్లా వ్యాప్తంగా ఒకటి నుంచి పదోతరగతి వరకు 3 లక్షలకు పైగా విద్యార్థులు ఉన్నారు. వారిలో అనేకమంది గ్రామీణ విద్యార్థులు ఉండటం, తల్లిదండ్రులు నిరాక్షరాస్యులు కావడంతో పుట్టిన తేదీల సమస్య తలెత్తుతోంది. మరోవైపు తల్లిదండ్రుల సంతకం ఉంటేనే అపార్ నమోదు ప్రక్రియ కొనసాగుతుంది. వీటితోపాటు ఇతర సమస్యలు సైతం పరిష్కరించాల్సి ఉంది.

తిరుపతి పట్టణంలోని ప్రైవేట్ పాఠశాల విద్యార్థి అడ్మిషన్ రిజిస్టర్‌లో ఇంటిపేరు ఉండగా, ఆధార్‌లో లేదు. దీంతో అపార్‌లో నమోదు కావడం లేదు. ఆధార్ కేంద్రానికి వెళ్తే సవరణకు తప్పనిసరిగా జనన ధ్రువపత్రం కావాలని చెప్పారు. ఇప్పటికిప్పుడు ధ్రువపత్రం పొందలేక తల్లిదండ్రులు వెనక్కి తిరిగొచ్చారు.

బీఎన్‌కండ్రిగలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థి తన పుట్టిన తేదీలో తేడా ఉండటంతో అపార్‌లో నమోదు కాలేదు. జనన ధ్రువపత్రం తెస్తేనే ఆధార్‌లో మార్పు చేస్తామని సిబ్బంది చెప్పారు. ఆ విద్యార్థి ఇంటిదగ్గరే జన్మించడంతో తల్లిదండ్రులు జనన ధ్రువపత్రం తీసుకోలేదు.

# ఆదుకొనేవారెవరు?

విశాఖపట్నం : 'స్థలాలు అమ్మాలి...సొమ్ములు రావాలి... వాటితో అభివృద్ధి ప్రాజెక్టులు ముందుకు తీసుకువెళ్లాలి'...ఇదీ విశాఖ మహాప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) ఆలోచన. వాస్తవం మాత్రం మరోలా ఉంది. స్థలాల అమ్మకం, దుకాణాల లీజుల ద్వారా రూ. 500 కోట్లకు పైగా ఆదాయం వస్తుందని ఊహించుకున్నా అంతా తలకిందులవుతోంది. ఎన్నిసార్లు వేలానికి ప్రకటనలు ఇచ్చినా స్థలాలు కొనేవారు ముందుకు రావడం లేదు.

ఇలా అయితే ఎలా?

వీఎంఆర్‌డీఏకు మొండి స్థలాలు ఎక్కువైపోయాయి. పదేపదే వేలం ప్రక్రియ నిర్వహిస్తున్నా స్పందన రావడం లేదు. పెద్ద స్థలాలు, లేఅవుట్లలో మిగిలిపోయినవి, మూల ప్లాట్ల (ఆడ్ బిట్లు)కు కూడా ఇదే పరిస్థితి. కొన్ని చోట్ల బహిరంగ మార్కెట్ కన్నా ఎక్కువ ధర నిర్ణయించడం సమస్యగా ఉంది. పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవడానికి వీలులేని స్థలాలకు కూడా అదే ధర నిర్ణయించడం గమనార్హం. వేపగుంట, చినముషిడివాడ, పరవాడ, మధురవాడలో పాఠశాలలు, వాణిజ్య అవసరాల స్థలాలను 16 చోట్ల విక్రయానికి ఉంచారు. వీటిల్లో కొన్ని ఎప్పటి నుంచో అమ్ముదామనుకుంటున్నా కొనేవారు రావడం లేదు.

దాకమర్రి ఫార్చ్యూన్ హిల్స్ లేఅవుట్‌లో గతంలో మిగిలి పోయిన 418 ప్లాట్లదీ అదే తీరు. క్షేత్రస్థాయి పరిస్థితులకు, నిర్ణయించిన ధరకు చాలా తేడా ఉండటంతో కొనుగోలుదారులు వెనకడుగు వేస్తున్నారు. ఇవీ కారణాలే:కొన్ని ప్లాట్లు నిషేధిత జాబితాలో ఉండటం కూడా ఆందోళన కలిగిస్తోంది. ఈ స్థలాలను ప్రభుత్వం.. వీఎంఆర్‌డీఏకు కేటాయించి మొదట తొలగించింది. ఆ తర్వాత 2017లో అప్పటి అధికారులు మళ్లీ నిషేధిత జాబితాల్లో కొన్ని చేర్చారు. అటువంటి 25 లేఅవుట్లను గుర్తించి జాబితా నుంచి తొలగించే ప్రయత్నం చేస్తున్నారు. స్థలాలను 'ఈ-కొనుగోళ్లు' అనే వెబ్‌సైట్ ద్వారా మాత్రమే విక్రయిస్తున్నారు. ఈ వెబ్‌సైట్‌పై చాలా మందికి అవగాహన లేదు. చిన్నచిన్న ప్లాట్లు తీసుకోవాలనే ఆసక్తి ఉన్నా సాంకేతిక అవగాహన లేక ముందుకు రాలేకపోతున్నట్లు సమాచారం.

# రైలు ప్రమాదాల నివారణకు కార్యాచరణ




గుంతకల్లు : వివిధ రైల్వే స్టేషన్లలో రైళ్లు ఢీకొంటున్న ఘటనలను దృష్టిలో ఉంచుకుని ప్రమాదాలను నిలువరించడానికి ఉపయోగపడే డాటా లాగర్ డిస్‌ప్లే సిస్టం పరికరాలను కొనుగోలు చేయాలని గుంతకల్లు రైల్వే అధికారులు నిర్ణయించారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదించినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. రూ. 70 కోట్లతో నూతన రైల్వే కంట్రోల్ కార్యాలయాన్ని నిర్మించారు .దీన్ని సికింద్రాబాద్ జోనల్ జనరల్ మేనేజరు అరుణ్‌కుమార్ జైన్ గత జులై 26న ప్రారంభించిన విషయం పాఠకులకు విదితమే. ఇక్కడ డాటాలాగర్ డిస్‌ప్లే సిస్టంను ఏర్పాటు చేయాల్సి ఉండగా, దీన్ని సమకూర్చడానికి అప్పటి డీఆర్ఎం వెంకటరమణారెడ్డి నిరాకరించడంతో అధికారులు ఏర్పాటు చేయలేదు. డాటాలాగర్ అవసరాన్ని ప్రస్తుత జీఎంకు డివిజన్ అధికారులు తెలిపారు. ఆయన స్పందించి వాటిని కొనుగోలు చేయడానికి అంగీకరించారు.

ఆధునిక వ్యవస్థతో ప్రయోజనాలు డివిజన్‌లో ఏ రైల్వే స్టేషన్‌లో అయినా రైళ్లు, గూడ్స్ లైన్లలో ఆగిఉంటే ఈ సమాచారాన్ని డాటాలాగర్ డిస్‌ప్లే సిస్టంలో రైల్వే కంట్రోల్ కార్యాలయంలో నుంచే చూడటానికి వెసులుబాటు ఉంటుంది. స్టేషన్‌లోకి ప్రవేశించే రైళ్లు కూడా డిస్‌ప్లే సిస్టంలో కనిపిస్తాయి. ఫలితంగా కంట్రోల్ కార్యాలయానికి చెందిన సిబ్బంది స్టేషన్‌లోని ఏలైన్‌లోకి రైళ్లు వెళ్లాలో రైలును నడిపే లోకోపైలెట్‌కు చరవాణుల ద్వారా తెలియజేస్తారు. ఫలితంగా రైళ్లు స్టేషన్లో ఆగి ఉండే రైళ్లను ఢీకొనకుండా చూడటానికి అవకాశం ఉంటుందని సంబంధిత రైల్వే అధికారులు తెలిపారు. ఆర్నెళ్లలో జరిగిన ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని రైల్వే కంట్రోల్ కార్యాలయంలో డాటాలాగర్ డిస్‌ప్లే సిస్టిం ఆవశ్యకత చాలా అవసరమని అధికారులు నిర్ణయించారు. ఈమేరకు సామగ్రి కొనుగోలుకు అధికారులు తీర్మానించినట్లు అధికారవర్గాలు తెలియి. దీనికి గాను రూ. 9 కోట్లు అవసరమవుతాయని చెప్పారు. ప్రస్తుతం నిధులను కేటాయించే విషయాన్ని జనరల్ మేనేజరు పరిశీలిస్తున్నారు.

# కలప అక్రమ రవాణాకు అడ్డేది?

అనకాపల్లి : కళ్యాణపులోవ సమీపంలోని రక్షిత అటవీ ప్రాంతం నుంచి విలువైన కలప అక్రమంగా తరలుతోంది. రావికమతం మండలం జెడ్.జోగింపేట, అజేయపురం, పిడింపాలెం, దుకులంపాడు, కడగెడ్డ, రొచ్చుపనుకులు గ్రామాలను ఆనుకుని ఉన్న అడవిలో చెట్లను వ్యాపారులు నరికేసి కలపను తరలిస్తున్నారు. అటవీ ఉద్యోగుల్లో కొందరు కలప వ్యాపారులకు సహకారం అందిస్తుండటంతో కొండ ప్రాంతంలోని చెట్లను ముక్కలుగా చేసి లారీల్లో యథేచ్ఛగా రవాణా జరుగుతోంది. ఎవరైనా అడ్డగిస్తే రైతుల పట్టా భూముల్లోని చెట్లని చెబుతున్నారు. పత్రాలు చూపమని ప్రశ్నిస్తే బెదిరింపులకు దిగుతున్నారని గిరిజనులు వాపోతున్నారు. ఈ ప్రాంతం నుంచి రోజూ 40 టన్నుల వరకు లారీలు, వ్యాన్లు, ట్రాక్టర్ల ద్వారా కలప కాటాలకు తరలుతోంది. తొక్క తీసిన కలపకు టన్ను రూ. 8,500, తొక్క తీయని కలపకు టన్ను రూ. 4 వేల చొప్పున ధర పలుకుతోంది. అటవీ ప్రాంతం నుంచి దొండపూడి చెక్ పోస్టు మీదుగా కాటాలకు తరలిస్తున్నా.. చెక్‌పోస్టు సిబ్బంది, జెడ్.కొత్తపట్నం బీట్ అధికారి అడ్డగించడం, తనిఖీలు చేయడం చేయడం లేదని కళ్యాణపులోవకు చెందిన చినబ్బాయి, రాజిబాబు తదితరులు ఆరోపిస్తున్నారు. అటవీ ప్రాంతం నుంచి రద్దు కర్ర పేరుతో కొండ ప్రాంతంలోని కలపను వ్యాపారులు తరలించుకుపోతుండం, బీట్ అధికారి, సిబ్బంది పట్టించుకోకపోవడంపై డీఎఫ్‌వో, రేంజ్ అధికారులకు ఫోన్లో ఫిర్యాదు చేసినట్లు చినబ్బాయి పేర్కొన్నారు. ఈ విషయమై జెడ్.కొత్తపట్నం బీట్ అధికారి మోహన్‌ను సంప్రదించగా.. కళ్యాణపులోవ ప్రాంతంలోని రైతుల పట్టా భూముల్లోని చెట్లను నరికి రద్దు కలపగా కాటాలకు తరలిస్తున్నారు. వీఆర్వో నుంచి ధ్రువీకరణ పత్రం లేకుంటే అనుమతించేది లేదని కలప వ్యాపారులు పాడి పోతురాజు, అనపర్తి శ్రీను, సబ్బవరపు రమణ, ముసిలినాయుడుకు స్పష్టం చేసినట్లు చెప్పారు.

# వైద్యులు ముగ్గురు.. రోగులు 600

రాయదుర్గం : జిల్లాలో వారం రోజుల కిందట కురిసిన వర్షాలకు పట్టణాలు, పల్లెల్లో పారిశుద్ధ్యం లోపించింది. దోమలు వ్యాప్తి చెందాయి. ఫలితంగా రోగాలు ప్రబలాయి. పిల్లల నుంచి పెద్దల వరకు జ్వరం, దగ్గు, జలుబు, ఒళ్లనొప్పులు వంటి వ్యాధులతో బాధపడుతున్నారు. రాయదుర్గం పట్టణంలోని వంద పడకల ప్రాంతీయ ఆసుపత్రికి రోగులు అధిక సంఖ్యలో రావడంతో కిటకిటలాడింది. మొత్తం 613 ఓపీ నమోదయ్యింది. 76 మందికి రక్తనమూనాలు తీసి పరీక్షలు చేశారు. ముగ్గురు వైద్యులు మాత్రమే అందుబాటులో ఉండటంతో చంటి పిల్లలతో వచ్చిన తల్లిదండ్రులు, వృద్ధులు గంటల కొద్దీ నిరీక్షించారు. సకాలంలో వైద్యసేవలందక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వం వైద్యులను నియమించాల్సి ఉందని ఆసుపత్రి పరిపాలనాధికారి మహబూబ్‌బాషా తెలిపారు.

# శ్రావంతి చొక్కారపు.. చిరిగిన జీన్సులో అందమైన వయ్యారం!

బుల్లితెర ప్రియులకు శ్రావంతి చొక్కారపు పేరు ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. తన యాక్టింగ్‌తో, హోస్టింగ్ స్కిల్స్‌తో టీవీ ప్రేక్షకుల మనసులను దోచేసిన ఈ యాంకర్, సోషల్ మీడియాలోనూ తన అందంతో ఎప్పటికప్పుడు ట్రెండ్ అవుతుంటారు. తాజాగా శ్రావంతి ట్రావెల్ లుక్‌తో మరోసారి అందరినీ ఆకట్టుకున్నారు. కులాలా లంపూర్ రోడ్లలో పింక్ గార్ఫీల్డ్ ప్రింటెడ్ టాప్, బ్లూ డిస్ట్రెస్ జీన్స్ ధరించి నడుచుకుంటూ తీసుకున్న ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అయ్యాయి. స్టైల్‌కు తగ్గట్టు హ్యాండ్‌బ్యాగ్, మోడ్రన్ షేడ్స్‌తో ఆమె లుక్ మరింత హైలైట్ అయ్యింది. ప్రత్యేకంగా చెప్పుకోవలసింది.. శ్రావంతి పెర్ఫెక్ట్ హేయర్‌స్టైల్, ఆమె స్మైల్. ఈ రెండు ఆమె లుక్‌ను మరింత ఫ్యాషన్ ఐకాన్‌గా నిలబెట్టాయి. ఇటీవల బిగ్ బాస్ షో ద్వారా మరింత ప్రజాదరణ పొందిన శ్రావంతి, ఇప్పుడు



తన కెరీర్‌ను మరో లెవెల్ కు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. టీవీ షోలు, ఈవెంట్ హోస్టింగ్‌తో పాటు సోషల్ మీడియా పేజ్‌లలో సూపర్ యాక్టివ్‌గా ఉంటున్నారు. తక్కువ కాలంలోనే ఈ మోడ్రన్ యాంకర్‌గా పేరు సంపాదించుకోవడం ఆమె స్టైల్‌కు, కాన్ఫిడెన్స్‌కు నిదర్శనం. ఆమె ఫోటోషూట్స్ ఎప్పుడూ కూడా వైరల్ అవుతుంటాయి. ప్రతి ఫోటోతో కొత్త ఆహ్లాదకరమైన ఫీల్‌ను క్రియేట్ చేయగల శ్రావంతి, ఈ సారి స్ట్రీట్ స్టైల్‌ను హైలైట్ చేస్తూ తన ట్రావెల్ లుక్‌తో ఫ్యాషన్ స్టేట్మెంట్ ఇచ్చారు. ఈ పిక్స్ చూసిన నెటిజన్లు శ్రావంతి స్టైల్‌ను మెచ్చుకుంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఇప్పుడు శ్రావంతి తన గ్లామర్ లుక్‌తో పాటు యాక్టింగ్ ప్రతిభతో మరింత అవకాశాలను దక్కించుకుంటున్నారు. ప్రస్తుతం ఆమె కొత్త టీవీ ప్రాజెక్టులతో బిజీగా ఉంటోంది, త్వరలోనే వెబ్ సిరీస్‌లోనూ కనిపించబోతున్నట్లు సమాచారం. శ్రావంతి ఇలా ప్రతిసారి తన కొత్త లుక్, హాట్ ప్రెజెన్స్‌తో టాక్ ఆఫ్ ది టౌన్ అవుతుంటారు. ఈ పిక్స్ ఆమె ఫ్యాన్ ఫాలోయింగ్‌ను మరింత పెంచుతాయనడంలో సందేహమే లేదు.

# పచ్చ కోకలో జిల్లనిపించిన సోఫీ

లండన్ బాబులు లండన్ బాబులు అంటూ ఐటమ్ పాటతో మెప్పించింది సోఫీ చౌదరి. 1-నేనొక్కడినేలో స్పెషల్ నంబర్ లో తనదైన వయ్యారంతో మురిపించిన బాలీవుడ్ నటి సోఫీ చౌదరి ఆ తర్వాత తెలుగు పరిశ్రమలో కనిపించలేదు. ప్రస్తుతం బాలీవుడ్ లో కూడా తన కెరీర్ అంతంత మాత్రమే. టీవీ షోలు యోగా సెషన్‌లు అంటూ సోఫీ సోషల్ మీడియాల్లో కొంత హడావుడి చేస్తుంది కానీ, ఆ రకంగానూ అంతగా ఫేమ్ లేదు. నలభై పైగా ఏజ్ తో ఉన్న ఈ బ్యూటీకి అవకాశాలు జీరో అయిపోయాయి. అయితే సోషల్ మీడియాలో మాత్రం యాక్టివ్ గా ఉంటుంది. ఎప్పటికప్పుడు టెంప్టింగ్ ఫోటోషూట్లతో హీటెక్కిస్తుంది. తాజాగా సోఫీ పచ్చ రంగు డిజైనర్



చీర, రవికెలో మతులు చెడగొట్టింది. ప్రస్తుతం ఈ ఫోటో ఇన్ స్టాలో వైరల్ గా మారింది. సోఫీ అందచందాలు మతులు చెడగొడుతున్నాయంటూ యూత్ కామెంట్ చేస్తున్నారు. సోఫీ స్టన్నింగ్ దీవాళీ లుక్ కి ఫిదా అయిపోయామంటూ కొందరు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇక సోఫీ బాలీవుడ్ ఎంట్రీ విషయానికి వస్తే 15 ఏళ్ల క్రితమే షాది నెంబర్ 1 సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత ప్యార్ కి సైడ్ ఎఫెక్ట్స్.. ఐ సీయూ సహా చాలా చిత్రాల్లో నటించింది. ఎక్కువగా ఆమె ఫోకస్ అయింది ఐటం గాళ్ల్ గానే. కానీ ఆ రకంగా ఆమె కెరీర్ సాపీగా సాగలేదు. అవకాశాలు రావడం..మధ్యలో బ్రేకులు ఇలా మొత్తం కెరీర్ నత్తనడకనే సాగింది. దశాబ్ధ కాలంగా సరైన అవకాశాల్లేక ఇబ్బంది పడుతోంది.





# 'డాకు మహారాజ్'లోని ఆ సర్‌ప్రైజ్ ఏంటో..!



నందమూరి బాలకృష్ణ బ్యాక్ టు బ్యాక్ అఖండ, వీర సింహారెడ్డి, భగవంత్ కేసరి సినిమాలతో భారీ విజయాన్ని సొంతం చేసుకున్నాడు. హ్యాట్రిక్ తర్వాత బాలకృష్ణ 'డాకు మహారాజ్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. వాల్తేరు వీరయ్య సినిమాతో హిట్ దక్కించుకున్న బాబీ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతున్న విషయం తెల్సిందే. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో ఈ సినిమాను నాగ వంశీ నిర్మిస్తున్నాడు. త్రివిక్రమ్ భార్య సాయి సౌజన్య ఈ సినిమా నిర్మాణంలో భాగస్వామిగా ఉన్నారు. ఈ సినిమాను 2025 సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు తీసుకు రాబోతున్నారు. సంక్రాంతికి రాబోతున్న గేమ్ ఛేంజర్, సంక్రాంతికి వస్తున్నాం సినిమాల పోటీ తట్టుకోవడం కోసం డాకు మహారాజ్‌ను చాలా స్ట్రాంగ్‌గా దర్శకుడు బాబీ రూపొందించారు అనే టాక్ వినిపిస్తోంది. ఈ సినిమాలో ఇద్దరు యంగ్ స్టార్ హీరోల గెస్ట్ అప్పియరెన్స్ సినిమాకు చాలా స్పెషల్ అంటూ యూనిట్ సభ్యులు లీక్ ఇస్తున్నారు. ఆ ఇద్దరు హీరోలు ఎవరు అనేది ప్రస్తుతానికి సస్పెన్స్‌గా ఉంచారు. ఇప్పటికే షూటింగ్‌ను సైతం ముగించుకున్న ఆ ఇద్దరు హీరోలు త్వరలోనే డబ్బింగ్ సైతం చేయబోతున్నారట. బాలకృష్ణ డాకు మహారాజ్ తో భారీ విజయాన్ని సొంతం చేసుకోవడం ఖాయం అనే నమ్మకంను నిర్మాత నాగ వంశీ వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో డాకు మహారాజ్ సినిమా యొక్క రచ్చ మామూలుగా లేదు. బాలకృష్ణ గత చిత్రాలు భారీ విజయాన్ని సొంతం చేసుకున్న నేపథ్యంలో ఈ సినిమా సైతం భారీ వసూళ్లు నమోదు చేస్తుందని నందమూరి బాలకృష్ణ ఫ్యాన్స్ చాలా నమ్మకంగా ఉన్నారు. విభిన్నమైన కథ, కాన్సెప్ట్‌తో ఈ సినిమా రూపొందుతోన్న నేపథ్యంలో బాలయ్య కెరీర్‌లో నిలిచి పోయే సినిమా అవుతుందని ఫ్యాన్స్ నమ్మకంగా ఉన్నారు. ఈ సినిమాలో హీరోయిన్స్‌గా శ్రద్ధా శ్రీనాథ్ తో పాటు ప్రగ్యా జైస్వాల్ నటిస్తూ ఉన్నారు. బాలకృష్ణ రాజకీయాలతో బిజీగా ఉన్న కారణంగా ఇప్పటికే విడుదల కావాల్సిన సినిమాను వాయిదా వేస్తూ వచ్చారు. డాకు మహారాజ్ సినిమాను డిసెంబర్‌లో విడుదల చేయాలని మొదట భావించినా సంక్రాంతికి వస్తేనే ఈ సినిమాకి పూర్తి స్థాయిలో న్యాయం జరుగుతుంది అనే అభిప్రాయంతో నిర్మాత నాగ వంశీ ఈ సినిమాను పోటీ తీవ్రంగా ఉన్న సంక్రాంతికి విడుదల చేయబోతున్నారట. ఇప్పటి వరకు ఈ సినిమా నుంచి పాటలు రాలేదు. తమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాన ఉంచి మొదటి పాట త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.

# విశ్వంభర పనులు ఎంతవరకు వచ్చాయంటే..



టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న విశ్వంభర మూవీ సంక్రాంతికి వస్తుందని ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూశారు. కానీ గేమ్ ఛేంజర్ రాకతో సైడ్ అవ్వక తప్పలేదు. అయినప్పటికీ సినిమాపై ప్రేక్షకుల్లో అంచనాలు రోజు రోజుకి పెరుగుతున్నాయి. హై వోల్టేజ్ యాక్షన్, డ్రామా, సోషల్ ఫాంటసీ జోనర్ కలిపి రూపొందుతున్న ఈ భారీ చిత్రానికి డైరెక్టర్ వశిష్ట దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే టీజర్ రిలీజ్ తో హైప్ క్రియేట్ చేసిన ఈ మూవీకి సంబంధించి తాజా అప్డేట్ బయటకు వచ్చింది. చిరంజీవికి సంబంధించిన మెయిన్ సీన్స్ షూటింగ్ దాదాపుగా పూర్తయిందట. కొంతమంది కీలక నటులతో కూడా ప్రధాన సన్నివేశాలను పూర్తి చేసినట్లు తెలుస్తోంది. ఇంతవరకు ఫినిష్ అయిన సీన్స్ అన్ని కూడా అద్భుతంగా వచ్చాయని, సినిమా భారీ విజయం సాధించేలా ఉన్నట్లు యూనిట్ సభ్యులు చెబుతున్నారు. ముఖ్యంగా చిరు నటన ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని అందించనుందని టాక్. ఇప్పుడు మూవీ టీమ్ సాంక్రాంతి సెలవుల తర్వాత ఒక ఫ్యామిలీ సాంగ్ చిత్రీకరణను ప్లాన్ చేస్తోంది. ఈ పాట కుటుంబ కథా నేపథ్యంలో సాగే ఎమోషనల్ ట్రాక్ అని, అది ప్రేక్షకుల హృదయాలను తాకేలా ఉంటుందని సమాచారం. ఈ సాంగ్‌లో చిరంజీవి తన మేనరిజమ్స్‌తో అభిమానులను మంత్రముగ్ధులను చేయబోతున్నారని తెలుస్తోంది. మరోవైపు, ఈ పాట చిత్రీకరణకు ముందు సినిమా క్లైమాక్స్ వర్క్స్ మీద మేకర్స్ ఫోకస్ చేస్తున్నారని ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తోంది. సినిమా విజువల్ గ్రాండియర్ కోసం జాగ్రత్తలు తీసుకుంటున్న యూనిట్ ఇప్పటికే సీజీ వర్క్స్ మొదలుపెట్టింది. టాప్ లెవెల్ గ్రాఫిక్స్ కంపెనీలతో పని చేస్తున్న ఈ టీమ్, విజువల్స్‌ను ప్రేక్షకులకు అద్భుత అనుభూతి కలిగేలా రూపొందిస్తోందట. ప్రత్యేకంగా సోషియో ఫాంటసీ ఎలిమెంట్స్ కాబట్టి, గ్రాఫిక్స్ మరింత కీలక పాత్ర పోషించనున్నాయి. ఈ సినిమా విడుదలకు ఇంకా టైమ్ ఉన్నప్పటికీ కాస్త ముందే ప్రమోషన్లు భారీ స్థాయిలో మొదలయ్యే అవకాశాలున్నాయి. సంక్రాంతి తర్వాత ప్రమోషన్ కార్యక్రమాలకు సంబంధించి క్లారిటీ రానుంది. ఇక సమ్మర్ స్పెషల్‌గా మే 9న సినిమా రిలీజ్ చేస్తారని మేకర్స్ ఇప్పటికే ఫిక్స్ అయినట్లు తెలుస్తోంది. మరోవైపు, చిరంజీవి కొత్త స్టిల్స్ కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. విశ్వంభర చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, విక్రమ్ రెడ్డి భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఆస్కార్ విజేత ఎం ఎం కీరవాణి సంగీతం అందిస్తున్న ఈ మూవీకి టెక్నికల్ టీమ్ అందరూ టాప్ లెవెల్‌లో ఉన్నారు. ఈ చిత్రం మెగాస్టార్ కెరీర్‌లో మరో కీలకంగా నిలుస్తుందని, చిరు వశిష్ట కాంబినేషన్ మేజిక్ చేయబోతుందని సినీ పరిశ్రమలో చర్చ జరుగుతోంది. ఇక ఇప్పుడు చిత్రీకరణ పూర్తి కావడం, గ్రాఫిక్స్ ఫినిష్ అవ్వడంతో, విశ్వంభర రిలీజ్ డేట్ దగ్గర పడుతుందని అర్ధమవుతుంది. అభిమానులకు ఫ్యామిలీ ఆడియెన్స్ కు ఈ సినిమా సమ్మర్ ట్రీట్ ఇస్తుందని మేకర్స్ నమ్ముతున్నారు. మరి విశ్వంభర బాక్సాఫీస్ ఫలితం ఎలా ఉంటుందో తెలియాలి అంటే, మరికొన్ని రోజులు వేచి చూడాలి.

# రష్మిక అడగడం కాదు వాళ్లే పెంచేస్తారు..!

నేషనల్ క్రష్ రష్మిక కెరీర్ ఒక రేంజ్ ఫాం లో కొనసాగుతుంది. అదేంటో రష్మిక చేసిన సినిమాలన్నీ వరుస బ్లాక్ బస్టర్స్ అవుతున్నాయి. బాలీవుడ్ లో యానిమల్ తో సెన్సేషనల్ హిట్ అందుకున్న అమ్మడు లేటెస్ట్ గా పుష్ప 2 తో మరోసారి అదరగొట్టేసింది. పుష్ప 2 సినిమాలో శ్రీవల్లి పాత్రలో రష్మిక సూపర్ అనిపించేసింది. పుష్ప 1 లో కన్నా ఈ పార్ట్ లో ఆమెకు కాస్త స్కోప్ ఎక్కువ దొరికేసింది. ఇక దొరికిందే ఛాన్స్ అన్నట్టుగా రష్మిక ఇంప్రెస్ చేసింది. ఐతే రష్మిక్ సినిమాలో ఉంది అంటే ఆ పాత్రకు పూర్తిస్థాయి న్యాయం జరిగినట్టు. పుష్ప 2 లో శ్రీవల్లి పాత్రతో అది మరోసారి ప్రూవ్ చేసింది అమ్మడు. యానిమల్ హిట్ తోనే రష్మిక కు భారీ ఆఫర్లు వస్తుండగా పుష్ప 2 ఎఫెక్ట్ తో మరిన్ని క్రేజీ ఛాన్స్ లు వచ్చేలా ఉన్నాయి. అంతేకాదు



రష్మిక మరీ ఆలోచిస్తే ఆమె తీసుకుంటున్న రెమ్యునరేషన్ కి ఇంకా పెంచి ఇచ్చేలా చూస్తున్నారు. హిట్ కొట్టిన హీరో అయినా హీరోయిన్ అయినా రెమ్యునరేషన్ టాప్ లేపేస్తారని తెలిసిందే. యానిమల్ హిట్ అయిన టైంలోనే రష్మిక రెమ్యునరేషన్ గురించి ప్రత్యేక డిస్కషన్ జరగ్గా ఇప్పుడు అది నిజం చేసేలా ఉంది. కథ నచ్చితే రెమ్యునరేషన్ గురించి హీరోయిన్స్ పెద్దగా పట్టించుకోరు కానీ ఆమెకు మార్కెట్ లో ఉన్న డిమాండ్ ను బట్టి నిర్మాతలే సినిమా సినిమాకు కథానాయికల రెమ్యునరేషన్ పెంచేస్తారు. అందులోనూ వరుస బ్లాక్ బస్టర్ హిట్ కొడుతున్న హీరోయిన్ అయితే మాత్రం అడిగిన దానికన్నా ఎక్కువే ఇస్తారు. పుష్ప 2 కోసం రష్మిక దాదాపు రెండు సినిమాలకు ఇవ్వాల్సిన డేట్ ఇచ్చిందట. ఆ విషయాన్ని నిర్మాత చెప్పి షాక్ ఇచ్చారు. సో ఆమెలా సినిమా కోసం కమిటెడ్ గా ఉన్న కథానాయికలకు రెమ్యునరేషన్ కాస్త ఎక్కువ ఇచ్చినా పర్లేదని చెప్పొచ్చు. పుష్ప 2 ప్రమోషన్స్ లో పాల్గొనడమే కాదు సోషల్ మీడియాలో పుష్ప 2 గురించి పెట్టే ప్రతి కామెంట్ కు రష్మిక ఓపికగా రెస్పాండ్ అవుతుంది. రష్మిక డెడికేషన్ తో ఆడియన్స్ ని ఆమె ఫ్యాన్స్ గా మార్చేసుకుంటుంది. ప్రస్తుతం రష్మిక కుబేర, గర్ల్ ఫ్రెండ్, సికిందర్ సినిమాల్లో నటిస్తుంది. కుబేర సినిమాలో కూడా ఆమెకు మంచి రోల్ దక్కిందని తెలుస్తుంది.

# ఐడెంటిటీని మార్చుకోవాలని నటి భర్త కండీషన్!

80లు, 90లలో అందరికి ఇష్టమైన ప్రముఖ హీరోయిన్. సల్మాన్ ఖాన్, షారుఖ్ ఖాన్, గోవిందా వంటి అగ్ర హీరోలతో కలిసి పనిచేసింది. అనూహ్యంగా ఓ వివాదాస్పద కేసులో ఆమె పేరు వినిపించడంతో సడెన్ గా అందరి దృష్టిని ఆకర్షించింది. అటుపై నటన విరమించాక నగల డిజైనింగ్ వైపు మళ్లింది. ఇదంతా ఎవరి గురించి? అంటే... పాపులర్ సీనియర్ కథానాయిక నీలం కొఠారి సోనీ గురించి. ఆమె 1984లో 15 ఏళ్ల వయసులో జవానీ చిత్రంలో తొలిసారిగా నటించింది. దీని తర్వాత లవ్ 86, ఇల్జామ్, సిందూర్, ఖుద్గర్జ్, హత్య, ఫర్జ్ కి జంగ్, బిల్లూ బాద్షా, ఆగ్ హీ ఆగ్ వంటి సినిమాల్లో నటించింది. సూరజ్ బర్జాత్యా హమ్ సాథ్ సాథ్ హై.. కరణ్ జోహార్ -కుచ్ కుచ్ హోతా హైలో అతిధి పాత్రతోను మెప్పించింది. ఇంతలో బాలీవుడ్‌లో నీలం చివరి చిత్రం 2001లో విడుదలైన కసమ్. 2020లో నెట్‌ఫ్లిక్స్‌లో ఫ్యాబులస్ లైవ్స్ ఆఫ్ బాలీవుడ్ వైవ్స్ అనే డ్రామా రియాలిటీ సిరీస్‌తో తిరిగి అభిమానుల ముందుకు వచ్చింది. ఆ తర్వాత నటనకు దూరమై నగల డిజైనింగ్ వైపు మొగ్గు చూపింది. నాలుగు తరాల నగల వ్యాపారుల కుటుంబం నుండి



వచ్చిన నీలం గత సంవత్సరం నేచురల్ డైమండ్స్ డాట్ కామ్‌తో మాట్లాడింది. నటనకు స్వస్తి చెప్పి కుటుంబ వ్యాపారంలోకి అడుగుపెట్టాలనే తన నిర్ణయం గురించి కూడా చెప్పుకొచ్చింది. ప్రతిదానికీ షెల్ఫ్ లైఫ్ ఉన్నట్లే, ఆశించిన అవకాశాలు తగ్గిపోవడంతో నటనకు వీడ్కోలు చెప్పే సమయం వచ్చిందని .. నా జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించాలని నాకు తెలుసు అని అంగీకరించింది. అదృష్టవశాత్తూ నాకు బ్యాకప్ ప్లాన్ ఉంది అని కొఠారి చెప్పారు. తన తండ్రి నుండి వజ్రాల గురించి ప్రతిదీ నేర్చుకున్నట్లు అంగీకరించింది. ఆమె ప్రయోగాత్మకంగా శిక్షణ పొందుతున్నప్పుడు తన అభిరుచిని మెరుగుపరుచుకున్నానని తెలిపింది. సూరజ్ బర్జాత్యా - హెచ్ఎస్ఎస్‌హెచ్ షూటింగ్ సమయంలో సల్మాన్, టబు, సైఫ్ అలీ ఖాన్ , సోనాలి బింద్రేలతో పాటు 1998 కృష్ణజింకలను వేటాడిన కేసులో ఆమె పేరు కూడా వినిపించింది. ఈ కేసువల్ల నీలం పేరు మార్మోగింది. నీలం గతంలో రిషి సేథియాను వివాహం చేసుకుంది. 2000లో వివాహం చేసుకున్న తర్వాత ఈ జంట అక్టోబర్ 2000లో విడాకులు తీసుకున్నారు. FLOBW మూడవ సీజన్‌లో భారతీయ దుస్తులను ధరించమని .. నాన్ వెజ్ ,ఆల్కహాల్ మానేయమని అతడు చెప్పినట్లు నీలం వెల్లడించింది. ఆమె అన్నింటికీ ఓకే చెప్పినా కానీ, ఆమె ఐడెంటిటీని కూడా మార్చమని అడిగాడని తెలిపింది. తరువాత సమీర్ సోనీలో మళ్లీ ప్రేమను కనుగొని 2011లో అతనిని వివాహం చేసుకుంది. ఈ జంట 2013లో ఒక కుమార్తెను దత్తత తీసుకున్నారు. ఆమెకు వారు అహానా అని పేరు పెట్టారు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536